Pubilshed from Tirupathi

PRGI NO : APTEL/25/A2316

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com




తిరుపతి TIRUPATHI | సంపుటి : 01 | సంచిక : 306 | శుక్రవారం | జూలై 24, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ

Vol.No : 01 | Issue No : 306 | Friday | 24 JULY 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana

# భూదోపిడికి అడ్డుకట్ట..

## వివాదరహిత రాష్ట్రం గా ఏపీ అవ్వాలి..

- భూ సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి
- భూ రికార్డులకు శాశ్వత భద్రత కల్పించేలా మీ భూమి-బ్లాక్ చెయిన్
- ట్యాంపర్ చేయలేని విధంగా ల్యాండ్ రికార్డులకు హై సెక్యూర్టీ
- మీ భూమి-బ్లాక్ చెయిన్ పైలెట్ ప్రాజెక్టును ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

**» భూ తగాదాల సమస్యే రాకూడదు..**



ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:


ప్రక్షాళన-విముక్తి-భద్రత అంశాలుగా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ల్యాండ్ లిటిగేషన్ ఫ్రీ రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దేలా కృషి చేస్తున్నామని సీఎం తెలిపారు. దీనికి అనుగుణంగానే భూ రికార్డులకు శాశ్వత భద్రత కల్పించేలా మీ భూమి-బ్లాక్ చెయిన్ ప్రాజెక్టును తెచ్చామని సీఎం చంద్రబాబు చెప్పారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి మీ భూమి-బ్లాక్ చెయిన్ పైలెట్ ప్రాజెక్టును వర్చువల్‌గా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు.

ఈ మేరకు ఈ ప్రాజెక్టులో ఉన్న ఫీచర్స్, ప్రత్యేకతలను సీఎస్ సాయి ప్రసాద్, రెవెన్యూ శాఖ అధికారులు సీఎం చంద్రబాబుకు వివరించారు. భూ రికార్డులకు శాశ్వత భద్రత కల్పించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు బ్లాక్‌చెయిన్ విధానాన్ని రెవెన్యూ శాఖ రూపొందించినట్టు తెలిపారు. భవిష్యత్తులో భూ సమస్యలకు చెక్ పెట్టేలా... ప్రతీ ల్యాండ్ పార్సెల్‌కు ప్రత్యేక డిజిటల్ ఐడీ ఇచ్చి ట్యాంపర్-ప్రూఫ్, సెక్యూరిటీతో లావాదేవీలు జరిగేలా బ్లాక్ చెయిన్ వ్యవస్థను తీర్చిదిద్దినట్టు వెల్లడించారు.

- మిగతా 2లో..

## నాలుగో రోజూ తప్పని నష్టాలు..

- సెన్సెక్స్ 364 పాయింట్లు డౌన్
- నిఫ్టీ 127 పాయింట్లు పతనం
- 76,391.39 వద్ద బీఎస్ఈ , 23,869.60 వద్ద స్థిరపడ్డ ఎన్ఎస్ఈ
- అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలతో పెరిగిన చమురు ధరలు
- బ్యాంకింగ్, రియాల్టీ షేర్లపై అమ్మకాల ఒత్తిడి
- స్వల్ప లాభాల్లో ముగిసిన ఆటో రంగ షేర్లు



- మిగతా 2లో..



## థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేయాలి..

- బకాయి వేతనాలు చెల్లించాలని వినతి
- వైయస్ జగన్‌ను కలిసిన ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్ట్ కార్మికుల యూనియన్ ప్రతినిధులు
- కార్మికులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది : వైసీపీ అధినేత వైయస్ జగన్

ప్రజాభూమి ప్రతినిధి,తాడేపల్లి : మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌ను గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల యూనియన్ ప్రతిని ధులు గురువారం కలిశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయనను కలిసి తమ సమస్యలను వివరించారు. గత 26 ఏళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7 వేల మంది కార్మికులు సమగ్ర మంచినీటి పథకాలలో పనిచేస్తున్నారని యూనియన్ ప్రతిని ధులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు తాగునీరు అందించడంలో కీలకంగా పనిచేస్తున్నప్పటికీ తమకు ఉద్యోగ భద్రత, సకాలంలో వేతనాలు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

2 పేజీలో..

# నీట్‌ను రద్దు చేయాల్సిందే

**జంతర్ మంతర్ విద్యార్థుల ఆందోళనకు స్టాలిన్ మద్దతు**

- రాష్ట్రాల విద్యా విధానాలను గౌరవించాలన్న స్టాలిన్
- కోట్లు పిండుకునే కోచింగ్ సెంటర్ల ఆధిపత్యానికి నీట్ రెడ్ కార్పెట్ పరిచిందని మండిపాటు
- రాష్ట్రాల హక్కులు కాపాడబడాలంటే నీట్ రద్దు అనివార్యమని వ్యాఖ్య



తమిళనాడు : దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 'నీట్' పరీక్షకు వ్యతిరేకంగా రోడ్డెక్కిన విద్యార్థుల పోరాటానికి తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ అండగా నిలిచారు. ఆందోళన బాట పట్టిన యువతకు తన పూర్తి మద్దతు ప్రకటిస్తూ 'ఎక్స్' వేదికగా కేంద్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును త్రిశంకు స్వర్గంలో పడేసిన నీట్‌ను పూర్తిగా రద్దు చేయడమే ఈ సమస్యకు అసలైన పరిష్కారమని స్పష్టం చేశారు. "రాష్ట్రాల విద్యా విధానాలను గౌరవించండి.. నీట్‌కు వెంటనే స్వస్తి పలకండి" అని డిమాండ్ చేశారు.

ఏ ప్రాతిపదికనైతే నీట్ పరీక్షను దేశంలోకి తీసుకొచ్చారో, ఆ ఆశయాలన్నింటినీ ఈ వ్యవస్థ పూర్తిగా నీరుగార్చిందని స్టాలిన్ ఆరోపించారు. సమాన

2 పేజీలో..



## ప్రధాన్ రాజీనామాను బీఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయడం లేదు?

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఫిర్యాదు చేయాలని ముఖ్యమంత్రి డిమాండ్
- తప్పుడు ఫిర్యాదు అయితే లోపల వేయిస్తానని హెచ్చరిక
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు బీఆర్ఎస్ డిమాండ్ చేయడం లేదని విమర్శ

⏭ వివరాలు 2లో..

# మోడీ ప్రకటనను తిరస్కరించిన సీజేపీ




**కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే**

న్యూఢిల్లీ: ప్రశ్నపత్రాల లీకేజీ కేసుల విచారణ కోసం ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామని ప్రధాని నరేంద్ర మోడీ చేసిన ప్రకటనను సీజేపీ (కాక్రోచ్ జనతా పార్టీ) తిరస్కరించింది. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న తమ డిమాండ్‌ను సీజేపీ మరోసారి స్పష్టం చేసింది. ప్రధాని మోడీ 'ఎక్స్' వేదికగా పేపర్ లీక్‌లకు పాల్పడిన వారికి వేగవంతమైన విచారణలు, కఠిన శిక్షలు అమలు చేసేందుకు ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామని ప్రకటించిన వెంటనే, సీజేపీ అదే వేదికపై స్పందించింది. "ధర్మేంద్ర ప్రధాన్ తప్పనిసరిగా రాజీనామా చేయాలి" అని పేర్కొంది. ఫాస్ట్-ట్రాక్ కోర్టుల ఏర్పాటు మాత్రమే సరిపోదని, ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై రాజకీయ బాధ్యతను విద్యాశాఖ మంత్రి వహించాలని సీజేపీ అభిప్రాయపడింది. ప్రభుత్వ తాజా ప్రకటనతో తమ డిమాండ్లు నెరవేరలేదని స్పష్టం చేసింది.

2 లో

## 2022లో 'జెకెఎస్ఎస్‌బి' ప్రశ్నాపత్రం లీకైంది



- కేంద్రమంత్రికి ఒమర్ అబ్దుల్లా రిప్లై

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లో సర్వీసెస్ సెలక్ష?న్ బోర్డ్ (జెకెఎస్ఎస్‌బి) పేపర్ లీక్ వ్యవహారంలో నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) ప్రభుత్వానికి సంబంధం ఉందంటూ కేంద్రమంది జె.పి.నడ్డా చేసిన వ్యాఖ్యలను సిఎం ఒమర్ అబ్దుల్లా తోసిపుచ్చారు. 2024లో తమ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ముందే.. 2022లో లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్‌జి)పాలనలో ఆ ఘటన జరిగిందని అన్నారు. ఎస్ఎస్‌బి పేపర్‌లీక్ కుంభకోణంలో ఎన్‌సి,

2 లో..

# ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్నాయి

- రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలి.
- సాగు నీటి ఎద్దడిని తట్టుకోవడానికి ప్రత్యామ్నాయ పంటలు వేయాలి.
- గోదావరి,కావేరి నదుల అనుసంధానంతో తాగు,సాగు నీటి సమస్యలకు చెక్ పెట్టవచ్చు.
- నదులు అనుసంధానంతో అద్భుత ఫలితాలు సాధించగలం
- సమాచార,పౌర సంబంధాలు,గృహ నిర్మాణ శాఖామంత్రి కొలుసు పార్థసారథి

6 లో



ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి :

ఎల్ నినో ప్రభావం ఈ ఏడాది అధికంగా ఉంటుంది కావున రైతుల శ్రేయస్సు దృష్ట్యా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో మంత్రులు,అధికారులు సమన్వయంతో సమస్య నుండి రైతులు గట్టెక్కే విధానాలపై కసరత్తు చేస్తున్నామని రాష్ట్ర సమాచార,పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగిన 1390 వ (53వ) క్యాబినెట్ సమావేశంలో పలు అంశాలపై తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర సచివాలయం

# అమరావతిలో పీఎన్ బీ క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్

- రాష్ట్ర ప్రభుత్వం- పంజాబ్ నేషనల్ బ్యాంక్ మధ్య ఎంఓయూ
- సీఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పందం



ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:

అమరావతి క్వాంటం వ్యాలీలో మరో కీలకమైన ప్రాజెక్టు ఏర్పాటుకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ ముందుకు వచ్చింది. అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ లో క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేసేందుకు ఏపీ క్వాంటం మిషన్-పంజాబ్ నేషనల్ బ్యాంక్ మధ్య ఒప్పందం కుదిరింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు- పీఎన్ బీ సీఈఓ, ఎండీ అశోక్ చంద్ర సమక్షంలో ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు. దేశంలో బ్యాంకింగ్ రంగం కోసం ప్రత్యేకంగా క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న మొట్ట మొదటి బ్యాంక్‌గా పంజాబ్ నేషనల్ బ్యాంక్ నిలిచింది.

2 పేజీలో..

బ్యాంకింగ్ సేవల్లో సైబర్ భద్రతను పటిష్టం చేయటంతో పాటు ఆర్థిక మోసాలను ముందుగా గుర్తించే వ్యవస్థ ఏర్పాటు, భవిష్యత్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థల్ని సురక్షితంగా నిర్వహించేందుకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఈ క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తోంది. పరిశ్రమలు, విద్యా సంస్థలు, స్టార్టప్ లు, పరిశోధనా సంస్థలతో పాటు ప్రభుత్వ ఏజెన్సీలను కూడా ఒకే వేదికపైకి తెచ్చేలా క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ పని చేయనుంది. క్వాంటం కంప్యూటింగ్ సహా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో పరిశోధనలు, నూతన ఆవిష్కరణల్ని ప్రోత్సహించేందుకు అవసరమైన నైపుణ్యాలను కూడా పెంపొందించేలా ఈ హబ్ పని చేయనుంది.

ప్రజాభూమి


# సంపాదకీయం

## నీట్ పేపర్ లీక్ - సిజెపి ఉద్యమం - చలో పార్లమెంట్

భారత విద్యా వ్యవస్థ పెద్ద సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. పేపర్ లీకేజీలు, పరీక్షల్లో అవకతవకలు, అవినీతి విద్యారంగంలో భారీగా పెరిగాయి. దీన్ని ప్రశ్నిస్తూ విద్యార్థులు, యువత ముందుకొచ్చారు. దేశ రాజధాని ఢిల్లీ వీధుల్లో పోరాడుతున్నారు. మా భవిష్యత్తు ఏమిటని రాజ్యాన్ని ప్రశ్నిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఈ ఏడాది మే 3వ తేదీన 22.05 లక్షల మంది విద్యార్థులు నీట్ రాశారు. కానీ పరీక్షకు 72 గంటల ముందే రాజస్థాన్ పోలీసులు ఒక కోచింగ్ సెంటర్‌పై దాడి చేసి ప్రశ్నాపత్రం సెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. సోషల్ మీడియాలో పేపర్ రూ.8 లక్షల నుండి రూ.40 లక్షల వరకు అమ్ముడైనట్లు ఆధారాలు బయటకు వచ్చాయి. విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందారు. దాంతో కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి పరిస్థితుల్లో పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. సిబిఐ దర్యాప్తునకు ఆదేశించింది. దాదాపు 20 మందికి పైగా అరెస్టయ్యారు. రీటెస్ట్ తేదీ ప్రకటించారు. కానీ తీవ్ర మానసిక ఒత్తిడికి గురై 18 మంది నీట్ అభ్యర్థులు ఆత్మహత్య చేసుకున్నారు. జూన్ 21 రీటెస్ట్‌కు 19.99 లక్షల మంది మాత్రమే హాజరయ్యారు. జులై 16న ఫలితాలు వచ్చాయి. కానీ కౌన్సెలింగ్ ఆలస్యం కావడంతో ఎంబిబిఎస్ సీట్లు, కాలేజీలు అన్నీ లేటయ్యాయి. ఒక సంవత్సరం వృథా. ఈ నష్టానికి బాధ్యత ఎవరిది?ఈ అన్యాయాన్ని చూసి చూసి సహించలేక విద్యార్థులు సంఘటితమయ్యారు. కాక్రోచ్ జనతా పార్టీ నాయకులందరూ నీట్, జెఇఇ, సియుఇటి రాసిన విద్యార్థులే. ఉన్నత చదువులు చదువుకున్నా ఉద్యోగాలు లేక నిరుద్యోగులుగా జీవించలేక పోరు బాట పట్టారు. తమ భవిష్యత్తు గురించి ప్రశ్నిస్తున్నారు. సిజెపి ఉద్యమం ప్రారంభమైన రోజు నుంచే సామాజిక కార్యకర్త, విద్యావేత్త సోనం వాంగ్‌చుక్ ఈ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. జులై 10న ప్రభుత్వం చర్చలకు నిరాకరించడంతో ఆయన జంతర్ మంతర్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు. ప్రధానిని, విద్యా మంత్రిని కలిసి డిమాండ్ల పత్రాన్ని ఇచ్చేందుకు సిజెపి "చలో పార్లమెంట్"కు పిలుపునిచ్చింది. విద్యార్థులు, యువతపై కనీసం జాలి, దయ, కరుణ లేని ప్రభుత్వం, పోలీసులు వారిపై దమనకాండను ప్రదర్శించారు. మొదట వాటర్ క్యానన్లు ప్రయోగించారు. తర్వాత లాఠీచార్జ్. పారిపోతున్న విద్యార్థులను వెంబడించి మరీ కొట్టారు. అరెస్టులు చేశారు. 24 గంటల పాటు న్యాయవాదిని కూడా కలవనివ్వలేదు.ఇప్పుడు చట్టపరంగా చూద్దాం. భారత రాజ్యాంగ ఆర్టికల్ 19(1)(ఎ) ప్రతి పౌరుడికి భావ ప్రకటనా స్వేచ్ఛ ఇస్తుంది. ఆర్టికల్ 19(1)(బి) శాంతియుతంగా గుమిగూడే హక్కు ఇస్తుంది. విద్యార్థులు ఈ రెండు హక్కులను ఉపయోగించారు.

పోలీసు చట్టం 1861 సెక్షన్ 129 ప్రకారం గుంపును చెదరగొట్టే ముందు మూడు సార్లు హెచ్చరించాలి. అది చేయలేదు. సిఆర్‌పిసి సెక్షన్ 151 ప్రకారం ముందస్తు అరెస్టుకు కారణం ఉండాలి. కేవలం నిరసన చేస్తారనే అనుమానంతో అరెస్టు చేయడం చట్టవిరుద్ధం. మానవ హక్కుల చట్టం 1993 ప్రకారం నిర్బంధంలో హింస నేరం. వీడియోల్లో కనిపించిన లాఠీ దెబ్బలు ఈ నేరం కిందకు వస్తాయి. విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం ప్రభుత్వం విద్యా వ్యవస్థను కాపాడాలి. బదులుగా దానిని నాశనం చేసిన వారిని కాపాడుతోంది. సుప్రీం కోర్టు అనేక తీర్పుల్లో "శాంతియుత నిరసనను అణచివేయడం రాజ్యాంగ ఉల్లంఘన" అని స్పష్టం చేసింది. కాబట్టి ఈ ప్రభుత్వ చర్యలు రాజ్యాంగ విరుద్ధం, చట్టవిరుద్ధం, నైతికంగా తప్పు. ఈ పేపర్ లీక్ కేవలం ఒక అధికారి తప్పు కాదు. దీని వెనుక ఒక పెద్ద నెట్‌వర్క్ ఉంది. మొదటి లింక్ కోచింగ్ సెంటర్లు. రూ.62 వేల కోట్ల ఇండస్ట్రీ. ఒక సీటు కోసం లక్ష నుండి రూ.6 లక్షల వరకు ఫీజు. రెండవ లింక్ ఎన్‌టిఎ లోని అవినీతి అధికారులు. ప్రశ్నాపత్రం ప్రింటింగ్ ప్రెస్ నుండి పరీక్షా కేంద్రానికి వెళ్లే లోపు అనేక చేతులు మారుతుంది. మూడవ లింక్ రాజకీయ అండ. కొన్ని రాష్ట్రాల్లో పోలీసులు, స్థానిక నాయకులు ఈ దందాకు సహకరిస్తున్నారు. నాల్గవ లింక్ డార్క్ వెబ్, టెలిగ్రామ్ గ్రూపులు. ఇక్కడ పేపర్ వేలంలో అమ్ముతారు. పేద విద్యార్థి కోచింగ్ ఫీజు కట్టలేడు. ధనిక విద్యార్థి రూ.30-40 లక్షలు పెట్టి లీకైన పేపర్ కొంటాడు. ఫలితంగా అర్హత ఉన్న పేద విద్యార్థి వెనుకబడిపోతాడు. డబ్బుంటే అనర్హుడైనా ఎంబిబిఎస్ సీటు కొడతాడు. ఇది రాజ్యాంగ ఆర్టికల్ 14 - సమానత్వ హక్కు, ఆర్టికల్ 21ఎ - విద్యా హక్కు ఉల్లంఘన. విద్యను వ్యాపారంగా మార్చినంత కాలం ఈ లీకేజీలు ఆగవు. ప్రభుత్వం ఈ మొత్తం వ్యవహారంలో మూడు తప్పులు చేసింది. మొదటిది ముందస్తు చర్య లేదు. ఎన్‌టిఎ పై వస్తున్న ఆరోపణలను సంవత్సరాలుగా పట్టించుకోలేదు. రెండవది ప్రశ్నాపత్రం లీక్ అయిన తర్వాత పారదర్శకత లేదు. సిబిఐ దర్యాప్తు వివరాలు బయటకు చెప్పడం లేదు. మూడవది నిరసన చేసిన వారిని నేరస్తుల్లా చూడటం. ప్రధాని మోడీ గత 10 రోజులుగా ఒక్క ట్వీట్ కూడా చేయలేదు. విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ "ఇది చిన్న సమస్య" అన్నారు. కేంద్ర మంత్రులు "విద్యార్థులను రాజకీయాలకు వాడుతున్నారు" అనే అభాండాలు వేశారు. కానీ రాజకీయాలకు విద్యార్థుల భవిష్యత్తును వాడుతున్నారు. ప్రభుత్వం చివరికి జులై 15న చర్చలకు పిలిచింది. కానీ అది కూడా షరతులతో కూడుకున్నది. "దీక్ష విరమించిన తర్వాతే చర్చలు" అన్నారు. ఒక వ్యక్తి ప్రాణాలతో ఉన్నప్పుడే చర్చలు జరగాలి. ప్రాణం పోయిన తర్వాత చర్చలు దేనికి? ఈ మొండి వైఖరి ప్రజాస్వామ్యానికి తీవ్రమైన అవమానం. మొదట ఎన్‌టిఎ ను వెంటనే రద్దు చేయాలి. దాని స్థానంలో విద్యావేత్తలు, న్యాయమూర్తులు, విద్యార్థి ప్రతినిధులు ఉండే స్వతంత్ర కమిషన్ ఏర్పాటు చేయాలి. పరీక్షలను ఆఫ్‌లైన్ నుండి ఆన్‌లైన్ సిబిటి మోడ్‌కు మార్చాలి. ప్రశ్నలు రాండమ్‌గా జనరేట్ అయ్యేలా చేయాలి. పేపర్ లీక్‌ను అరికట్టేందుకు కఠిన చట్టం తేవాలి. నిందితుల ఆస్తులు జప్తు చేయాలి. 2026 నీట్ వల్ల నష్టపోయిన ప్రతి విద్యార్థికి 2 లక్షల నష్టపరిహారం, ఒక సంవత్సరం ఉచిత కోచింగ్ ఇవ్వాలి. విద్యా బడ్జెట్‌ను జిడిపి లో 6 శాతానికి పెంచాలి. నిరుద్యోగానికి పరిష్కారంగా ప్రతి సంవత్సరం రూ.2 కోట్ల ఉద్యోగాల క్యాలెండర్ ప్రకటించాలి. కోచింగ్ సెంటర్లను రెగ్యులేట్ చేయాలి. ఫీజు క్యాప్ పెట్టాలి. చనిపోయిన నీట్ విద్యార్థుల కుటుంబాలకు
కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలి. అవినీతి, పేపర్ లీకేజీ, విద్యా వ్యవస్థలోని అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి. ఉద్యమం చేస్తున్న విద్యార్థుల పైన, మద్దతుదారుల పైన పెట్టిన కేసులను ఎత్తివేయాలి. వారికి మద్దతు ఇస్తూ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న సోనం వాంగ్ చుక్ బృందంతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించాలి. ఆయన్ని బేషరతుగా విడుదల చేయాలి.

## థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేయాలి..

థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ విధానం కారణంగా అనేక జిల్లాల్లో కార్మికులకు చెల్లించాల్సిన ఎస్ఎస్ఆర్ రేట్లను తగ్గించి ఇస్తున్నారని వైయస్ జగన్ దృష్టికి తీసుకువచ్చారు. కొన్ని ప్రాంతాల్లో 10 నుంచి 20 నెలల వరకు వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వాపోయారు.

నెలల తరబడి జీతాలు అందకపోవడంతో కుటుంబ పోషణ, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. సంవత్సరాలుగా సేవలందిస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం అన్యాయమని పేర్కొన్నారు. థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను తక్షణమే చెల్లించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని యూనియన్ ప్రతినిధులు వైయస్ జగన్‌ను కోరారు. కార్మికులకు నిర్ణీత రేట్ల ప్రకారం వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ ప్రతినిధులు వివరించిన సమస్యలను సావధానంగా విన్న వైయస్ జగన్ వారికి ధైర్యం చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్ట్ కార్మికులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వైయస్ జగన్ ను కలిసిన వారిలో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్, దేవినేని అవినాష్, మల్లాది విష్ణు, తన్నీరు నాగేశ్వరరావు తదితరలు ఉన్నారు.

## నాలుగో రోజూ తప్పని నష్టాలు..

**న్యూఢిల్లీ: అమెరికా-ఇరాన్ మధ్య తాజా ఉద్రిక్తతలతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరగడం భారత స్టాక్ మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపింది. దీంతో దేశీయ సూచీలు వరుసగా నాలుగో రోజూ నష్టాల్లో ముగిశాయి.**

**గురువారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 364 పాయింట్లు పడిపోయి 76,391.39 వద్ద ముగిసింది. నిఫ్టీ 127 పాయింట్లు కోల్పోయి 23,869.60 వద్ద స్థిరపడింది.**

**నిఫ్టీ-50 సూచీలో ఎస్‌బీఐ లైఫ్, బజాజ్ ఆటో, ఎంఅండ్ఎం, టీసీఎస్, టాటా కన్స్యూమర్స్ షేర్లు లాభపడ్డాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్, నెస్లే ఇండియా, శ్రీరామ్ ఫైనాన్స్, అదానీ పోర్ట్స్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్ షేర్లు నష్టపోయిన వాటిలో ఉన్నాయి. బ్యాంకింగ్, రియాల్టీ, చమురు సంబంధిత షేర్లలో అమ్మకాల ఒత్తిడి ఎక్కువగా కనిపించింది. నిఫ్టీ రియాల్టీ సూచీ 1.81 శాతం క్షీణించగా, పీఎస్‌యూ బ్యాంక్ సూచీ 1 శాతం, నిఫ్టీ బ్యాంక్ 0.94 శాతం చొప్పున పడిపోయాయి. కెమికల్, ఆయిల్ అండ్ గ్యాస్ సూచీలు కూడా నష్టాల్లో ముగిశాయి. అయితే ఆటో రంగం కొంత మెరుగ్గా రాణించింది. నిఫ్టీ ఆటో సూచీ 0.70 శాతం లాభపడగా, మీడియా సూచీ కూడా స్వల్ప లాభాల్లో ముగిసింది. పశ్చిమాసియాలోని భౌగోళిక ఉద్రిక్తతలు, పెరుగుతున్న ముడి చమురు ధరలు.. ద్రవ్యోల్బణం, కార్పొరేట్ లాభాలపై ప్రభావం చూపవచ్చనే ఆందోళనతో పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరించినట్లు మార్కెట్ నిపుణులు తెలిపారు.**

# భూదోపిడికి అడ్డుకట్ట..



ఇక భూ సమస్యలు ఉత్పన్నం కావడానికి డబుల్ రిజిస్ట్రేషన్లు ప్రధాన కారణంగా ఉన్నాయని... ఇకపై డబుల్ రిజిస్ట్రేషన్ సమస్యలను నివారించేలా బ్లాక్ చెయిన్ విధానం పని చేస్తోందని అధికారులు వివరించారు. భూ రికార్డులకు సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్‌గా ఉండేలా మీ భూమి-బ్లాక్ చెయిన్ ప్రాజెక్టును అందుబాటులోకి తెచ్చామని... రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ల శాఖలను ఒకే వేదిక మీదకు తెచ్చేలా ప్రాజెక్ట్ డిజైన్ చేశామని తెలిపారు. టీ×జ ఆంధ్రప్రదేశ్, టీ×జ బెంగళూరులోని సెంటరాఫ్ ఎక్స్ లైన్స్ ఇన్ బ్లాక్ చెయిన్ టెక్నాలజీ సంస్థలు సంయుక్తంగా హైపర్ లెడ్జర్ ఫ్యాబ్రిక్ టెక్నాలజీతో మీ భూమి-బ్లాక్ చెయిన్ వ్యవస్థను అభివృద్ధి చేసినట్టు అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాజెక్టును కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పు గోదావరి, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లోని ఒక్కో మండలంలో అమలు చేస్తున్నట్టు తెలిపారు. దీంట్లో భాగంగా ఆస్పరి, పెనుమూరు, రేపల్లె, గన్నవరం, కడియం, గుమ్మలక్ష్మీపురం, కొత్తవలస మండలాల పరిధిలోని 89 రీ-సర్వే గ్రామాల్లోని 1,37,763 ల్యాండ్ పార్సెల్ మ్యాప్‌లు కవర్ చేసేలా మీ భూమి-బ్లాక్ చెయిన్ పైలట్ ప్రాజెక్ట్ అమలు చేయనున్నట్టు వివరించారు. మీ భూమి-బ్లాక్ చెయిన్ అమలు జరిగే తీరును వివరించే వీడియోను అధికారులు ప్రజెంట్ చేశారు. ఇదే విధానంలో క్యూ ఆర్ కోడ్, ఆధార్ ను అనుసంధానించేలా చూడాలని ముఖ్యమంత్రి సూచించారు.

**అధ్యయనం చేయాలి..లోపాలు సరిదిద్దాలి**

మీ భూమి-బ్లాక్ చెయిన్ పైలెట్ ప్రాజెక్టు ప్రారంభించిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."భూ రికార్డులు సరిగా లేకపోవడం వల్ల విలువైన భూముల విషయంలో మోసాలు జరుగుతున్నాయి. తెలంగాణతో పోల్చుకుంటే ఏపీలో ల్యాండ్ లిటిగేషన్లు తక్కువే. కానీ గత ప్రభుత్వ విధానం వల్ల ఏపీలోనూ భూ తగాదాలు... వివాదాలు పెరిగాయి. 22ఏ పేరుతో కక్ష సాధింపులకు పాల్పడ్డారు. ప్రక్షాళన, విముక్తి, భద్రత వంటి అంశాలపై దృష్టి సారించి భూ సమస్యలను పరిష్కరిస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా సర్వేలు చేపడుతున్నాం.. రికార్డులను ప్రక్షాళన చేస్తున్నాం... పట్టాదార్ పాస్ పుస్తకాలు రాజముద్ర వేసి ఇస్తున్నాం. శెట్టిపల్లి, వట్టిచెరుకూరు, కంగుంది, గుటుపల్లి వంటి గ్రామాల్లో దశాబ్దాలుగా వివాదంలో ఉన్న భూములకు విముక్తి కల్పించాం. ఇప్పుడు ప్రారంభించిన మీ భూమి-బ్లాక్ చెయిన్ ప్రాజెక్టు ద్వారా భూములకు శాశ్వత భద్రత దక్కుతుంది. భూ రికార్డులకు సంబంధించి ట్యాంపర్ ప్రూఫ్ వ్యవస్థను తెస్తున్నాం.. పటిష్టమైన భద్రత కల్పిస్తున్నాం. బ్లాక్ చెయిన్ ద్వారా రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలు ఒకే వేదిక మీదకు వస్తాయి... ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్రయ విక్రయాలు చేసుకోవచ్చు. రెండు నెలల పాటు ఈ పైలెట్ ప్రాజెక్టు అమలును పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలి. ఈ వ్యవస్థ అమల్లో ఏమైనా లోటుపాట్లు ఉంటే వాటిని నమోదు చేసుకోవడానికి ఓ కంప్లైంట్ సెల్ పెట్టాలి...

దానికి అనుగుణంగా బ్లాక్ చెయిన్ ప్రాజెక్టులో మార్పులు చేర్పులు చేసుకోవచ్చు. ఇప్పటి నుంచి సర్వే పూర్తి అయిన గ్రామాలు బ్లాక్ చెయిన్ టెక్నాలజీ వ్యవస్థలోకి వెళ్తాయి. నవంబర్ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మీ భూమి-బ్లాక్ చెయిన్ టెక్నాలజీ వ్యవస్థ అందుబాటులోకి వచ్చేలా చూడాలి. భూ సమస్యలకు ఫుల్ స్టాప్ పెట్టేలా రెవెన్యూ వ్యవస్థను తీర్చిదిద్దుతున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సమస్యలకు పరిష్కారం చూపాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. భూ సమస్యలకు పరిష్కారం చూపితే ఫిర్యాదుల సంఖ్య గణనీయంగా తగ్గుతుంది."అని ముఖ్యమంత్రి చెప్పారు. మంత్రి అనగాని సత్య ప్రసాద్, సీఎస్ సాయి ప్రసాద్, రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, ఏడు జిల్లాల కలెక్టర్లు, ఏపీ-ఎన్ఐసీ, బెంగళూరు-ఎన్ఐసీ ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# 2022లో 'జెకెఎస్ఎస్‌బి' ప్రశ్నాపత్రం లీకైంది




కాంగ్రెస్ ప్రభుత్వాలకు సంబంధం ఉందని, అందుకే మౌనంగా ఉన్నాయని బుధవారం మీడియా సమావేశంలో జె.పి.నడ్డా ఆరోపించారు.

ఈ ఆరోపణలపై ఒమర్ అబ్దుల్లా గురువారం ఎక్స్ వేదికగా స్పందించారు. జమ్ముకాశ్మీర్‌లో ఎస్ఎస్‌బి పేపర్‌లీకైన వార్త వాస్తవమేనని, అయితే తేదీకి సంబంధించి మీకందని సమాచారం తప్పని అన్నారు. ఆ ఘటన 2022లో జరిగిందని, అప్పుడు ఎన్‌సి, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో లేదని, ఎల్‌జి నేతృత్వంలోని ప్రభుత్వం ఉందని అన్నారు. ఈ వైఫల్యం గురించి అందరికీ గుర్తుచేసినందుకు కేంద్రమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఈ అంశంలో జమ్ముకాశ్మీర్ హైకోర్టు చేసిన పరిశీలనలు, జారీ చేసిన ఆదేశాలు కూడా ఉన్నాయని అన్నారు.జమ్మూ కాశ్మీర్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డ్ (జెకెఎస్ఎస్‌బి) 'నిస్సిగ్గు అవకతవకల'పై విచారణ జరిపేందుకు, రిటైర్డ్ హైకోర్టు జడ్జి నేతృత్వంలో ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని ఎల్‌జి నేతృత్వంలోని యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసిన జమ్మూ కాశ్మీర్ మరియు లడఖ్ హైకోర్టు ఉత్తర్వులోని ఒక భాగాన్ని కూడా ఒమర్ అబ్దుల్లా ఎక్స్ పోస్ట్‌లో జతచేశారు. ఆ ఉన్నత స్థాయి కమిటీకి గానీ, ఆ నివేదికకు గానీ ఏమైందో మాకు తెలియదని అన్నారు. తర్వాత మీడియా సమావేశంలో మీరు ఆ వివరాలను వెల్లడించాలని కోరుకుంటున్నామని అన్నారు. 2022లో సబ్-ఇన్‌స్పెక్టర్లు, జూనియర్ ఇంజనీర్లు మరియు ఫైనాన్స్ అకౌంట్స్ అసిస్టెంట్లు వంటి పలు పోస్టుల కోసం జెకెఎస్ఎస్‌బి నిర్వహించిన నియామక పరీక్ష ప్రశ్నా పత్రాల లీకేజీ, అవినీతిపై విమర్శలు వెల్లువెత్తడంతో పరీక్ష?ను జమ్ముకాశ్మీర్ యంత్రాంగం రద్దు చేసిన సంగతి తెలిసిందే.

## ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాభావ

# పరిస్థితులు ఏర్పడుతున్నాయి

నాల్గవ భవనం ప్రచార విభాగంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పార్థసారథి వెల్లడించారు.

క్యాబినేట్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలు సమస్యలపై దిశానిర్దేశం చేశారని ముఖ్యంగా ఎల్ నినో ప్రభావంతో రైతులు సాంప్రదాయ పంటలు వేయటం వల్ల సకాలంలో సాగు నీరు అందక పోతే నష్టపోతారన్న అభిప్రాయం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యక్తం చేశారని తెలిపారు.ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం ఆగస్టు తరువాత మరింత తీవ్రంగా ఉండనుందని నిపుణులు హెచ్చరిస్తున్నారన్నారు.ఈ ఏడాది సాధారణం కంటే 51 శాతం కంటే ఎక్కువగా వర్షపాతం తగ్గుదల ఉంటుందని,దీంతో రైతులు సాగునీటి కష్టాలు ఎదుర్కోనే పరిస్థితులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కావున రైతులు ఈ ఏడాది నీటి ఎద్దడిని ఎదుర్కొనే ఆరుతడి పంటల సాగు వైపు మొగ్గుచూపాలని తద్వారా ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం నుండి తప్పించుకోవచ్చని సూచించారు.అంతేకాకుండా భూగర్భ జలాలు సైతం అడుగంటే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు.బోర్లు వేసి వ్యవసాయం చేద్దాం అనే ఆలోచన ను రైతులు చేయవద్దని కోరారు.దీంతో భూగర్భ జలాలు మరింత అటుగంటే ప్రమాదం పొంచి ఉందని మంత్రి పార్థసారథి అన్నారు.

పోలవరం వద్ద గోదావరి నది ప్రతి ఏడాది ఈ సమయానికి దాదాపు లక్ష క్యూసెక్కుల వరద నీరు ప్రవహించేదని కాని ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా పడటంతో ఈ ఏడాది కేవలం 35 నుండి 38వేల క్యూసెక్కుల వరద నీరు మాత్రమే ప్రవహిస్తోందని దీంతో గోదావరి,కృష్ణా పరివాహక ప్రాంతాల్లో సాగు నీరు అందని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు.ఒక వేళ మంచి వర్షాలు పడితే మంచిదే కాని ఎల్ నినో ప్రభావం పై రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.గోదావరి, కృష్ణా జలాలతో సాగు చేసే రైతులు ఇప్పటికే 70 శాతం మంది రైతులు నాట్లు వేశారని, కాని ఇప్పటి వరకు నాట్లు వేయని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మొగ్గు చూపాలని కోరారు.రైతులకు ప్రభుత్వం,వ్యవసాయ శాఖలు అండగా ఉంటాయని,రైతులు కూడా ప్రభుత్వం అందించే సూచనలు,సలహాలు పాటించాలని కోరారు. రైతులను ఆదుకోవడానికి వివిధ రకాల విత్తనాల కిట్లను అందించడానికి వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేస్తోందన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని,ఎల్ నినో ప్రభావం నుండి బయట పడాలని రైతులకు సూచించారు.తాగునీటి సరఫరాకు ట్యాంకర్ల వినియోగంపై కూడా ప్రభుత్వం సమాలోచన చేస్తుందన్నారు. అలాగే పశు గ్రాసం కొరత రాకుండా మెట్ట పంటల సాగు ఆలోచన చేయలని కోరారు. మన రాష్ట్రంలో 59 శాతం ఆయకట్టు భూమి,41 శాతం వర్షాధార పంట భూములు ఉన్నాయని,ఈ ఏడాది ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని సూచించారు. అందుకు అవసరమైన విత్తనాల కిట్లను కూడా వ్యవసాయ శాఖ సిద్ధం చేస్తుందన్నారు. నదుల అనుసంధానంతో అద్భుత ఫలితాలు సాధించవచ్చు అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరో సారి ఉద్ఘాటించారని మంత్రి పార్థసారథి తెలిపారు.ఎల్ నినో ప్రభావాలను తగ్గించడానికి జల వనరులను రెగ్యులైజ్ చేయాలన్న ఆలోచన ముఖ్యమంత్రి చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి తన ఆలోచనను కేంద్ర ప్రభుత్వం వద్ద ప్రతిపాదించడం జరిగిందన్నారు.గోదావరి నది, కావేరి నదులు వయా బనకచర్ల అనుసంధానం వల్ల మూడు రాష్ట్రాలకు అధిక ప్రయోజనం కలుగుతుందన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభిప్రాయం ఎంతో ఉపయుక్తమైనదన్నారు. కర్ణాటక,తమిళనాడు రిజీయన్ లో ఘర్షణ వాతావరణం సైతం తగ్గటమే కాకుండా తమిళనాడు తాగు నీటి సమస్యలకు చెక్ పెట్టవచ్చన్నారు.గోదావరి, కావేరి నదుల అనుసంధానంపై కేంద్రం సానుకూలంగా ఉండటం హర్షనీయమన్నారు. నదుల అనుసంధానం తెలంగాణా,ఏపి,తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు ప్రయోజనకరంగా ఉంటుందని, అంతే కాకుండా ఈ నాలుగు రాష్ట్రాల్లోని రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన చేస్తున్నారన్నారు.

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు గేమ్ ఛేంజర్ గా నిలవనుందని, ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమానా శ్రయాన్ని ప్రారంభించ నున్నారని మంత్రి పార్థసారథి తెలిపారు.అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ప్రభుత్వం సిద్ధం చేస్తోందన్నారు. ఈసమావేశంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కెఎస్.విశ్వనాధన్ పాల్గొన్నారు.

# అమరావతిలో పీఎన్ బీ క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్

**డిజిటల్ లిటరసీపై ప్రత్యేక కార్యాచరణ**

అమరావతిని క్వాంటం సహా డీప్ టెక్నాలజీలకు కేంద్రంగా మార్చాలని సంకల్పించామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఏక్యూవీలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ క్వాంటం ఏఐ ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయటం మరో కీలకమైన మైలు రాయి అవుతుందని సీఎం అన్నారు. బ్యాంకింగ్ లావాదేవీలు నిర్వహించే వినియోగదారులతో పాటు ప్రజలకు డిజిటల్ లిటరసీ పెంచే దిశగా కృషి చేయాలని ముఖ్యమంత్రి పీఎన్ బీ ఉన్నతాధికారులకు సూచించారు. ఈ దిశగా ప్రభుత్వాలు- బ్యాంకులు కలిసి పని చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. డిజిటల్ అరెస్ట్, సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయటంలో టెక్నాలజీ మరింత విస్తృతమవ్వాలని సీఎం సూచించారు. క్వాంటం టెక్నాలజీ ద్వారా డిజిటల్ లావాదేవీలకు భద్రతను అత్యుత్తమ స్థాయిలో అందించాలని సీఎం స్పష్టం చేశారు. డిజిటల్ బ్యాంకింగ్ ను మరింత పటిష్టంగా, సులభతరంగా సేవలు అందించేలా క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ ను అమరావతిలో ఏర్పాటు చేస్తున్నట్టు పంజాబ్ నేషనల్ బ్యాంక్ సీఈఓ ఎండీ అశోక్ చంద్ర ముఖ్యమంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో పీఎన్ బీ ఉన్నతాధికారులు, అమరావతి క్వాంటం మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్ పాల్గొన్నారు.





## ప్రధాన్ రాజీనామాను బీఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయడం లేదు?

తనకు రెండు చోట్ల ఓట్లు ఉన్నాయంటూ వస్తున్న ఆరోపణలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. హైదరాబాద్‌లో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడిన ఆయన, తనపై వస్తున్న ఆరోపణలపై దమ్ముంటే ఫిర్యాదు చేయాలని సవాల్ విసిరారు. ఒకవేళ అది తప్పుడు ఫిర్యాదు అని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తన ఓటు బదిలీ కోసం నిబంధనల ప్రకారం ఇప్పటికే కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. గతంలో జీహెచ్ఎంసీ పరిధిలో ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఓట్లను తొలగించారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, అప్పటి జీహెచ్ఎంసీ కమిషనర్‌పై కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 70 శాతం ఓటర్ల జాబితా సవరణ పూర్తయిందని, ప్రక్షాళన నెపంతో ఓట్లు గల్లంతు కాకుండా ఉండేందుకు బీఎల్ఓలను నియమించినట్లు వివరించారు. ఓట్లు లేకపోతే ప్రజలకు ప్రభుత్వ పథకాలు ఎలా అందుతాయని ఆయన ప్రశ్నించారు.హైడ్రా పనితీరుపై ముఖ్యమంత్రి ప్రశంసలు కురిపించారు. ఈ సంస్థ ఇప్పటికే అనేక అక్రమ ఆస్తులను స్వాధీనం చేసుకుందని వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పూర్తిగా గాలికొదిలేశారని విమర్శించారు. ఆ ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతి కారణంగానే కేసీఆర్ గతంలో హరీశ్ రావును కొంతకాలం మంత్రి పదవికి దూరంగా ఉంచారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇంటర్‌మీడియట్ ఫలితాల వెల్లడిలో జరిగిన తప్పిదాల వల్ల 27 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గ్లోబరీనా సంస్థ వ్యవహారంలో కేటీఆర్ తన నిజాయతీని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల మరణాలకు కారణమైన కేటీఆర్, ఇప్పటికైనా బహిరంగ క్షమాపణ చెప్పాలని అన్నారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను బీఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయడం లేదని ఆయన నిలదీశారు.



## నీట్‌ను రద్దు చేయాల్సిందే

విద్యా అవకాశాలు, పారదర్శకత, నాణ్యమైన విద్య అన్నవి కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని ఎద్దేవా చేశారు. క్షేత్రస్థాయిలో ఉన్న పాఠశాల విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ, కేవలం వేల కోట్లు పిండుకునే కార్పొరేట్ కోచింగ్ సెంటర్ల ఆధిపత్యానికి నీట్ రెడ్ కార్పెట్ పరిచిందని మండిపడ్డారు. విద్యార్థులు వ్యక్తం చేస్తున్న తీవ్ర ఆవేదన ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కావాలని స్టాలిన్ వ్యాఖ్యానించారు. గ్రామీణ, పేద, వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థుల డాక్టర్ కలలను నీట్ తుంచేస్తోందని.. సామాజిక న్యాయం నిలబడాలన్నా, రాష్ట్రాల హక్కులు కాపాడబడాలన్నా నీట్ రద్దు అనివార్యమని తేల్చిచెప్పారు. ఇకనైనా కేంద్రం తన మొండివైఖరిని వీడాలని కోరుతూ, 'Ban NEET, Save Students' నినాదంతో విద్యార్థుల వైపు నిలబడి పోరాటాన్ని కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

## మోడీ ప్రకటనను తిరస్కరించిన సీజేపీ

ఇదిలా ఉండగా, నీట్ పేపర్ లీక్ వివాదంపై తొలిసారిగా స్పందించిన ప్రధాని మోడీ, విద్యార్థుల భవిష్యత్తును పరిరక్షించడమే ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యత అని పేర్కొన్నారు. "మన యువత సంక్షేమం, భవిష్యత్తు కంటే ముఖ్యమైనది ఏదీ లేదు. పేపర్ లీక్‌లకు పాల్పడిన వారికి వేగవంతమైన, కఠినమైన శిక్షలు పడేలా ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. విద్యార్థుల ప్రయోజనాల పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాం. యువత భవిష్యత్తుతో చెలగాటమాడే వారిని వదిలిపెట్టబోము" అని ప్రధాని మోడీ 'ఎక్స్'లో పేర్కొన్నారు.





# మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌కు తల్లులతో పాటు తండ్రులు కూడా తప్పనిసరిగా హాజరుకావాలి..

**ప్రతి విద్యార్థి సమగ్ర ప్రగతి నివేదికపై తల్లిదండ్రులతో ఉపాధ్యాయుల వ్యక్తిగత చర్చ**

**పాఠశాలల అభివృద్ధికి విరాళాల కోసం 'డోనర్ యాప్' ప్రారంభం**

**99 శాతం తల్లికి వందనం నగదు జమ.. ఇంకా ఎవరికైనా నగదు జమ కాకపోయినా ఫిర్యాదు చేయవచ్చు**

**పాత్రికేయుల సమావేశంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజి**

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యా సంస్కరణల్లో భాగంగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ (మెగా పీటీఎం) కార్యక్రమానికి కృష్ణా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లులతో పాటు తండ్రులు కూడా తప్పనిసరిగా హాజరుకావాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి కోరారు.గురువారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశపు మందిరంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, గత మూడు విడతల మెగా పీటీ ఎంలలో ఎక్కువగా తల్లులు మాత్రమే పాల్గొన్నారని, రేపు జులై 24న జరగబోయే కార్యక్రమానికి ఈసారి తండ్రులు కూడా హాజరైతే పిల్లల విద్యా ప్రగతి, అభ్యాస స్థాయిపై ప్రత్యక్ష అవగాహనతో పాటు వారి అభివృద్ధికి మరింత తోడ్పాటు అందించే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రతి విద్యార్థి హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డ్ ఆధారంగా ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో వ్యక్తిగతంగా సమావేశమై విద్యార్థి అభ్యాస స్థాయి, బలాలు, లోపాలు, వాటిని మెరుగుపరిచే చర్యలపై సమగ్రంగా చర్చిస్తారని తెలిపారు. అలాగే తల్లిదండ్రులు తమ సందేహాలు, సూచ నలు, అభిప్రాయాలను ఉపాధ్యాయులతో స్వేచ్ఛగా పంచుకునేందుకు ఈ సమావేశం మంచి వేదికగా నిలుస్తుందని చెప్పారు.ఈ సంద ర్భంగా ఆ రోజు 'డోనర్ యాప్' ను కూడా ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. తమ గ్రామంలోని లేదా తాము చదివిన పాఠశాల అభివృద్ధికి సహకరించాలనుకునే పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు, దాతలు తమ శక్తి మేరకు ఈ యాప్ ద్వారా విరాళాలు అందించవచ్చని వివరించారు. పాఠశాల అవసరాలన్నీ యాప్‌లో అందు బాటులో ఉండటంతో పారదర్శకంగా విరాళాలు అందించే అవకాశం కల్పించామని చెప్పారు. తల్లికి వందనం పథకం కింద జిల్లాలో దాదాపు 99 శాతం మంది లబ్ధిదారుల ఖాతాల్లో ఆర్థిక సాయం జమైందని కలెక్టర్ తెలిపారు. ఇంకా ఎవరికైనా నగదు జమ కాకపోయినా లేదా ఇతర సమస్యలు ఉన్నా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా తమ స్థితిని తెలుసుకుని ఫిర్యాదు చేయవచ్చని, మిగిలిన అన్ని సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.జిల్లాలోని ప్రతి విద్యార్థి భవిష్యత్తు కోసం నిర్వహి స్తున్న ఈ మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌కు తల్లిదండ్రులు ఇద్దరూ తప్పనిసరిగా హాజరై కార్యక్ర మాన్ని విజయ వంతం చేయాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి యు వి సుబ్బారావు పాల్గొన్నారు.



# కలకొండ సజనికి పీహెచ్‌డీ ప్రదానం

## కృష్ణా విశ్వవిద్యాలయం నుంచి రసాయనశాస్త్రంలో డాక్టరేట్

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

కృష్ణా విశ్వవిద్యాలయ రసాయనశాస్త్ర విభాగంలో పూర్తిస్థాయి పరిశోధక విద్యార్థినిగా అధ్యయనం పూర్తి చేసిన కలకొండ సజనికి విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ (PhD) డిగ్రీని ప్రదానం చేసింది. విశ్వవిద్యాలయ ఉపకులపతి (వైస్ ఛాన్సలర్) ప్రొఫెసర్ రాంజీ కూనా చేతుల మీదుగా ఆమె ఈ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు.నానోమెటీరియల్స్‌పై విశేష పరిశోధనకృష్ణా విశ్వవిద్యాలయ రసాయన శాస్త్ర విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి. రామశేఖర రెడ్డి, విజయవాడ కేబీఎన్ (KBN) కళాశాల ప్రిన్సిపాల్ డా.జి. కృష్ణవేణిల సంయుక్త పర్యవేక్షణలో సజని తన పరిశోధనను పూర్తి చేశారు.ఈ సందర్భంగా ఆమె "సోల్-జెల్ (Sol-Gel) పద్ధతి ద్వారా తయారుచేసిన నానోమెటీరియల్స్ యొక్క నిర్మా ణాత్మక, స్వరూపాత్మక, దృశ్య, అయస్కాంత, విద్యుత్ మరియు డైఎలక్ట్రిక్ ధర్మాలపై సమగ్ర అధ్య యనం" అనే అంశంపై ప్రతిష్ఠాత్మక పరిశోధనా పత్రాన్ని సమర్పించారు.విసి, రిజిస్ట్రార్ అభినందనలు పీహెచ్‌డీ పట్టా సాధించిన కలకొండ సజనిని వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ రాంజీ కూనా, రిజిస్ట్రార్ మరియు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. కోటేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించారు. భవిష్య త్తులో ఆమె మరిన్ని ఉన్నత స్థాయి పరిశోధనలు చేపట్టి, శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి తమ వం తు కృషి చేయాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రసాయనశాస్త్ర విభాగ సహకార పరిశోధకులు, అధ్యాపకులు మరియు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని సజనికి శుభాకాంక్షలు తెలిపారు.

# గేట్ నో-షోపై కేంద్ర ప్రభుత్వం కీలక వివరణ

**– ఎంపీ వల్లభనేని బాలశౌరి**



మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి

మచిలీపట్నం లోక్‌సభ సభ్యులు వల్లభనేని బాలశౌరి అడిగిన ప్రశ్నకు కేంద్ర పౌర విమానయాన శాఖ లోక్‌సభలో పూర్తి సమాధానం ఇచ్చింది. విమాన ప్రయాణాల్లో ఎయిర్‌లైన్స్ పాటిస్తున్న "గేట్ నో-షో" నిబంధనలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన వివరాలను వెల్లడించింది. ఏమిటీ 'గేట్ నో-షో'?కేంద్ర ప్రభుత్వం తెలిపిన వివరాల ప్రకారం:గేట్ నో-షో (Gate No-Show): ప్రయాణికుడు చెక్-ఇన్ పూర్తి చేసినప్పటికీ, నిర్ణీత సమయానికి బోర్డింగ్ గేట్ వద్దకు చేరుకోకపోవడం వల్ల విమానంలో ప్రయాణానికి అనుమతి నిరాకరించబడే పరిస్థితిని 'గేట్ నో-షో' అంటారు.నో-షో (No-Show): ప్రయాణికుడు అసలు చెక్-ఇన్ చేయకపోవడం లేదా ప్రయాణానికి హాజరు కాకపోవడాన్ని 'నో-షో'గా పరిగణిస్తారు."చెక్-ఇన్ అవ్వడానికి, బోర్డింగ్ గేట్ దాటడానికి మధ్య ఉన్న తేడానే ఈ 'గేట్ నో-షో'. విమానం వేళలకు ప్రయాణికులు కట్టుబడి ఉండాల్సిందేనని పౌర విమానయాన శాఖ స్పష్టం చేసింది."ఎయిర్ లైన్స్ తీసుకుంటున్న ముందస్తు చర్యలుప్రయాణికులు సమయానికి బోర్డింగ్ గేట్‌కు చేరుకునేలా విమా నయాన సంస్థలు పలు చర్యలు తీసుకుంటున్నాయని కేంద్రం వెల్లడించింది:బోర్డింగ్ పాస్‌పై కచ్చిత మైన బోర్డింగ్ సమయాన్ని ముద్రించడం.విమానాశ్రయంలో నిరంతరం అనౌన్స్‌మెంట్లు (ప్రకటనలు) చేయడం.ఫ్లైట్ సమాచారాన్ని డిస్‌ప్లే స్క్రీన్‌లపై ప్రదర్శించడం.వీలైనంత వరకు ప్రయాణికులకు SMS లేదా ఈ-మెయిల్ ద్వారా సమాచారం అందించడం.అన్ని ఎయిర్‌లైన్స్‌కు ఒకే రకమైన నిబంధనలు లేవు! మారుతున్న సమయాలు: బోర్డింగ్ గేట్ మూసివేసే సమయం ప్రతీ ఎయిర్‌లైన్, విమానాశ్రయం, మార్గాన్ని (Route) బట్టి మారుతుంటుంది. ఆయా సంస్థలు తమ Conditions of Carriage ప్రకారం బుకింగ్ సమయంలోనే ప్రయాణికులకు ఈ వివరాలు తెలియజేస్తాయి.డీ-రెగ్యులేషన్ ప్రభావం: దేశీయ విమానయాన రంగం 1994 నుంచి పూర్తిగా డీ-రెగ్యులేట్ చేయబడింది. దీంతో ప్రతి ఎయిర్‌లైన్ తన స్వంత Conditions of Carriage మరియు ఛార్జీల నిబంధనలను రూపొందించుకునే స్వేచ్ఛ కలిగి ఉంది.అందువల్ల ప్రస్తుతం దేశంలో అన్ని ఎయిర్‌లైన్స్‌కు ఒకే విధమైన "గేట్ నో-షో" నిబంధనలు అమలులో లేవని కేంద్ర ప్రభుత్వం తన సమాధానంలో స్పష్టం చేసింది.

# రైతులను ఆదుకోవాలి.. ఇరిగేషన్ డిఈఈ ఆఫీస్ లో అర్జీ

**దివిసీమ తీర ప్రాంత రైతాంగానికి సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని ఇరిగేషన్ డిఈఈ ఆఫీస్ లో అర్జీ ఇచ్చిన వైసీపీ నేత గౌతమ్**



అవనిగడ్డ / ప్రజాభూమి ప్రతినిధి

రోమ్ నగరం తగలపడుతుంటే ఫిడెల్ వాయిం చుకుంటూ కూర్చున్న నీరో చక్రవర్తి ని తలపించే విధం గా అవనిగడ్డ ఎంమ్మెల్యే బుద్ధ ప్రసాద్ పనితీరు ఉందని గౌతమ్ తీవ్రంగా విమర్శిం చారు. ఎంతో ఆర్భాటంగా ఈ నెల 10 వ తేదీన పులిగడ్డ ఆక్విడేట్ వద్ద డ్వాక్రా సంఘాల మహిళలచే ముగ్గులు వేయించి, సారె సమర్పించి సాగునీరు విడుదల చేస్తున్నట్లు ప్రచార ఆర్భాటం చేసిన ఎమ్మెల్యే ఈరోజు దివిసీమ లోని అవనిగడ్డ నాగా యలంక కోడూరు మండలాల లోని రైతులు ప్రాధా న పంట కాలువలో సాగునీరు చాలినంతలేక ఆకు మడులు పోసుకోలేని దుస్థితి లో ఉన్నారని, ఎమ్మె ల్యే అసమర్థతను నిరసిస్తూ వారి పార్టీ నేతలే రైతులతో కలిసి వారి పార్టీ ఆఫీస్ ను ముట్టడించారంటే నేడు దివిసీమ లో నెలకొన్న రైతుల దుస్థితి అర్థం అవుతుందని గౌతమ్ తెలిపారు...దివిసీమ లోని చివరి భూముల రైతులకు సైతం నీరందిచే విధంగా పంట నీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలంటూ ఈరోజు వైసీపీ నేత గౌతమ్ పులిగడ్డ ఇరిగేషన్ ఆఫీసులో అర్జీ సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ నీటి సంఘ అధ్యక్షులు వక్రే బసవరావు, అద్దంకి శేషు, అప్పికట్ల దసరథ్, శ్రీను పాల్గొన్నారు.

# తల్లికి వందనంతో ప్రతి ఇంటా విద్యా వెలుగులు



**పేద బిడ్డల భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వమే నిజమైన భరోసా**

**టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్**

**స్వర్ణ 45వ వార్డులో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం... స్వీట్ల పంపిణీ**

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "తల్లికి వందనం" పథకం పేద, మధ్యతరగతి కుటుంబాల బిడ్డల భవిష్యత్తుకు నిజమైన భరోసాగా నిలిచిందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ కొనియాడారు.మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని స్వర్ణ 45వ వార్డులో 136 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో తల్లికి వందనం నిధులు జమ అయిన సందర్భంగా గురువారం ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్, వార్డు ఇన్‌చార్జి పి.వి. ఫణి కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లులు వార్డు సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు ఘనంగా పాలాభిషేకం చేశారు. అనంతరం మంత్రులు నారా లోకేష్, కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరిలకు కృతజ్ఞతలు తెలుపుతూ మిఠాయిలు పంచుకున్నారు.ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి పాలనఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గొర్రెపాటి గోపీచంద్ మాట్లాడుతూ..."కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను దిగ్విజయంగా అమలు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 67.47 లక్షల మంది విద్యార్థులకు రూ.10,120.78 కోట్లు అందజేయడం విద్యా రంగంలో చారిత్రాత్మక ఘట్టం. గతంలో జగన్మోహన్ రెడ్డి 'ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి ఇస్తాం' అని చెప్పి మోసం చేసి, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకున్నారు. కానీ చంద్రబాబు నాయుడు కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా అందరికీ పథకాన్ని వర్తింపజేసి తన నిబద్ధతను చాటుకున్నారు."పేద తల్లుల్లో వెల్లివిరిసిన ఆనందంకార్యక్రమ నిర్వాహకులు పి.వి. ఫణి కుమార్ మాట్లాడుతూ...స్థానిక మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరిల ప్రత్యేక చొరవతో స్వర్ణ 45వ వార్డులో అర్హులైన 136 మంది తల్లుల ఖాతాల్లో నిధులు నమోదయ్యాయని తెలిపారు. విద్యా వ్యవస్థ రూపురేఖలు మారుస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ బాలశౌరి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావుతో పాటు ప్రజాప్రతినిధులకు వార్డు ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో పాల్గొన్నవారు: ఈ ఆనందోత్సవ కార్యక్రమంలో స్థానిక విద్యార్థుల తల్లులు సబ్బినేని ప్రభావతి, నిమ్మగడ్డ రాగపద్మిని, మట్టా విజయలక్ష్మి, పి. సుజాత, మురాల జై దుర్గ, కొనకళ్ళ విజయలక్ష్మి, విన్నకోట ఛాయాదేవి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తల్లికి వందనం సాయంపై హర్షాతిరేకాలు



**లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి మాట్లాడిన టీడీపీ నేతలు**

**సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన తల్లిదండ్రులు**

అవనిగడ్డ / ప్రజాభూమి ప్రతినిధి

తల్లికి వందనం పథకం కింద ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయం విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో జమ కావడం పట్ల విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు .బుధవారం అవనిగడ్డలో తెలుగుదేశం పార్టీ నాయకులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి మాట్లాడారు .కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యార్థుల చదువులకు ప్రాధాన్యత ఇస్తూ 'తల్లికి వందనం' పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేయడంపై టీడీపీ నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ఇంటింటికీ తిరుగుతూ, బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ అయిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. చదువుల నిమిత్తం ప్రభుత్వం అందిస్తున్న ఈ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ స్కూళ్లు తెరిచే సమయంలోనే డబ్బులు జమ కావడం పిల్లల పుస్తకాలు, యూనిఫామ్‌లు, ఇతర ఖర్చుల కోసం ఇబ్బంది పడకుండా ఈ డబ్బు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు ఇచ్చిన మాట ప్రకారం ప్రతీ విద్యార్థికి సాయం అందించినందుకు కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు చదువుకోవడానికి కావాల్సిన సామగ్రి కొనుక్కోవడానికి ఈ సాయం ఎంతగానో తోడ్పడుతుందని అన్నారు ఎలాంటి ఆటంకం లేకుండా నేరుగా అమ్మ ఖాతాలో డబ్బులు పడటం చాలా సంతోషంగా ఉందని చెప్పారు ఈ సందర్భంగా కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదరిక నిర్మూలనకు చదువే ఏకైక మార్గమని నమ్మిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ, ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు మండల పార్టీ అధ్యక్షులు మెండు లక్ష్మణరావు,బండే శ్రీనివాసరావు,కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు లకనం నాగాంజనేయులు ,జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కొల్లూరి ఇమ్మానియేలు, మాజీ సీడీసీ చైర్మన్ రావి నాగేశ్వరరావు,క్లస్టర్ ఇంచార్జిలు బండే రాఘవ,అప్పికట్ల రవీంద్ర,విశ్వనాథపల్లి పీఏసీఎస్ చైర్మన్ తోట సాంబశివరావు,పార్టీ నాయకులు ఉప్పల ప్రసాద్,షేక్ బాబావలి,కొండవీటి గోవిందు,ముళ్లపూడి శ్రీనివాసరావు,చందన రంగారావు,దిడ్ల జానకీ రాంబాబు,నాగిడి రాంబాబు,సనకా సురేష్,మీసాల శివరామ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# సివిల్ సప్లైస్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు తక్షణమే పెంచాలి

**ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా మేనేజర్‌కు వినతిపత్రం సమర్పణఏళ్ల తరబడి సేవలుందిస్తున్నా గుర్తింపు లేకపోవడం అన్యాయం: లింగం ఫిలిప్**

మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి

కృష్ణా జిల్లా సివిల్ సప్లైస్ సంస్థ (AP state Civil Supplies Corporation Ltd)లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను తక్షణమే పునఃసమీక్షించి, వారి సీనియార్టీ ఆధారంగా పెంచాలని ఏఐటీయూసీ (AITUC) డిమాండ్ చేసింది. గురువారం మచిలీపట్నంలో జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న సివిల్ సప్లైస్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై జిల్లా సివిల్ సప్లై మేనేజర్ టి. శివరామప్రసాద్‌కు ఏఐటీయూసీ నాయకులు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కృష్ణా జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి లింగం ఫిలిప్ మాట్లాడుతూ... సంస్థలో సమాన పనికి సమాన వేతనం సూత్రాలను అమలు చేయాలని, సీనియార్టీ ఆధారంగా స్లాబ్‌ల వారీగా వేతనాలు పెంచి కాంట్రాక్ట్ విధానాన్ని మంజూరు చేయాలని కోరారు.అనుభవానికి దక్కని గుర్తింపు!"గత 5 నుంచి 15 ఏళ్లకు పైగా సంస్థ అభివృద్ధికి నిరంతరాయంగా సేవలందిస్తున్న సీనియర్ ఉద్యోగు లకు, కొత్తగా విధుల్లో చేరిన వారికి ఒకే రకమైన వేతనం ఇవ్వడం ఎంతవరకు న్యాయం?" అని లింగం ఫిలిప్ ప్రశ్నించారు.ప్రస్తుతం కొత్తగా చేరిన అవుట్‌సోర్సింగ్ సెక్యూరిటీ గార్డులు, అటెండర్లకు ₹15,0 00, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ₹18,000 చెల్లిస్తున్నారని తెలిపారు.

ఏళ్ల తరబడి పనిచేస్తున్న సీనియ ర్లకు కూడా అదే వేతనం ఇవ్వడం వల్ల వారి అనుభవానికి తగిన గుర్తింపు, ప్రోత్సాహం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ఉద్యోగుల్లో నిరాశ నెలకొని, వారి పనితీరుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. అందుకే వెంటనే ఇంక్రిమెంట్ పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.ప్రధాన డిమాండ్లు ఇవే:1. వేతనాల పెంపు: అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ప్రస్తుత వేతనాలను తక్షణమే పునఃసమీక్షించి పెంచాలి.2. స్లాబ్ వారీ వేతనాలు: ఉద్యోగుల సేవా కాలం, సీనియార్టీ ఆధారంగా స్లాబ్ వారీగా వేతనాలు పెంచి, కాంట్రాక్ట్ విధానాన్ని వర్తింపజేయాలి.3. దీర్ఘకాలిక సేవలకు గుర్తింపు: 5, 10, 15 ఏళ్లకు పైగా సేవలందిస్తున్న ఉద్యోగులకు అదనపు వేతన పెంపుతో పాటు కాంట్రాక్ట్ హోదా ఇవ్వాలి.4. పారదర్శక వేతన విధానం: కొత్త ఉద్యోగులకు, సుదీర్ఘ అనుభవం ఉన్న ఉద్యోగులకు మధ్య వేతనంలో స్పష్టమైన వ్యత్యాసం ఉండేలా పారదర్శక విధానం తె రావాలి.

5. న్యాయమైన వేతన పాలసీ: సంస్థ అభివృద్ధిలో భాగస్వాములైన అవుట్‌సోర్సింగ్ సిబ్బంది సేవలను గుర్తించి న్యాయమైన వేతన విధానాన్ని అమలు చేయాలి.కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, సిబ్బంది:ఈ కార్యక్రమంలో మచిలీపట్నం నియోజకవర్గ ఏఐటీయూసీ కార్యదర్శి ఒంటిపులి లక్ష్మణరావుతో పాటు నాయకులు, ఉద్యోగులు ఎల్. మధుబాబు, ఎం. రాజేష్, వి. రాజేష్, పి. వెంకటేశ్వరమ్మ, బి. స్వాతి, జాన్, ఎస్. రాజకుమారి, ఎస్.ఎన్. గాయాస్ మహోద్దీన్, పి. జగదీష్ బాబు, ఎ. కిరణ్ కుమారి, టి. రామలక్ష్మి, ఎ. నీలిమ, ఎస్. కామేష్, ఎం. సునీత, కె. మౌనిక, కోటేశ్వరమ్మ, ఎస్.కె.యం.డి. మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



**ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని**

# కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తల బృందం శిక్షణ కార్యక్రమం

ప్రజాభూమి ప్రతినిధి / అవనిగడ్డ

ఘంటసాల మండలం లోని కొత్తపల్లి గ్రామంలో ఎల్ నినో ప్రభావం పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎల్ నినో ప్రభావ నేపథ్యంలో వర్షాభావ పరిస్థితుల వలన ఎదురయ్యే పరిస్థితులు అంచనా బట్టి సాగులో అప్రమత్తంగా ఉండాలని కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త & అధిపతి డా.సుధారాణి రైతులకు సూచించారు. ఎక్కడ అయితే వర్షపాతం తక్కువగా నమోదు అవుతుందో, నారు మడులు మరియు దమ్ము చేయడం ఆలస్యం అవుతుందో, అక్కడ తక్కువ కాల పరిమితి గల వరి రకాలను ఎంచుకుంటూ వెద పద్ధతిలో సాగు చేసుకోవాలని సూచించారు. అలానే ఎరువుల సమతుల్యత పాటించడం, జీవన ఎరువులను వాడుకోవడం, నేల మరియు నీటి పరిరక్షణ చర్యలు చేపట్టాలని, ప్రస్తుత పరిస్థితులలో సాగులో పెట్టుబడులు తగ్గించుకోవాలని రైతులకు తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో కేవికే సస్యరక్షణ శాస్త్రవేత్త డా రేవతి, ఘంటసాల మండల వ్యవసాయ ఇన్చార్జి అధికారి సురేష్, విఏఏ అహ్మద్ మరియు రైతులు పాల్గొన్నారు.



ప్రజాభూమి

ఏలూరు, పశ్చిమగోదావరి 4

శుక్రవారం 24 జూలై 2026

# నిర్వాసితుల కాలనీలను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలి

**ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా.**

పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల కాలనీలను డిసెంబర్ లోగా పూర్తిచేసి, నిర్వాసితులందరినీ కాలనీలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుండి గురువారం పోలవరం ప్రాజెక్ట్ పునరావాసం, కాలనీల నిర్మాణాలకు సంబంధించి భూసేకరణ, కాలనీల నిర్మాణపనులపై అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇటీవల పోలవరం ప్రాజెక్ట్ పనుల పరిశీలన కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా పోలవరం ప్రాజెక్ట్ మొదటి దశ నిర్వాసితులకు నిర్మిస్తున్న కాలనీలను వెంటనే పూర్తిచేసి, వారిని సదరు కాలనీలకు డిసెంబర్ లోగా తరలించాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల ననుసరించి కాలనీలలో ఇళ్ల నిర్మాణ పనులతో పాటు కాలనీలలో రోడ్లు, డ్రైనేజి, అంగన్వాడీ, పాఠశాలలు, త్రాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను నిర్వాసితులను కాలనీలకు తరలించే ముందుగానే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాలనీల నిర్మాణానికి, మౌలిక సదుపాయాల ఏర్పాటు నిమిత్తం ఇంకా చేయవలసిన భూసేకరణను వెంటనే పూర్తిచేయాలన్నారు. భూసేకరణ లో అవకతవకలకు పాల్పడినా, కాలనీల నిర్మాణాల విషయంలో అలసత్వం వహించే అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ అభిషేక్, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి రాములు నాయక్, ఎస్డీసీ దేవకీదేవి, పంచాయతీ రాజ్, రహదారులు, భవనాల శాఖ ఎస్ఈ లు జెడ్. రమేష్, విజయరత్నం, సంబంధిత మండలాల జాతీయ రహదారి సంస్థ అధికారులు, భూసేకరణ విభాగం అధికారులు, తహసీల్దార్లు, ప్రభృతులు పాల్గొన్నారు.



## సమాన పనికి సమాన వేతనం కోరుతూ పౌర సరఫరాల అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరసన



**ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు**

జిల్లా పౌర సరఫరాల శాఖలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరసన చేపట్టారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయడంతో పాటు,సేవా కాలాన్ని ఆధారంగా చేసుకుని స్లాబ్ విధానంలో వేతనాలు,వార్షిక ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.ఉద్యోగుల వివరాల ప్రకారం,ఇటీవల విధుల్లో చేరిన సెక్యూరిటీ గార్డులు, అటెండర్లకు నెలకు రూ.15,000 నుంచి రూ.18,500 వరకు వేతనం చెల్లిస్తుండగా,ఐదు నుంచి పదిహేను సంవత్సరాలుగా నిరంతర సేవలందిస్తున్న ఉద్యోగులకు కూడా అదే స్థాయి వేతనం కొనసాగుతోంది.దీంతో అనుభవానికి తగిన గుర్తింపు,గౌరవం, ప్రోత్సాహం లభించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఉద్యోగులకు,కొత్తగా చేరిన ఉద్యోగులకు ఒకే విధమైన వేతనం చెల్లించడం వల్ల ఉద్యోగుల్లో నిరుత్సాహం పెరుగుతోందని,ఇది వారి పనితీరుపై కూడా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొన్నారు.కాబట్టి, "సమాన పనికి సమాన వేతనం" అనే సూత్రాన్ని అమలు చేయడంతో పాటు ఉద్యోగుల సేవా కాలం, అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని స్లాబ్ విధానంలో వేతన పురోగతి,వార్షిక ఇంక్రిమెంట్లు అమలు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఉద్యోగులు హెచ్చరించారు.

## శ్రీపర్రు సబ్ కెనాల్ ఆక్రమణలు తొలగించాలని కలెక్టర్‌కు రైతు వినతి

**ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు**



రూరల్ మండలం శ్రీపర్రు గ్రామానికి చెందిన రైతు సైదు వెంకటరమణ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. శ్రీపర్రు గ్రామానికి చెందిన మండల కొండలరావు ం/శీ త్రిమూర్తులు వరప్ర సాద్ అను అతను ప్రభుత్వ భూమిని ఆక్రమించి రెండు రేకుల షెడ్లు నిర్మించారు. సబ్ కెనాల్‌పై జరిగిన ఆక్రమణలను తొలగించి, డ్రైనేజీ కాలువను పునరు ద్ధరించాలని కోరారు.సర్వే నంబర్లు 181-2, 182-2 పరిధిలో ఆక్రమణల వల్ల కాలువ మూసుకుపోయి,వర్షపు నీటి ప్రవాహం నిలిచిపోవడంతో సుమారు 200 ఎకరాల వ్యవ సాయ భూములు, చేపల చెరువులు ముంపునకు గురవుతున్నాయని తెలిపారు.అలాగే శ్రీపర్రు, మహేశ్వరపురం, మన్నూరు తదితర గ్రామాల్లో వరద సమస్య తీవ్రంగా ఉందన్నారు.సర్వే నంబర్లు 175-183 మధ్య అటవీ భూమిలో అనుమతి లేకుండా నిర్మించిన రహదారిని తొలగిం చి,ప్రభుత్వ భూమిపై ఉన్న ఆక్రమణలను తొలగించడంతో పాటు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు.రైతులు, గ్రామస్తుల ప్రయోజనాల దృష్ట్యా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు.

## తల్లికి వందనం అమలుతో పాటు రహదారుల అభివృద్ధికి పెద్దపీట -ఎమ్మెల్యే బడేటి చంటి



**ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు**

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అభివృద్ధిని చేతల్లో చూపిస్తోందని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. 28వ డివిజన్‌లోని పుష్పలీలా నగర్, ద్వారకా నగర్ ప్రాంతాల్లో రూ.44 లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రహదారులను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటివరకు నగరంలో రూ.80 కోట్లతో రహదారుల అభివృద్ధి చేపట్టామని, త్వరలో మరో రూ.30 కోట్లతో అదనపు పనులు చేపడతామని తెలిపారు. అలాగే రూ.109 కోట్లతో డ్రైనేజీ ఆధునీకరణ పనులు డిసెంబర్ నాటికి ప్రారంభమవుతాయని చెప్పారు.'తల్లికి వందనం' పథకం ద్వారా అర్హులైన ప్రతి తల్లికి లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటున్నామని, ఏలూరు నియోజకవర్గంలో అదనంగా 1,800 మంది అర్హులకు పథకం వర్తింపజేశామని ఎమ్మెల్యే వెల్లడించారు.కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, టీడీపీ నాయకులు, కూటమి పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## బిందాస్ కంపెనీ నుంచి నష్టపరిహారం ఇప్పించాలని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు



**ప్రజా భూమి ప్రతినిధి-వేలేరుపాడు**

నకిలీ విత్తనాలు వేసి నష్టపోయిన తమకు, బిందాస్ కంపెనీ వారు ఇస్తానన్న నష్టపరిహారం నేటకీ ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని, ఆ నష్టపరిహారాన్ని తక్షణం ఇప్పించాలని స్థానిక పోలీస్ స్టేషన్లో బుధవారం రైతులు, వ్యవసాయ అధికారుల తో కలిసి ఫిర్యాదు చేశారు. వేలేరుపాడు మండలం చిగురుమామిడి, నార్లవరం గ్రామాల్లోని 70 ఎకరాల్లో ఈ విత్తనాలు వేసి నష్టపోయిన సంగతి అందరికీ తెలిసిందేనని, ఆ తరుణంలో కంపెనీవారు వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి స్వయంగా పంటలను పరిశీలించి. నష్టపోయిన మాట వాస్తవమేనని అందుకుగాను ఎకరానికి లక్ష రూపాయలు చొప్పున నష్టపరిహారం అందిస్తామని ఒప్పుకోవటం జరిగిందన్నారు. ఆ సొమ్ములు నేటి వరకు చెల్లించకపోగా తమ ఫోన్లకి స్పందించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణం వారిపై చర్యలు తీసుకొని, తమకు రావాల్సిన నష్టపరిహారాలను వారి నుంచి ఇప్పించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# మా పాఠశాల మెగా పీటీఎంకి రండి

### జిల్లా కలెక్టర్‌ను ఆహ్వానించిన పెదపాడు జెడ్పి హైస్కూల్ విద్యార్థినీ, విద్యార్థులు.

**ప్రజా భూమి ప్రతినిధి-పెదపాడు.**



మా పాఠశాలలో మెగా పేరెంట్, టీచర్స్ మీట్ ని నిర్వహిస్తున్నామని, తప్పనిసరిగా రావాలని పెదపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినీ విద్యార్థులు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ని ఆహ్వానించారు. స్థానిక కలెక్టరేట్ లో గురువారం కలెక్టర్ ఛాంబర్ లో పెదపాడు జిల్లా పరిషత్ హై స్కూల్ కు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ని కలిసి మెగా పేరెంట్, టీచర్స్ మీట్ కార్యక్రమానికి తాము స్వయంగా రూపొందించిన ఆహ్వానపత్రాన్ని అందించారు. తమ పాఠశాలలో ఈనెల 24వ తేదీ ఉదయం 9:30 ని.ల నుండి మెగా పేరెంట్, టీచర్స్ మీట్ కార్యక్రమాన్ని ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహిస్తున్నామని, కార్యక్రమంలో ముఖ్యఅతిథి గా పాల్గొనాలని విద్యార్థినీ, విద్యార్థులు కలెక్టర్ ను కోరారు.

జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి నవ్వుతూ సదరు ఆహ్వానపత్రాన్ని స్వీకరించి, ఆహ్వానపత్రాన్ని రూపొందించిన వారిని అభినందించారు. మెగా పేరెంట్, టీచర్స్ మీట్ కార్యక్రమానికి విచ్చేస్తానని కలెక్టర్ విద్యార్థినీ, విద్యార్థులకు తెలిపారు. పెదపాడు ఎం ఈ ఓ, ఎస్.నరసింహమూర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి. విజయ, ప్రభృతులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి ముద్రగడ మృతి తీరని లోటు

**ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు**



దివంగత మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మృతి తీరని లోటని పలువురు కాపు సంఘ నేతలు పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ భవనంలో ముద్రగడ పద్మనాభం సంతాప సభ రాష్ట్ర కాపు జేఏసీ నాయకులు ముచ్చర్ల శ్రీరామ్ నేతృత్వంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ సభలో కాపు సంఘ రాష్ట్ర సీనియర్ నాయకులు చిన్నమిల్లి వెంకటరాయుడు, నల్లా విష్ణుమూర్తి,ఆకుల రామకృష్ణ,కిర్లంపూడి సర్పంచ్ నాగబాబు, స్థానిక నాయకులు ఆరేటి ప్రకాష్, చెగొండి సూర్య ప్రకాష్, ఎర్రంశెట్టివెంకటరత్నం, ,డాక్టర్ ముచ్చర్ల సంజయ్, ఎడ్ల తాతాజీ, నడపన గోవిందరాజులు నాయుడు, కామిశెట్టి అయ్యప్ప నాయుడు, జక్కంపూడి కుమార్, ఇంటి శ్రీరాముడు,పెనుమోకా రాం మోహన్,చవాకుల సూర్య ప్రకాష్, గంటా శ్రీనివాస్,తదితర ముఖ్య నేతలు పాల్గొని ముద్రగడ చిత్రపటం కు పూలదండలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాపు సామాజిక వర్గానికి అందజేసిన ముద్రగడ సేవలను కొనియాడుతూ జీవో నెంబర్ 13 ద్వారా విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తున్న ఘనత ఆయనకే దక్కుతుందని గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో కాపు సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు

- విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం తొలి ప్రాధాన్యం
- ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.

**ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట**



ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. విద్యార్థులంతా కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. గురువారం రావులపాలెంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. ముందుగా మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వసతి గృహంలో ఇటీవల చేపట్టిన మరమ్మత్తు పనులను పరిశీలించి విద్యార్థినులతో నేరుగా మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు. గతంలో వసతి గృహాన్ని సందర్శించిన సమయంలో ఫ్యాన్ల కొరత, సీలింగ్ ఊడిపోవడం, మరుగుదొడ్ల దుస్థితి వంటి సమస్యలను గుర్తించిన ఎమ్మెల్యే, ప్రభుత్వ నిధులతో వాటిని పూర్తిస్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం అన్ని సౌకర్యాలు మెరుగుపడ్డాయని, విద్యాభ్యాసానికి అనుకూల వాతావరణం ఏర్పడిందని విద్యార్థినులు ఎమ్మెల్యేకు తెలిపారు. వసతి గృహ అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టర్ సిద్ధంశెట్టి సురేష్‌ను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం ప్రభుత్వం మంజూరు చేసిన ట్రంక్ బాక్సులు, ప్లేట్లు, గ్లాసులు, బ్లాంకెట్లు, స్వెటర్లు, టవల్స్‌తో కూడిన కిట్లను విద్యార్థినులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ప్రభుత్వ విద్య నాణ్యత మరింత మెరుగుపడుతోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దూరదృష్టితో ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## పెరటి కోళ్ల పెంపకంపై అవగాహన కార్యక్రమం.

**ప్రజా భూమి ప్రతినిధి-వేలేరుపాడు**

పెరటి కోళ్ల పెంపకం అందువలన కలిగే లాభాలు అంశంపై బుధవారం వేలేరుపాడు లోని వెలుగు కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ వెలుగు బౌ అండ్ బారో ఎన్జీవో సంస్థ వారి సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో, డాక్టర్ రామ్మోహన్ మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం పెరటి కోళ్ల పెంపకంపై శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కోళ్లు పెంపకం వలన ఉపయోగాలు,ప్రభుత్వం మహిళలకు అందించనున్న సహాయ సహకారాలు పై ఈ శిక్షణ కార్యక్రమంలో అవగాహన కల్పించారు. డాక్టర్ సాయిబుచ్చారావు మాట్లాడుతూ,ప్రస్తుత వర్షా భావ పరిస్థితుల్లో ఈ కోళ్ల పెంపకం వల్ల అదనంగా ఆదాయం పొందవచ్చునని తెలపడం జరిగింది.ఈ కార్యక్రమంలో డాక్టర్ తారకేశ్వరరావు డాక్టర్ సాయిరాం సిబ్బంది రాజబాబు, మణికంఠ మహిళా రైతులు పాల్గొన్నారు.

## థాంక్యూ సిఎం సార్...

### తల్లికి వందనం నిధుల విడుదల పై శ్రీ విజేత చిన్నారుల కృతజ్ఞతలు



**ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి**

తాళ్లపూడి లోని శ్రీ విజేత హై స్కూల్ విద్యార్థులు గురువారం థాంక్యూ సి ఎం సార్ అంటూ ప్లెక్సీ చేత బూని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కొవ్వూరు శాసన సభ్యులు ముప్పిడి వెంకటేశ్వర రావు లకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు డా జె వి ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ తల్లికి వందనం పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చదువుకునే పిల్లలు కలిగిన తల్లుల ఖాతాలో డబ్బులు జమ చేయడం ద్వారా పేద మధ్య తరగతి విద్యార్థులకు ఈ పథకం చాలా ఉపయోగకరంగా ఉందని తెలిపారు. ముఖ్యంగా ఎన్ డి ఏ ప్రభుత్వంలో ఎంత మంది బడికి వెళ్లే పిల్లలు ఉంటే అంత మందికి తల్లికి వందనం పథకం అమలుచేయడం సాహసోపేతమైన నిర్ణయం అంటూ సీఎం చంద్రబాబు కి మరొక్కసారి కృతజ్ఞతలు తెలియచేశారు. కార్యక్రమం లో పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నేడు జిల్లావ్యాప్తంగా మెగా పేరెంట్ టీచర్ మీటింగ్.-4.0

- తల్లిదండ్రులు ఇద్దరూ తప్పనిసరిగా హాజరు కావాలి
- జిల్లా కలెక్టర్: డా. ఆర్. మహేష్ కుమార్

**ప్రజాభూమి ప్రతినిధి-అమలాపురం**



డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో విద్యార్థుల తల్లిదండ్రులు ఇద్దరూ తప్పనిసరిగా హాజరు కావాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం వివేకనంద సమావేశ మందిరంలో పత్రికా విలేకరులతో మెగా పేరెంట్స్ మీటింగ్స్ లో భాగంగా పిల్లల భవిష్యత్తు కార్యచరణ, విద్యా సాంకేతికత బోధనలు, పిల్లల ప్రవర్తన శైలి వంటి అంశాలపై తల్లిదండ్రులు తప్పక తెలుసుకోవాలని ఉద్దేశంతో పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ 4.0 కార్యక్రమం శుక్రవారం డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ తెలిపారు.జిల్లాలోని 1,409 ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యాసంస్థల్లో చదువుతున్న 76,132 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖ రూపొందించిన నిమిషం-నిమిషం కార్యాచరణ ప్రణాళిక ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని విద్యాసంస్థల్లో ఏకరీతిలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రగతి, అభ్యసన ఫలితాలు, పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ విద్యా పథకాల అమలు, విద్యా వనరుల వినియోగం తదితర అంశాలను తల్లిదండ్రులకు వివరించనున్నారు. అలాగే విద్యార్థులకు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు అందజేయడంతో పాటు లీప్ యాప్ వినియోగంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించనున్నారు.పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు. తల్లిదండ్రులతో పాటు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, దాతలు, విద్యావేత్తలు, గ్రామ పెద్దలు, సామాజిక నాయకులు కూడా కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వివిధ పాఠశాలలను సందర్శించి కార్యక్రమంలో పాల్గొననున్నట్లు వెల్లడించారు. జిల్లాలో ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలు, కల్పించిన మౌలిక వసతులు, విద్యా ఫలితాలపై తల్లిదండ్రులు ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు మెగా పి. టి. ఎమ్.మంచి వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. అందువల్ల ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు ఇద్దరూ తప్పనిసరిగా పాఠశాలకు హాజరై, కార్యక్రమంలో పూర్తిస్థాయిలో పాల్గొనాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీనియర్ జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా పర్యవేక్షించనున్నట్లు చెప్పారు.మెగా పి. టి. ఎం.-4.0కు సంబంధించిన సమాచారాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు మీడియా ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ కోరారు.ఈ పత్రికా సమావేశంలో జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి. మమ్మీ, జిల్లా విద్యాశాఖ అధికారి వి. నాగేశ్వరరావు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ప్రజాభూమి

కాకినాడ, తూర్పుగోదావరి 5

శుక్రవారం 24 జూలై 2026


## ముఖ్యమంత్రి పర్యటనలో పోలవరం నిర్వాసితులకు స్పష్టమైన హామీ ఇవ్వాలి

### సీపీఎం మండల కార్యదర్శి డిమాండ్

**ప్రజా భూమి ప్రతినిధి–కూనవరం**

రంపచోడవరం పర్యటనకు రానున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పోలవరం ప్రాజెక్టు కారణంగా ముంపునకు గురవుతున్న మండలంలోని ఐదు గ్రామ పంచాయతీల పరిధిలోని నిర్వాసితులకు భూ ప్యాకేజీ, పునరావాసం మరియు పునర్నిర్మాణం (ఆర్ ఁ ఆర్)పై స్పష్టమైన హామీ ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి డిమాండ్ చేశారు.ఆయన మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్టు ప్రభావంతో మండలంలోని పెద్దార్కూరు, కూటూరు, అభిచర్ల, లింగాపురం, రేగులపాడు గ్రామ పంచాయతీలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని తెలిపారు. ఇప్పటికే భూ ప్యాకేజీ మంజూరైన మూడు పంచాయతీల్లో కూడా ఒక్కో గ్రామానికే పరిమితమై, కేవలం మూడు గ్రామాలకు మాత్రమే భూ ప్యాకేజీ అందిందన్నారు. మండలంలోని పోలవరం ముంపు లో ఉన్న 44 గ్రామాలకు ఆర్ అండ్ పునర్వాసం భూమి ప్యాకేజీ తక్షణమే ఇవ్వాలి. ఏదైతే మండలంలో ప్రయారిటీ గ్రామాలుగా గుర్తించినటువంటి తొమ్మిది గ్రామాలకు పునర్వాసం మరియు భూమికి భూమి త్వరతగతిన పూర్తి చేయాలి. ఇంకా పది గ్రామాలకు భూ ప్యాకేజీ, ఆర్ ఁ ఆర్ ప్రయోజనాలు అందాల్సి ఉన్నప్పటికీ, అధికారులు 41.5 కాంటూర్ పరిధిలో లేవు అనే కారణంతో పరిహారం నిరాకరిస్తున్నారని విమర్శించారు. వాస్తవానికి ఆయా గ్రామాల వ్యవసాయ భూములు, నివాస ప్రాంతాలు కూడా ముంపు ప్రభావానికి గురవుతున్నప్పటికీ, తప్పుడు లెక్కలతో గిరిజన గ్రామాలకు



రావాల్సిన నష్టపరిహారం, భూ ప్యాకేజీ, పునరావాస హక్కులను ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు.అదేవిధంగా ప్రతి ఏడాది గోదావరి వరదల సమయంలో మండలంలోని 22 గ్రామాలు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. వరదలు వచ్చిన ప్రతిసారి గ్రామాలు రోజుల తరబడి చీకట్లలో మగ్గాల్సి వస్తోందని, ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్ అండ్ బి రోడ్డు మీద సర్వే చేయించి 1.50 లక్షల పైన ఖర్చు అవుతుందని అంచనా వేసి కూడా పనులు ప్రారంభించకపోవడం గిరిజన గ్రామాల పట్ల ప్రభుత్వాలకు ఉన్న ప్రేమ స్పష్టంగా కనబడుతుంది.ఈ సమస్యపై ఇప్పటికే పలుమార్లు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (పీఓ) దృష్టికి తీసుకెళ్లినప్పటికీ శాశ్వత పరిష్కారం అవలేదని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రంపచోడవరం వస్తున్న సందర్భంగా పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు భూమి ప్యాకేజీ, ఆర్ అండ్ ఆర్ పునర్వాసం ఎప్పటిలోగా పూర్తి చేస్తారు స్పష్టమైన హామీ ఇవ్వాలని మండలం సిపిఎం పార్టీగా డిమాండ్ చేశారు.

## విద్యార్థులకు సాంఘీక సంక్షేమ బాలికల హాస్టల్ సదుపాయం కల్పించాలి

**ప్రజా భూమి ప్రతినిధి–బుట్టాయగూడెం**

పోలవరం నియోజకవర్గంలోనీ బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో దళిత విద్యార్థులకు సాంఘీక సంక్షేమ బాలికల హాస్టల్ సదుపాయం కల్పించాలని కేవీపీఎస్ అందుగల ఫ్రాన్సిస్ ప్రభుత్వం ను పత్రికా ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు.వివిధ రకాల సమస్యల సాకుతో ప్రభుత్వాలు పోలవరం నియోజకవర్గంలోని బుట్టాయగూడెం,జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు, టి నరసాపురం మండలాల్లో పూర్వంనుండి ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాలను మూసివేయడం జరిగింది. పోలవరం నియోజకవర్గంలోని దళిత



విద్యార్థునుల ఇబ్బందిని, దళిత విద్యార్థునులు చదువుకు దూరం అవుతున్న పరిస్థితులను అర్థం చేసుకొని ప్రభుత్వం పునః రాలోచన చెసి పోలవరం నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాలను ఏర్పాటు చేయాలని కోరారు. పోలవరం నియోజకవర్గం లోని గిరిజన బాలికల గురుకులాలలో దళిత విద్యార్థులకు కనీసం ఐదు సీట్లు ఉండేవి నియోజకవర్గంలోని దళిత విద్యార్థుల సంఖ్య ప్రాతిపదికల సీట్ల కేటాయింపు చేయలని, పోలవరం నియోజకవర్గం లోని మండల కేంద్రాలలో సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహలు లేకపోవడం వలన నియోజకవర్గం నుంచి పక్క నియోజకవర్గాలకు పక్క మండలాలకు వెళ్లి విద్యార్థులు చదువుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. దూరప్రాంతాలకు బాలికలను పంపించడానికి తల్లిదండ్రులు ఇష్టం చూపించకపోవడం, బాలికలపై సమాజంలో జరుగుతున్న ఆకృత్యాలను దృష్టిలో ఉంచుకొని తల్లిదండ్రులు పిల్లలను దూరప్రాంతాలకు పంపించి చదివించే ధైర్యం చేయలేక చాలామంది విద్యార్థులను చదువు మాన్పించేస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం పునరాలోచన చేసి సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాలను ఏర్పాటు చేసి దళిత విద్యార్థుల విద్యకు తోడ్పాటు కల్పించాలని లేనిపక్షంలో సామాజిక శంఖారావం కార్యక్రమం ద్వారా పోలవరం నియోజకవర్గం లోని అన్ని మండలాలలోని దళిత గ్రామాలలో పర్యటించి దళిత విద్యార్థులు తల్లిదండ్రుల తో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేస్తామని హెచ్చరించారు.

## కేంద్రీయ విద్యాలయం ముందు జనసేన ఆందోళన

**ప్రజాభూమి ప్రతినిధి–నూజివీడు**

నూజివీడు పట్టణంలోని ఎంప్లాయిస్ కాలనీలో గల కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థుల అడ్మిషన్స్, టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ సిబ్బంది నియామకంలో అవకతవకలు చోటు చేసుకున్నాయని జనసేన యువనేత ముత్యాల కామేష్ ఆరోపించారు. ఈ మేరకు నూజివీడులోని కేంద్రీయ విద్యాలయాన్ని జనసేన బృందం గురువారం సందర్శించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగే నూజివీడు పట్టణంలోని కేంద్రీయ విద్యాలయంలో నియమ నిబంధనలను తుంగలో తొక్కి, రాజకీయ ప్రేరేపితంగా భారీ స్థాయిలో అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. కేంద్రీయ విద్యాలయం నూజివీడు పట్టణానికి వచ్చేందుకు ఎన్నో వ్యయ ప్రయాసల కూర్చి అవిశ్రాంత కృషి చేసినట్లు వివరించారు. నూజివీడు రెవిన్యూ డివిజన్ ప్రజల ఆకాంక్షల మేరకు కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు జరిగిందన్నారు. ఇక్కడ ఒకటవ తరగతి నుండి 5వ తరగతి వరకు జరిగిన అడ్మిషన్స్ ప్రక్రియ, టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ సిబ్బంది నియామకంలో అవకతవకలు చోటుచేసుకున్నాయని తెలిపారు.మొత్తం ఈ రెండు వ్యవహారాలకు సంబంధించి విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారుల బృందం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, అవినీతికి పాల్పడిన ప్రిన్సిపల్, మరి కొంత మంది సిబ్బందిపై కఠినమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ ల ప్రక్రియ కూడా అమలు కాలేదన్నారు. ప్రతి తరగతి




లో ఉన్న డ్రాప్ అవుట్స్ స్థానంలో కొత్తగా విద్యార్థులకు అడ్మిషన్స్ ఇచ్చే క్రమంలో మరింత అవినీతి చోటు చేసుకుందని ఆరోపించారు. మొత్తం వ్యవహారంపై సమగ్రమైన విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఉన్నత స్థాయిలిఅధికారులకు తన వద్ద ఉన్నఆధారాలతో నివేదిక అందించనున్నట్లు వివరించారు. కేంద్రీయ విద్యాలయంలో నియమ నిబంధనలు పాటిస్తూ విద్యార్థుల అడ్మిషన్స్, టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బంది నియామకం జరిగే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎం సునీల్ కుమార్ , దద్దనాల శివ, నాయుడు శ్రీను, అధికారు లు తప్పిదం వల్ల సీటు కోల్పోయిన స్టూడెంట్ తండ్రి కాసుల లక్ష్మీ శ్రీనివాసరావు, టిడిపి 28వ వార్డు సెక్రటరీ తొందుల. రాజు తదిత రులు పాల్గొన్నారు.

## హృదయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు.




**ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు**

సభ్యులు గ్రంధి చిట్టిబాబు పుట్టినరోజు సందర్భంగా పాలకొల్లు వీవర్స్ కాలనీలో ఉన్న జి వి ఎస్ వి ఆర్ ఎం మునిసిపల్ మోడల్ ప్రైమరీ స్కూల్ నందు ట్రస్ట్ సభ్యులు సేవా కార్యక్రమం నిర్వహించారు.స్థానిక జి వి ఎస్ ఆర్ ఎం మోడల్ ప్రైమరీ స్కూల్ కు వాటర్ డ్రమ్స్,బిందెలు, సీలింగ్ ఫ్యాన్లు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వేరుకొండ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ బాబ్జీ గారి సహకారంతో 2013 న ట్రస్ట్ ప్రారంభించి గత 13 సంవత్సరాలుగా నిరంతరం గా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.వైద్య శిబిరాలు,రక్త దాన శిబిరాలు,పేదలకు ఉచితంగాఅన్నదానాలు,మందులు,నిత్యావసర సరుకులు పంపిణీ చేశామని తెలిపారు. భవిష్యత్తు లో కూడా సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు హృదయ చారిటబుల్ ట్రస్ట్ కు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ ఎంమ్ రాయపూడి భవానీ ప్రసాద్. ఉపాధ్యాయనీ జి .నందిని. మరియు ట్రస్ట్ సభ్యులు చేగొండి బాబీ,పోలినాటి శ్రీను,పాదాల అనిల్,రేకపల్లి విజయ్,పడవల ఉమా శ్రీనివాస్,బీరక శ్రవణ్,మండేలా ఫణి,రేపాక మహేష్,కర్రి గోపాల కృష్ణ నాని తదితరులు పాల్గొన్నారు.

## నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై నిరసన

### జూలై 24 విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని విద్యార్థి సంఘాల పిలుపు



**ప్రజాభూమి ప్రతినిధి–ఏలూరు**

రామచంద్రరావుపేటలోని స్ఫూర్తి భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏఐవైఎఫ్, డీవైఎఫ్ఐ, పిడిఎస్‌యూ నాయకులు జూలై 24న రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి. శివకుమార్, ఏఐవైఎఫ్ నాయకుడు కుర్రెల్ల వరప్రసాద్,ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు జి. శివకుమార్, పిడిఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని మాట్లాడుతూ, నీట్ ప్రశ్నాపత్రం లీకేజీతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు.ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత, పటిష్ట భద్రతా చర్యలు చేపట్టి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు జూలై 24న జరిగే బంద్‌కు మద్దతు తెలిపి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.సమావేశంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### కలెక్టర్ ఆదేశాలతో కార్మికులకు

## రెండు రోజుల్లో జీతాలు ఏర్పాటు

### అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పద్మావతి.

### కదిలిన యంత్రాంగం కార్మికుల్లో ఉత్సాహం.



**ప్రజాభూమి ప్రతినిధి–కాజులూరు.**

కాజులూరు మండలం గొల్లపాలెంలో గల సిపిడబ్ల్యూఎస్ స్కీమ్ కు సంబంధించిన కార్మికులకు రెండు రోజుల్లో జీతాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేసినట్లు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ బి. పద్మావతి పేర్కొన్నారు. ఇక్కడ పనిచేసే పదిమంది కార్మికులకు గత తొమ్మిది నెలల నుండి సంబంధిత కాంట్రాక్టర్ జీతాలు ఇవ్వడం లేదని బుధవారం కాజులూరు మండలం గొల్లపాలెంలో గల సిపిడబ్ల్యూఎస్ స్కీమ్ ప్రక్రియను పరిశీలించేందుకు వచ్చిన కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం .ఎన్ .హారేంధీర ప్రసాద్ దృష్టికి కార్మికుడు యేడిద వీర వెంకట నాగేశ్వరరావు తీసుకెళ్లన విషయం పాఠకులకు విదితమే.దీంతో స్పందించిన కలెక్టర్ ఎం ఎన్ హరేంధీర ప్రసాద్ సంబంధించిన అధికారులకు ఆదేశాలు జారీచేశారు.దీంతో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ బి. పద్మావతి గొల్లపాలెం సిపిడబ్ల్యూఎస్ స్కీము వద్దకు విచ్చేసి కార్మికులు జీతాలుపై ఆరాదీసి వివరాలు తీసుకున్నారు. అయితే సంబంధిత కాంట్రాక్టర్ ని వివరణ కోరగా తనకు సుమారు 13 లక్షల రూపాయలు బకాయిలు ఉన్నాయని అందుచేత ఇవ్వలేకపోయానని చెప్పినట్లు పద్మావతి పేర్కొన్నారు. అయితే ఆనెపంతో జీతాలు ఇవ్వకపోవడం సరికాదని సంబంధిత కార్మికులకు ఇవ్వాల్సిన జీతాలు వెంటనే చెల్లించాలని ఆమె కాంట్రాక్టర్ కు సూచించినట్లు పేర్కొన్నారు. అయితే తనకు ఈ విషయంలో ఇక్కడ పనిచేసే కార్మికులకు బకాయిలు ఉన్నట్లు తెలియదని తక్కువ జీతానికి పనిచేసే కార్మికులకు ఇలా నెలలు తరబడి బకాయిలు పెట్టడంపై అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పద్మావతి ఈసందర్భంగా అసహనం వ్యక్తం చేశారు. ఏది ఏమైనా ఇక్కడ పనిచేస్తున్న కార్మికులకు ఇప్పటివరకు ఇవ్వాల్సిన జీతాలు రెండు మూడు రోజుల్లో ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పద్మావతి సందర్భంగా పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ హరేంధీర ప్రసాద్ కాజులూరు మండలంలో సుడిగాలి పర్యటనలో భాగంగా గొల్లపాలెంలో కార్మికుల సమస్యపై వెంటనే స్పందించడం ఆగమేఘాల మీద సమస్యపై సంబంధిత లేబర్ ఆఫీసర్ పద్మావతి సంఘటన స్థలానికి విచ్చేయడం సమస్యను తెలుసుకోవడం దీనిపై వెనువెంటనే కాంట్రాక్టర్ తో సంప్రదించి జీతాలు ఇచ్చేందుకు చేస్తున్న ఏర్పాట్లు వంటి పరిణామాలు 9 నెలలుగా జీతాలు అందని కార్మికులకు ఎంతో ఊరట నివ్వడం వంటి పరిణామాలు జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలో ఇలాంటి దీర్ఘకాలిక సమస్య పరిష్కారంపై సంబంధిత కార్మికులతో పాటు ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ట్రాన్స్మిషన్ తరలింపు పనులపై

## అలసత్వం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవు

### జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

**ప్రజాభూమి ప్రతినిధి–అమలాపురం**

నేషనల్ హైవే 216 విస్తరణలో భాగంగా 132 కె.వి ట్రాన్స్మిషన్ తరలింపు పనులపై అలసత్వం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఏపీ ట్రాన్స్–కో అధికారులకు ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ ఛాంబర్ నందు నేషనల్ హైవే, ఏపీ ట్రాన్స్కో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ డా. బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో నేషనల్ హైవే 216విస్తరణలో 132 కెవి ట్రాన్స్మిషన్ ఫోల్స్ మొత్తం 8 ఉన్నాయని, అందులో 2 పోల్స్ మామిడికుదురు మండలంలో, 6 పోల్స్ రాజోలు మండలం పరిధిలో ఉన్నాయని వాటి టవర్ల, ట్రాన్స్మిషన్ కారిడార్ల స్థానంలో భూమిని కోల్పోయిన భూ యజమానులకు నష్టపరిహారం చెల్లించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని విశాఖపట్నం ఆర్‌డబి జాతీయ రహదారుల విభాగం కార్యనిర్వాహక ఇంజనీర్ కు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ఏపీ ట్రాన్స్కో అధికారులు నేషనల్ హైవే అధికారులతో సమన్వయం చేసుకుని పనులుపై కార్యాచరణ చేపట్టి త్వరతిగతిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ ట్రాన్సుమిషన్ తరలింపు పనులపై



కాలయాపన చేస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని కలెక్టర్ తెలియజేశారు. ప్రజలకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా పనులు త్వరతిగతిన పూర్తి చేయాలన్నారు.అదేవిధంగా ట్రాన్స్మిషన్ లైన్ మార్పిడి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి, ఎన్‌హెచ్–216 రహదారి విస్తరణ పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు.ఈ సమావేశంలో అమలాపురం ఆర్డీవో ఎ.సరళావతి, ఆర్‌డబి టూ నేషనల్ హైవే డి.ఈ.ఈ. టి. నిక్కీ, నేషన ల్ హైవే216 ఎ.ఈ ఎన్.వి రమణ, ఏపీ ట్రా న్స్–కో డి ఈ ఈ జీవి సత్యనారాయణ, తాసి ల్దార్లు మల్లేశ్వరరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## జొన్నాడ ఫ్లైఓవర్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్:ఆర్. మహేష్ కుమార్

**ప్రజాభూమి ప్రతినిధి–అమలాపురం**

జొన్నాడ ఫ్లైఓవర్ నిర్మాణ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ ఛాంబర్ లో హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, శృతి కాంటాక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు అత్యంత కీలకమైన జొన్నాడ ఫ్లైఓవర్ నిర్మాణాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పనుల్లో జాప్యం వల్ల ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందని పేర్కొంటూ, నిర్మాణ వేగాన్ని పెంచడంతో పాటు నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు.అదేవిధంగా జొన్నాడ ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్డు పూర్తి



చేయాలని,టెండర్లు పూర్తయినప్పటికీ ఆగస్ట్ నెలలో కాంట్రాక్టర్లతో సమీక్షించి నవంబర్ నెలలోపు సర్వీస్ రోడ్ పని పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు.నిర్మాణ పనుల కారణంగా ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తగిన ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టాలని, హెచ్చరిక బోర్డులు, భద్రతా ఏర్పాట్లు సమర్థవంతంగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి నిల్వ సమస్యలు తలెత్తకుండా డ్రైనేజీ ఏర్పాట్లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.నిర్మాణ సంస్థ ప్రతినిధులు పనుల పురోగతిని కలెక్టర్‌కు వివరించారు. అవసరమైన యంత్రాలు, సామగ్రి, కార్మికులను పెంచి నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎదురయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సమీక్ష సమావేశంలో ఎన్‌హెచ్ఏఐ సైట్ ఇంజనీర్ కే సత్యపావని, శృతి కాంటెక్ డీజీఎం ఎస్ రామకృష్ణ, రావులపాలెం,తాసిల్దార్ రాజు డీఎవో శ్రీదేవి రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏలూరు ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

### – ఎమ్మెల్యే బడేటి చంటి

**ప్రజాభూమి ప్రతినిధి–ఏలూరు**

నగరంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు. గురువారం ఆర్‌అండ్‌బి, మున్సిపల్ కార్పొరేషన్, పోలీసు, ఆర్టీసీ అధికారులతో కలిసి పాత బస్టాండ్ పరిసరాల్లో ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కార్పొరేషన్ షాపింగ్ కాంప్లెక్స్ పునర్నిర్మాణం, పాత బస్టాండ్ ఇన్–అవుట్ గేట్ల మార్పు, అవసరమైన చోట్ల రహదారుల విస్తరణ, డివైడర్ల ఏర్పాటు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. నగర సుందరీకరణతో పాటు ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే చంటి పేర్కొన్నారు.

# కరపత్రాలను విడుదల చేసిన సిపిఎం, సిపిఐ నాయకులు



ప్రజాభూమి, పుట్లూరు.

పుట్లూరు మండలం లోని ఓబులాపురం, కడవకల్లు, చాలు వేములగ్రామాలలో గురువారం కరపత్రాలు విడుదల చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం కెవిపిఎస్ పిలుపుకు వివక్షత లేని సమాజం కోసం సామాజిక శంఖారావం కార్యక్రమంలో భాగంగా కరపత్రాలను విడుదల చేశారు దీనిలో భాగంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సూరి, మండల కార్యదర్శి పెద్దయ్య మండల కార్యదర్శి కెవిపిఎస్ నాగభూషణ్ ఈ నెల 16 నుండి సెప్టెంబర్ నెల 15 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని దళిత కాలనీలలో అధ్యయనం యాత్రలు సమస్యలపై ఆందోళన నిరసనలు వివక్షత అంటరానితనము స్మశానేత స్థలాలు సమస్యలపై ప్రత్యక్ష ప్రతిఘటన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు కుల వ్యవస్థ అంటరానితనం పోవాలని మహాత్మ జ్యోతిబాపూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, నారాయణ గురు కెరియర్ రామస్వామి, గుర్రం జాషువా, పుచ్చలపల్లి సుందరయ్య వంటి ఎందరో మహనీయులు నిరంతరం పోరాడారు సామాజిక న్యాయ సాధన కోసం ప్రజలను సమీకరించారు స్వతంత్రం అనంతరం కొంతవరకు మార్పు వచ్చిన కుల వివక్షత అనే రూపంలో నేటికీ కొనసాగుతూ ఉన్నది అనేక ప్రాంతాలలో పెత్తందారులు కుచ్చగొడుతున్న కొడుతున్న దలిత మహిళలను చిన్నచూపు చూస్తున్నారు అడుగడుగునా ఉన్న దళితుల ఉన్నత చదువులు చదివించిన అధికారులు కూడా వివక్షత ఎదుర్కొంటున్నారు విద్యాలయాలలో కులతత్వాన్ని పాలకులు యజమానులే పోషిస్తున్నారు దళితులను రాజకీయ సాధనాలుగా పాలకులు యజమానులు పాలిస్తున్నారు. దళిత క్రైస్తవులకు ఎస్సిసి హోదా కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేయాలని కోరడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల నాయకులు జె పెద్దయ్య, టి కుల్లాయప్ప ,శివారెడ్డి, నారాయణస్వామి, నాగేష్, గంగయ్య, రాజేష్, ఓబులయ్య ,ఓల్డాసు భూషణ,ఆవుల పెద్దోడు, భూ శ్రీ నాగేంద్ర ,పెద్దిరాజు, రామచంద్ర, కాటమయ్య తదితరులు పాల్గొన్నారు.

# గురుపౌర్ణమికి నవీన్ నిశ్చల్ వితరణ -రూ.50,005/- కమిటీ ప్రతినిధులకు అందజేత



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం పట్టణంలోని నానెప్ప నగర్ లో వెలసిన శిరిడి సాయిబాబా దేవాలయంలో ఈనెల 29వ తేదీన జరిగే గురు పౌర్ణమి వేడుకలకు డాక్టర్ బి.వి.సాయిప్రసాద్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్, మాజీ ఆగ్రోస్ చైర్మన్ బి. నవీన్ నిశ్చల్ వితరణ అందజేశారు. ఆలయ కమిటీ ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు గురు పౌర్ణమి వేడుకల నిమిత్తం గురువారం తన కార్యాలయంలో రూ.50,005/- అందజేశారు. గురు పౌర్ణమి వేడుకల కోసం నవీన్ నిశ్చల్ ఆర్థిక సహకారం అందించడం పట్ల కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# చెరువు అభివృద్ధి పనులకు శ్రీకారం



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం రూరల్ మండల పరిధిలోని మలుగూరు చెరువు అభివృద్ధి పనులను గురువారం ప్రారంభించారు. సాగునీటి సంఘం అధ్యక్షులు నరసింహప్ప, స్థానిక టిడిపి నాయకుల విజ్ఞప్తి మేరకు శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ చెరువు అభివృద్ధి కోసం ప్రత్యేకంగా రూ.5 లక్షల నిధులను మంజూరు చేయించారు. దీంతో భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని ఉద్దేశంతో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రత్యేక చర్యలు తీసుకొని చెరువు అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. త్వరితగతిన చెరువు అభివృద్ధి పనులను చేపట్టి రైతులందరికీ మేలు జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షులు శంకర్, మాజీ సర్పంచ్ బాబు రెడ్డి, మాజీ సాగునీటి సంఘం అధ్యక్షులు ఆర్.గోవింద్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రామకృష్ణ, పాఠశాల కమిటీ చైర్మన్ కొండప్ప, తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# కేంద్ర జలశక్తి శాఖ మంత్రి పాటిల్ ని మర్యాదపూర్వకంగా కలిసిన సీఎం, ఎంపీలు



ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ ఎన్డీయే పార్లమెంట్ సభ్యులు, కేంద్ర మంత్రులు బృందంతో అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబిక లక్ష్మీనారాయణ కలిసి కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్ ని మర్యాదపూర్వకంగా మెమెంటు అందించడం జరిగింది. 2028 నాటికి రాష్ట్రంలోని ప్రతి గ్రామీణ ఇంటికి ఫంక్షనల్ ట్యాప్ కనెక్షన్ అందించాలనే లక్ష్యంతో గురువారం కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని కోరాము. అలాగే రాష్ట్ర దీర్ఘకాలిక జల భద్రత కోసం నదుల అనుసంధానం, తాగునీటి వనరుల అభివృద్ధి వంటి కీలక అంశాలపై సమగ్రంగా చర్చించాము. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నీటి భద్రత విజన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో ప్రతి గ్రామానికి సురక్షితమైన తాగునీరు అందేలా సమిష్టిగా కృషి కొనసాగిస్తామన్నారు.

# తెలుగుదేశం పార్టీ కో-ఆర్డినేటర్, పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాస్ రెడ్డికి మర్యాదపూర్వక పూల బొకే ను అందించిన అర్బన్ ఎమ్మెల్యే



ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

అనంతపురం జిల్లాకు విచ్చేసిన సందర్భంగా, అనంతపురం అర్బన్ శాసనసభ్యులు దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్ , బి గెస్ట్ హౌస్ నందు శ్రీనివాస్ రెడ్డి కి ఆత్మీయంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా వారికి పూలబుకే అందజేసి, అభిమానంతో హృదయపూర్వక స్వాగత సుమాంజలులు తెలియజేశాము. తెలుగుదేశం పార్టీ బలోపేతానికి, జిల్లా అభివృద్ధికి అనునిత్యం శ్రమిస్తున్న నాయకులకు ఈ సందర్భంగా మైనార్టీ నాయకుల తరపున ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అనంతపురం పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షులుసాలార్ భాషా, జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, మొదటి రోడ్డు శివాలయం అధ్యక్షుడు నరేందర్ చౌదరి, నియాజ్ అహ్మద్ (మైనార్టీ నాయకులు), ఇస్మాయిల్ ఆజాద్ (మాజీ ఎంపీపీ), అఫ్జల్, ఎల్లనూరు రియాజుద్దీన్, అల్తాఫ్, హాజీ వలి, కరీముల్లా, ఇస్మాయిల్ దౌల, పాన్ రఫీ, ఇనయాతుల్లా, జన బలం బాబా, కాల, ఇతర పార్టీ ప్రముఖులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో బడుగులకు భద్రత కరవు వైసీపీ నేతలపై దౌర్జన్యాలు - రమేష్ గౌడ్



ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బడుగు, బలహీన వర్గాలకు, మహిళలకు భద్రత కరవైందని వైసీపీ బీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో బీసీలు, బడుగు బలహీన వర్గాలు, మహిళలపై దాడులు పెరిగిపోయాయని ఆరోపించారు. వైసీపీ పార్టీ నేతలపై తప్పుడు కేసులు, అక్రమ అరెస్టులు, భూ ఆక్రమణలు జరుగుతున్నాయని మండిపడ్డారు. గురువారం జిల్లా వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతోపాటు బీసీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలపై కక్షపూరితంగా తప్పుడు కేసులు బనాయిస్తూ, అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, మహిళలపై దాడులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బాధితులకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందని విమర్శించారు. అక్రమ కేసులు, వేధింపులకు గురవుతున్న ప్రతి ఒక్కరికీ, దాడులకు గురైన బాధితులకు వైసీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. గత రెండేళ్లుగా వైసీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, తప్పుడు కేసులు, అరెస్టులు కొనసాగుతున్నాయని ఆరోపించారు. బడుగు బలహీన వర్గాలపై దౌర్జన్యాలు పెరిగిపోయాయని, రాష్ట్రంలో బీసీల పరిస్థితి అత్యంత దారుణంగా మారిందని అన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో 2023లో వైసీపీకి చెందిన బీసీ నాయకుడు గోవిందు అల్లుడు జయకుమార్ కొనుగోలు చేసిన 21 ఎకరాల భూమిలో వేసిన బోర్లను టీడీపీ నాయకులు ధ్వంసం చేశారని, ఆ భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పలుమార్లు అధికారుల చుట్టూ, జిల్లా పోలీసు ఉన్నతాధికారులను ఆశ్రయించినా స్పందించకపోవడం బాధాకరం అన్నారు. అలాగే రాయదుర్గం నియోజకవర్గంలోని కణేకల్‌లో నీటి కొళాయి వివాదంలో ఆంజనేయులు అనే వృద్ధుడిని చెప్పులతో కొట్టి అవమానిస్తే.. ఆ వృద్ధుడు ఆత్మహత్య చేసుకోవడం, అంకె నరేంద్రపై అక్రమంగా దొంగతనం కేసు నమోదు చేయడం వల్ల ఆత్మహత్యకు పాల్పడడం, కనగానపల్లికి చెందిన అంకే నగేష్‌ను టీడీపీ నాయకులు దౌర్జన్యంగా కొట్టి చంపడం.. కళ్యాణదుర్గం తూముకుంట గ్రామానికి చెందిన జగదీష్, ఆయన భార్య రోజాలపై గొడ్డలితో దాడి, అదే కళ్యాణదుర్గం చంద్రకళపై టీడీపీ నాయాకులు దాడి చేయడం వల్ల ఆత్మహత్య చేసుకోగా, ఆసుపత్రిలో ఆరు నెలలపాటు చికిత్స పొందుతూ చనిపోవడం.. వైసీపీ సోషల్ మీడియా శ్రీకాంత్‌పై అక్రమ కేసులు బనాయించడం, గుంతకల్లు ఎమ్మెల్యే సోదరుడి డ్రైవర్.. ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన వారిపై దౌర్జన్యంగా దాడులు చేయడం.. అదేవిధంగా కుప్పంలో బీసీ మహిళను చెట్టుకు కట్టేసి కొట్టిన ఘటన, గుంటూరులో ఓ మహిళను వివస్త్ర చేయడం, బద్వేలు, కర్నూలు, కుప్పం, కృష్ణా జిల్లా.. ఇలా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బీసీలపై దాడులు జరుగుతున్నాయన్నారు. ఇది శాంతిభద్రతల వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ రెండేళ్లుగా ఏదో ఒక ప్రాంతంలో బడుగు బలహీన వర్గాలపై దాడులు చేయడం చూస్తే.. ఆ పార్టీ నాయకులపై చంద్రబాబుకు నియంత్రణ లేకపోవడమా.. లేక బడుగులను ఆర్థికంగా, సామాజికంగా అణగదొక్కేందుకు మీరు అవలంభిస్తున్న నిరంకుశ వైఖరికి నిదర్శనమా.. అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో మాత్రమే బీసీలు చంద్రబాబుకు గుర్తుకు వస్తారని, అధికారంలోకి వచ్చిన తర్వాత వారి రక్షణను పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం తమ పార్టీ నాయకులను నియంత్రించలేకపోతోందని, ఈ పరిస్థితి కొనసాగితే వైసీపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. పార్టీ సీఈసీ సభ్యులు సుగుమంచిపల్లి రంగన్న మాట్లాడుతూ బీసీలపై కక్షసాధింపు చర్యలుగా కూటమి ప్రభుత్వం పెట్టుకుందన్నారు. ఉరవకొండ నియోజకవర్గం విడపనకల్లుకు చెందిన బీసీ నాయకులు గోవిందు అల్లుని భూమిని టీడీపీ నాయకులు దౌర్జన్యంగా కొట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అదేవిధంగా భూమిలోని బోర్లను ధ్వంసం చేశారన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి రైతుల పక్షపాతిగా అని, వైసీపీ నాయకులే టార్గెట్‌గా చేసుకున్న ఈ కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు, దౌర్జన్యాలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా విభాగం అధికార ప్రతినిధి టి.కృష్ణవేణి, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బోనాల హరికృష్ణ, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు మాలపాటి శ్రీనివాసులు, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి కొడికి గోవిందు, పార్టీ జిల్లా కార్యదర్శి ఆక్టివిటీ మల్లెల జగదీష్, ఉరవకొండ నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షులు జి.సురేష్, జిల్లా మున్సిపల్ విభాగం కార్యదర్శి వడ్డే రామచంద్ర, బీసీ నాయకులు నిమ్మల నాగరాజు, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి లబ్బే రాఘవ తదితరులు పాల్గొన్నారు.

# బైండోవర్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం -అదనపు ఎస్పీ కేవీ మహేష్
- బైండోవర్ వ్యక్తులు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

బైండోవర్ వ్యక్తులు నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు ఎస్పీ కేవీ మహేష్ హెచ్చరించారు. శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో ఎవరిని ఉపేక్షించేది లేదన్నారు. గురువారం హిందూపురం సబ్-డివిజన్ సీఐలు రాజగోపాల్ నాయుడు, అబ్దుల్ కరీం, జనార్ధన్, అంజినేయులు మరియు సంబంధిత పోలీస్ స్టేషన్ల ఎస్ఐలతో ప్రజా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా వుంచి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. అనంతరం అదనపు ఎస్పీ పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రజా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులను చట్ట ప్రకారం బైండోవర్ చేసి భవిష్యత్తులో ఎలాంటి నేరాలు, గొడవలు, జూదం, మట్కా, బెట్టింగ్, అక్రమ మద్యం విక్రయాలు, బెదిరింపులు, దాడులు వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బైండోవర్ సమయంలో సంబంధిత వ్యక్తుల నుంచి స్వీయ భద్రతా బాండ్లు అమలు చేయించి, నిర్దిష్ట కాలం పాటు మంచి ప్రవర్తనతో ఉండాలని షరతులు విధిస్తున్నట్లు తెలిపారు. అయితే కొంతమంది బైండోవర్ వ్యక్తులు ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ విధించిన బాండ్ షరతులను ఉల్లంఘించి మళ్లీ నేరాలకు పాల్పడుతున్నారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇటీవల భూ వివాదాలు, గొడవలు, జూదం, మట్కా, పేకాట, అక్రమ మద్యం విక్రయాలు తదితర నేరాల్లో మళ్లీ పాల్గొన్న వ్యక్తులపై కేసులు నమోదు చేయడంతో పాటు, బాండ్ ఉల్లంఘన విషయాన్ని సంబంధిత ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ లకు నివేదించి బాండ్ ఫోర్ఫీచర్, భారీ జరిమానా, డిటెన్షన్, జుడీషియల్ రిమాండ్ వంటి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. బైండోవర్ అయిన వ్యక్తులు బాండ్ కాలంలో మళ్లీ ఏదైనా నేరానికి పాల్పడితే బాండ్ ఉల్లంఘనపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా జూదం, పేకాట, మట్కా, బెట్టింగ్, అక్రమ మద్యం విక్రయాలు లేదా రవాణా, గొడవలు, దాడులు, బెదిరింపులు, ప్రజా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఇతర కార్యకలాపాలకు పాల్పడితే, సంబంధిత నేరం కింద కేసు నమోదు చేయడంతో పాటు బైండోవర్ నిబంధనల ఉల్లంఘనపై కూడా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రజా శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని, జూదం, మట్కా, బెట్టింగ్, అక్రమ మద్యం, గొడవలు, బెదిరింపులు లేదా ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్కు తెలియజేయాలని అదనపు ఎస్పీ కోరారు. బైండోవర్ అనేది కేవలం హెచ్చరిక మాత్రమే కాదని, బాండ్ నిబంధనలు ఉల్లంఘించి మళ్లీ నేరాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం ఫోర్ఫీచర్, జరిమానా, డిటెన్షన్, అవసరమైన సందర్భాల్లో జైలుకు తరలించే చర్యలు తప్పకుండా తీసుకుంటామని చెప్పారు. ప్రజా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఎవ్వరినీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, ప్రజలు చట్టాన్ని గౌరవించి, శాంతియుత వాతావరణం కోసం పోలీసులకు సహకరించాలని అదనపు ఎస్పీ కోరారు.

# పంటకు బీమా చేయండి - రక్షణ కవచం పొందండి..

**- : ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలి జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.సాలురెడ్డి**



ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

పంటకు బీమా చేయండి - రక్షణ కవచం పొందాలని, జిల్లాలోని రైతు సోదరులందరూ కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.సాలురెడ్డి పేర్కొన్నారు. అనంతపురం నగరంలోని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో గురువారం పంటల బీమా పథకం- ఖరీఫ్ - 2026పై జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ మారుతి శ్రీనివాసులుతో కలసి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సాలురెడ్డి ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ ఖరీఫ్ - 2026లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో 'ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన' పునర్వ్యవస్థీకృత వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం ల సౌకర్యాలు రాష్ట్రంలోని అందరి రైతులకు కల్పించడానికి అను గుణంగా జీవో రిలీజ్ చేయడం జరిగిందన్నారు. అనంతపురము జిల్లాలో ఖరీఫ్--2026 సీజన్లో అర్హులైన ప్రతి రైతు పంటల బీమా పథకంలో నమోదు అయ్యేలా వ్యవసాయ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. (దిగుబడి ఆధారిత పంటల బీమా) కింద కంది, వరి, జొన్న, మొక్కజొన్న, ఆముదం మరియు మిరప పంటలు నోటిఫై చేయగా, (వాతావరణ ఆధారిత పంటల బీమా) కింద వేరుశనగ, పత్తి, దానిమ్మ, బత్తాయి, అరటి మరియు టమాట పంటలు నోటిఫై చేయబడ్డాయన్నారు. లో వరి మినహా అన్ని పంటలకు 31-07-2026, వరి పంటకు 15-08-2026, అన్ని పంటలకు 31-07-2026 చివరి తేదీగా నిర్ణయించబడిందన్నారు. 23-07-2026 నాటికి కింద 19,908 ఋణం పొందిన రైతులు, 1,766 ఋణం పొందని రైతులు, మొత్తం 34,073 హెక్టార్లు, కింద 25,621 ఋణం పొందిన రైతులు, 30,406 ఋణం పొందని రైతులు, మొత్తం 42,501 హెక్టార్లు బీమా ప్రీమియం చెల్లించడం జరిగిందన్నారు. మొత్తం 76,574 హెక్టార్లకు సంబంధించి బీమా ప్రీమియం చెల్లించడం జరిగిందన్నారు. గత ఖరీఫ్‌లో నమోదైన బీమా విస్తీర్ణంతో పోలిస్తే ఇంకా అధిక సంఖ్యలో రైతులను బీమా పరిధిలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రాలు, గ్రామ సభలు, "పొలం పిలుస్తోంది" కార్యక్రమాలు, పోస్టర్లు, బ్యానర్లు, సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించబడుతోందన్నారు. ఋణం పొందని రైతులు సి ఎస్ సి కేంద్రాల ద్వారా సులభంగా పంటల బీమాలో నమోదు చేసుకోవచ్చున్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశంలో ఈ క్రింది కీలక ఆదేశాలు జారీ చేశారన్నారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది ద్వారా ఖరీఫ్-2026లో నోటిఫై చేసిన పంటలను వాస్తవంగా ఎంతమంది రైతులు సాగు చేస్తున్నారో మరియు సాగు చేయబోతున్న పంటల వివరాలు రైతు వారీగా మండలాల వారీగా తక్షణమే గుర్తించి నివేదిక సమర్పించాలన్నారు. ఎల్డిఎం సమన్వయంతో అన్ని బ్యాంకుల ద్వారా పంట రుణాలు పొందిన రైతుల సంఖ్య, పంటల వారీ వివరాలను ఒక రోజులోపు వ్యవసాయ శాఖకు అందజేయాలన్నారు. పంటల బీమా పథకం నుండి చేసిన రైతుల పూర్తి వివరాలను బ్యాంకులు ప్రత్యేకంగా నమోదు చేసి వ్యవసాయ శాఖతో పంచుకోవాలన్నారు. పంట రుణం పొందిన రైతులు రుణం తీసుకున్న సమయంలో పేర్కొన్న పంటకు బదులుగా వేరే పంట సాగు చేసినట్లయితే, అటువంటి రైతుల వివరాలన్ని వ్యవసాయ శాఖ బ్యాంకులు సంయుక్తంగా గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. పంట మార్పు చేసిన రుణగ్రహీత రైతులు సెల్ఫ్ డిక్లరేషన్ (క్రాప్ చేంజ్ డిక్లరేషన్) దరఖాస్తును తప్పనిసరిగా సంబంధిత బ్యాంకులో సమర్పించేలా గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి మాట్లాడుతూ ఇప్పుడు ఉన్న ఎల్.నినో ప్రభావం వల్ల మన వాతావరణంలో కూడా చాలా మార్పులు జరుగుతున్నాయని, ఊహించని రకంగా ఉందని, ఇప్పటిదాకా మనకు వర్షం కూడా లోటు శాతంతోనే ఉందన్నారు. టెంపరేచర్స్ కూడా ఇంకా పెరగడానికి అవకాశం ఎక్కువ ఉందన్నారు. వర్షాలు తగ్గాయి అంటే ఆటోమాటిక్‌గా టెంపరేచర్స్ ఎక్కువ అవుతాయని, వీటి ప్రభావం అంతా ఉద్యాన పంటల మీద చాలా ఎక్కువ ఉంటుందని, బత్తాయి, అరటి, టమాటా, దానిమ్మ మీద చాలా ఎక్కువ ఉంటుందన్నారు. వాతావరణంలో మార్పుల వల్ల కూడా దానిమ్మలో ఎక్కువ జబ్బులొచ్చే అవకాశం ఉందని, చీనిలో, అరటిలో దిగుబడి తగ్గడానికి అవకాశం ఎక్కువ ఉంటుందన్నారు. ప్రతి రైతు వాతావరణ బీమా పథకంలో వాళ్ళ ప్రీమియం కట్టుకుని ఇప్పుడు వచ్చే రిస్క్‌లని కొంచెం తగ్గించుకోవాలని కోరురున్నామన్నారు. ఇందులో ఏమైనా సందేహాలు ఉంటే ఆర్ఎస్‌కే ఇన్‌ఛార్జ్‌ల దగ్గరికి వెళ్లి స్పష్టత తీసుకుని ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరుతున్నామన్నారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ మారుతి శ్రీనివాసులు మాట్లాడుతూ పంటల బీమా పథకం గొప్ప అవకాశం అని, రైతులు ఈ ఇన్సూరెన్స్ స్కీమ్ నుంచి లబ్ది పొందాలని కోరారు. బ్యాంకుల నుంచి ప్రతి రైతుకు రుణాలు తీసుకున్నవాళ్ళకి తప్పనిసరిగా బీమా చేయాలని చెప్పడం జరిగిందన్నారు. ప్రతి రైతుకు లబ్ది కలిగించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

# ప్రభుత్వాసుపత్రి సమస్యలు పరిష్కరించండి -అధికారులకు విన్నవించిన ఎస్.యూ.సి.ఐ.



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం పట్టణంలోని జిల్లాస్థాయి ప్రభుత్వాసుపత్రిలో నెలకున్న సమస్యలను పరిష్కరించాలని సోషలిస్ట్ యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా (కమ్యూనిస్టు) పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్, ఆసుపత్రి సూపరిండెంట్ లకు ప్రజల సంతకాలతో కూడిన వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఆసుపత్రి ముఖ్యమైన పాత్ర పోషిస్తోందని, అయితే ప్రస్తుతం ఆసుపత్రిలో వైద్యుల, సిబ్బంది కొరత తీవ్రంగా ఉందన్నారు. సుమారు 700 పడకల సామర్థ్యం ఉన్న ఈ ఆసుపత్రిలో అవసరమైనంత మంది వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రోగులకు సరైన వైద్య సేవలు అందడం లేదని, అత్యవసర చికిత్సలు, పరీక్షలు, స్కానింగ్ వంటి సేవలు కూడా తగిన సిబ్బంది లేక ఆలస్యమవుతున్నాయని, మందులు కూడా అందుబాటులో లేవని ఓపీ కౌంటర్ మధ్యాహ్నం వరకే ఉండడంతో దూరప్రాంతాల నుండి వచ్చే ప్రజలు ఇబ్బందిపడుతున్నారని పేర్కొన్నారు. రాత్రి వేళల్లో వచ్చే రోగులను సరైన విధంగా చూడటం లేదని, కొన్ని ఎమర్జెన్సీ కేసులను అనంతపురం లేదా బెంగళూరు లకు రెఫర్ చేస్తున్నారని, దీనివల్ల పేద, దిగువ మధ్యతరగతి ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని చెప్పారు. జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, అవసరమైన పరికరాలను సమకూర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై స్పందిస్తూ తహసిల్దారు, ఆసుపత్రి సూపరిండెంటెంట్ ఈ సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు అశోక్, మల్లిక్ దత్, స్వప్న, రమేష్, మద్దతుదారులు పాల్గొన్నారు.

# యర్రగుంట్లను అమృత్ భారత్ స్టేషన్‌గా అభివృద్ధి చేయాలి

## కడపలో 2 షిఫ్టుల రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేయండి -కడపజిల్లా రైల్వే అభివృద్ధిపై కేంద్ర మంత్రికి అవినాష్ రెడ్డి వినతి

ప్రజాభూమి, పులివెందుల

కడప జిల్లాలో రైల్వే అభివృద్ధి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని పార్లమెంట్ సభ్యులు వైయస్ అవినాష్ రెడ్డి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు.బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌ను ఆయన కార్యాలయంలో కలిసిన ఎంపీ అవినాష్ రెడ్డి, కడప జిల్లాకు సంబంధించిన పలు కీలక అంశాలపై వినతి పత్రం అందజేశారు. యర్రగుంట్ల రైల్వే స్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద అభివృద్ధి చేయాలని ఎంపీ కోరారు. ఈ స్టేషన్ కడప, కర్నూలు జిల్లాలకు కనెక్టివిటీగా ఉందని, స్టేషన్ ఆధునీకరణతో వేలాది మంది ప్రయాణికులకు ఉపయోగపడుతుందని వివరించారు. ఆధునిక సౌకర్యాలు, ప్లాట్‌ఫాం విస్తరణ, లిఫ్టులు, ఎస్కలేటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు.కడప రైల్వే స్టేషన్‌లో ప్రస్తుతం ఒకే షిఫ్టులో రిజర్వేషన్ కౌంటర్ ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రద్దీని దృష్టిలో ఉంచుకొని రెండు షిఫ్టుల్లో రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేసి, 24 గంటల సేవలు అందించాలని కోరారు. దీనివల్ల విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు.జిల్లాలోని పలు రైల్వే స్టేషన్లలో మరిన్ని రైళ్లకు నిలుపుదల కల్పించాలని వినతిలో పేర్కొన్నారు.. దీనివల్ల జిల్లా ప్రజలకు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, విజయవాడ తదితర ప్రాంతాలకు ప్రయాణం సులభతరం అవుతుందని వివరించారు.కడప జిల్లా రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్రం ప్రత్యేక నిధులు కేటాయించాలని కూడా ఎంపీ అవినాష్ రెడ్డి మంత్రిని కోరారు. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ఎంపీ వినతిపై సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో చర్చించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.



# నగరిగుట్ట మంగళ కాలనీలో తాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం

## ప్రజలతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించిన మున్సిపల్ ఇంచార్జి వైఎస్ మనోహర్ రెడ్డి

ప్రజాభూమి,పులివెందుల



పులివెందుల పట్టణంలోని నగరిగుట్ట మంగళ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యపై మున్సిపల్ ఇంచార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, మాజీ చైర్మన్ చిన్నప్ప, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్ లు గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలిం చారు. స్థానికులు తాగునీటి సరఫరా సక్రమంగా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయన దృష్టికి కాలనీవాసులు తీసుకురావడంతో వెంటనే సంబంధిత ప్రాంతానికి చేరుకుని సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అక్కడే పైప్‌లైన్, వాల్వ్ తదితర అంశాలను పరిశీలించి, నీటి సరఫరా పునరుద్ధరణకు అవసరమైన పనులను దగ్గర ఉండి చేయించారు . దీంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా వైఎస్ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు కనీస అవసరమైన తాగునీటిని అందించడం మా కర్తవ్యం అన్నారు. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటామన్నారు. వార్డులలో ఏ సమస్య వచ్చినా మా దృష్టికి తీసుకురావాలన్నారు. ఈకార్యక్రమంలో వైసీపీ నాయకులు అరకటవేముల డేనియల్,వెంకటపతి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి జూనియర్ హాకీ ఛాంపియన్ షిప్ లో పులివెందుల క్రీడాకారులకు రజతం

ప్రజాభూమి,పులివెందుల



గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జూలై 19 నుంచి 22 వరకు జరిగిన 16వ జూనియర్ పురుషుల రాష్ట్ర హాకీ ఛాంపియన్‌షిప్‌లో కడప జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించిన పులివెందుల క్రీడాకారులు రజత పతకం సాధించారు.ఈ విజయం పులివెందుల హాకీ చరిత్రలో మరో మైలురాయిగా నిలుస్తుందని ఖేలో ఇండియా హాకీ సెంటర్ పులివెందుల కోచ్ ఈ. రవికుమార్ తెలిపారు. క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు గర్వం తెచ్చారన్నారు.ఈ విజయంపై కడప జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డి.ఎస్.డి.ఓ గౌస్ క్రీడాకారులను, కోచ్‌లను, సహకరించిన ప్రతి ఒక్కరినీ హృదయపూర్వకంగా అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ఇదే పట్టుదలతో సాధన కొనసాగించి రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో మరిన్ని విజయాలు సాధించి జిల్లా, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఇంకా ఎన్నో విజయాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పంటల బీమా గడువు పొడిగించాలి

ప్రజాభూమి,పులివెందుల



వాతావరణ ఆధారిత పంటల బీమా గడువు నెలాఖరు వరకు పొడిగించాలని రైతు నూలి రామలింగారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వల్ల ఇంతవరకు పదును వర్షాలు కూడాకురవ లేదన్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న పత్తి పంటపై కూడా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. సరైన వర్షాలు లేనందున పత్తి దిగుబడి కూడా గణనీయంగా తగ్గిపోయిందని ఆయన సూచనప్రాయంగా తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ కు సంబంధించి వాతావరణ ఆధారిత పంటల బీమా శుక్రవారంతో ముగుస్తుందన్నారు. అయితే సాంకేతిక పరమైన ఇబ్బందులు తలెత్తడంతో చాలామంది రైతులు సకాలంలో పంటల బీమా చేసుకోలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బీమా గడువు నెలాఖరు వరకు లేదా మరోపక్షం రోజులపాటు పొడిగిస్తే రైతులకు ఊరట కలుగుతుందని, ఆదిశగా అధికార యంత్రాంగం చొరవ చూపాలని రామలింగారెడ్డి ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# తొలి ఏకాదశి సందర్భంగా అష్టోత్తర శత కలశాభిషేకం

## - 24న అంకురార్పణ.. 25న 108 కలశాల స్థాపన, శాంతిహోమం, మహాపూర్ణాహుతి

## - దేవస్థానం చైర్మన్ పీవీ రమణ, కార్యనిర్వహణాధికారి కె. సుభాష్

ప్రజాభూమి, వేంపల్లె



రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలు సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు స్థానిక పట్టణంలోని శ్రీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 24, 25 తేదీల్లో అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహించనున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె. సుభాష్ తెలిపారు. దేవస్థానం పాలకమండలి చైర్మన్ పీవీ రమణ అధ్యక్షతన దేవస్థానం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. ఈ నెల 24వ తేదీ (శుక్రవారం) సాయంత్రం 6 గంటలకు అంకురార్పణతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, 25వ తేదీ (శనివారం) తొలి ఏకాదశి సందర్భంగా 108 కలశాల స్థాపన, శాంతిహోమం నిర్వహించి మధ్యాహ్నం 12 గంటలలోపు మహాపూర్ణాహుతితో కార్యక్రమాలు ముగుస్తాయని తెలిపారు. ఈ రెండు రోజుల ప్రత్యేక పూజా కార్యక్రమాలు పట్టణంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు. ఈ సమావేశంలో ఆలయ ముఖ్య అర్చకులు హరిప్రవీణ్, దేవస్థానం పాలకమండలి సభ్యులు సునీల్ కుమార్, రామయ్య, జ్యోతి, మారుతీ ప్రసన్న, వరాలు తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రరత్న భవన్ పై దాడి సిగ్గుచేటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పీసీసీ సభ్యులు అన్వర్

ప్రజాభూమి పోరుమామిళ్ల :



ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయం ఆంధ్ర రత్న భవన్ పై స్వయంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తన అనుచరులను తీసుకొని దాడి చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పీసీసీ సభ్యులు అన్వర్ మండిపడ్డారు. గత రెండు రోజులుగా ఢిల్లీలో కాక్రోచ్ పార్టీ చేస్తున్న నిరసన కార్యక్రమానికి మద్దతుగా రాహుల్ గాంధీ ప్రధాని ఇంటిని ముట్టడి చేసే కార్యక్రమానికి పునుకుంటే దారి మధ్యలోనే పోలీసులతో లాఠీచార్జి అరెస్టులు చేయించడమే కాకుండా దేశవ్యాప్తంగా బిజెపి మరియు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలపై దాడి చేయడం అవమానసీయమైన ఘటన అని దీన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. భారతీయ జనతా పార్టీ కేంద్రంలో అధికారం చేపట్టినప్పటి నుంచి 150 సార్లు అన్ని రకాల ప్రశ్నాపత్రాలు లీక్ అవ్వడం దేశ చరిత్రలోనే కనీ విని ఎరుగని ప్రభుత్వ వైఫల్యం అని ఈ వైఫల్యాలను ప్రశ్నిస్తుంటే పోలీసుల ద్వారా లాఠీచార్జి చేయడం దాడి చేయించడం సిగ్గుచేటని ఆయన అన్నారు. ఈ విషయాలన్నిటినీ భారతదేశ ప్రజలు, రాజకీయ పార్టీలు తీవ్రంగా ఖండిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని శాంతియుతంగా జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ పార్టీ మరియు యువకులు ప్రజాస్వామ్యబద్ధంగా దీక్ష చేస్తుంటే దానిని జీర్ణించుకోలేక భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం యువకులపై, కాక్రోచ్ పార్టీపై వీరికి మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ పార్టీపై దాడులు చేయడం సిగ్గుచేటని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటన్నింటికీ సమాధానం చెప్పలేక భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులపై పార్టీ కార్యాలయాలపై యువకులపై లాఠీచార్జి చేస్తుంటే భారత ప్రజాస్వామ్యం కూడా తలదించుకునే పరిస్థితి ఈ రోజు భారతదేశంలో కనిపిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు వీటన్నిటికీ సమాధానం చెబుతూ వెంటనే ప్రధాని మోదీ, విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఏపీఎస్పీ 11వ పోలీస్ పటాలయంలో డీఐజీ వార్షిక తనిఖీలు



ప్రజాభూమి, సిద్ధవటం: వార్షిక తనిఖీల్లో భాగంగా కర్నూలు రేంజ్ ఏపీఎస్పీ డీఐజీ ఉదయభాస్కర్ గురువారం సిద్ధవటం మండలంలోని భాకరాపేట సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ పోలీస్ పటాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బెటాలియన్ ట్రైనింగ్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌తో పాటు పరేడ్ గ్రౌండ్‌లో నిర్మించనున్న పలు మౌలిక వసతుల శిలాఫలకాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ, మహిళల సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ ఉచిత టైలరింగ్ అండ్ ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సును ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అలాగే పోలీసులు క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా యూనిట్ వైద్యశాలతో పాటు పలు విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. కార్యక్రమంలో కమాండెంట్ ఆనందరెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్లు ప్రసాద్, రాజశేఖర్, వెంకటప్పతో పాటు పోలీస్ పటాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.ఈ వార్తను ఈనాడు, సాక్షి, ఆంధ్రజ్యోతి వంటి దినపత్రికల వార్తా శైలికి అనుగుణంగా, ప్రచురణకు సిద్ధంగా ఉండే విధంగా రూపొందించాను.

# ఘనంగా యువనేత రవితేజరెడ్డి జన్మదిన వేడుకలు

## - భారీ కేక్ కటింగ్, బైక్ ర్యాలీ నిర్వహణ

ప్రజాభూమి, వేంపల్లె




తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ఎ. రవితేజరెడ్డి జన్మదిన వేడుకలను గురువారం టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలి నుంచి ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉర్దూ షాదీఖానాలో భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలు, అభిమానులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తమ అభిమాన నాయకుడు ఎ. రవితేజరెడ్డి ఆయురారోగ్యాలతో మరెన్నో జన్మదినాలు జరుపుకుంటూ, ప్రజాసేవలో మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలని నాయకులు, కార్యకర్తలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర, పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్, టౌన్ క్లస్టర్ ఇంచార్జి మహమ్మద్, నాయకులు దేవర్ల చంద్రశేఖర్‌రెడ్డి, తెలంగాణ వలి, దక్కా రమేష్, జబిబుల్లా, మడక శ్రీను, సుధాకర్‌రెడ్డి, గణేష్, సానే రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# శిరిడి సాయిబాబాకు విశేష పూజలు

## ప్రత్యేక అలంకారంలో సాయినాథుడు

## ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలి

ప్రజాభూమి,పులివెందుల



పట్టణంలోని పార్నపల్లి రోడ్డు సమీపంలోని శ్రీ శిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు.ఆలయ ప్రధాన అర్చకులు మురళి స్వామి ఆధ్వర్యంలో ఉదయం కాగడ హారతి, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, అష్టోత్తర శతనామావళి నిర్వహించారు. అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్న, సంధ్య, శేజ హారతులు అర్పించారు.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య మాట్లాడుతూ ప్రతి గురువారం అన్నదాన కార్యక్రమాలు నిర్వహి స్తున్నామని తెలిపారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా కళ్యాణ మండపం, గదుల నిర్మాణాలు చేపడుతున్నామని, దాతలు ముందుకు వచ్చి సహకరించాలని పిలుపునిచ్చారు. దాతల పేర్లను శిలాఫలకంపై వేయిస్తామని, గురు పౌర్ణమినాడు విశేష పూజలు చేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో షిరిడి సాయి సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా మౌలాలి జన్మదిన వేడుకలు

## అన్నదానం, పండ్లు, బిస్కెట్లు, ఎనర్జీ డ్రింక్స్ పంపిణీ చేసిన "మనఊరికోసం" స్వచ్ఛంద సేవా సంస్థ



ప్రజాభూమి, సిద్ధవటం: మాధవరం-1 గ్రామానికి చెందిన మనఊరికోసం స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యుడు దుర్గం దస్తగిరి కుమారుడు మౌలాలి జన్మదినాన్ని పురస్కరించుకుని కొత్తమాధవరం సమీపంలోని కాశినాయన వృద్ధాశ్రమంలో గురువారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆశ్రమంలోని వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపడంతో పాటు మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. అనంతరం పండ్లు, బిస్కెట్లు, ఎనర్జీ డ్రింక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ అవ్వారు రవిశంకర్ మాట్లాడుతూ, ప్రతి ఏడాది మౌలాలి జన్మదినాన్ని మనఊరికోసం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా మౌలాలి కుటుంబ సభ్యులు ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దస్తగిరి కుటుంబ సభ్యులు తస్లీం, సంస్థ సభ్యులు సామల చెంగయ్య, కిశోర్, సుధీర్, ఆశ్రమ నిర్వాహకులు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించిన మహిళలు

**- సకాలంలో వర్షాలు కురిసి గ్రామం సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు**
**- అమ్మవారిని దర్శించుకున్న స్థానిక నాయకులు**



ప్రజాభూమి, సిద్ధవటం: కడప--చెన్నై జాతీయ రహదారిపై భాకరాపేట సమీపంలో వెలసిన గ్రామదేవత శ్రీ ఎల్లమ్మ అమ్మవారికి గురువారం మహిళలు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో తమ మొక్కులు చెల్లించుకున్నారు. తెల్లవారుజాము నుంచే మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలతో ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో కళకళలాడింది. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు, హారతులు నిర్వహించి గ్రామంలో సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో ఉండాలని భక్తులు ప్రార్థించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రత్యేక పూజా కార్యక్రమంలో సిద్ధవటం ఎస్సై హారికతో పాటు పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు వారికి సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పుత్తా రామచంద్రయ్య, తుర్రా ప్రతాప్ నాయుడు, రామ్మోహన్ నాయుడు, నాగం నరసింహారెడ్డి, పుత్తా ఎల్లయ్య, బాలయ్య, రాటాల రామయ్య, అవ్వారు రవిశంకర్, పుత్తా శివానంద, పుత్తా సుధీర్ రాయల్, బాలచంద్రతో పాటు గ్రామ మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

# మంచినీటి ట్యాంకు శుభ్రపరచాలని గ్రామస్తుల విజ్ఞప్తి



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని ముమ్మడిగుంటపల్లి గ్రామంలో తాగునీటి ట్యాంకు చుట్టూ అపరిశుభ్రత పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుండటంతో గ్రామ మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు రెండు నెలలుగా ట్యాంకును శుభ్రపరచకపోవడంతో పాచి పేరుకుపోయిందని, తాగునీటిలో మురికి చేరుతుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అపరిశుభ్ర వాతావరణం కారణంగా విరోచనాలు, ఒళ్లునొప్పులు, విషజ్వరాలు వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని పేర్కొంటూ, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ట్యాంకును శుభ్రపరచడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయమై ఎంపీడీఓ ఫణి రాజకుమారిని వివరణ కోరగా, సమస్యను సంబంధిత పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లి తాగునీటి ట్యాంకును వెంటనే శుభ్రపరిచేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# రవితేజ రెడ్డి జన్మదినం సందర్భంగా వృద్ధాశ్రమంలో అన్నదానం

## - రామమునిరెడ్డి, వీరభద్ర ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

ప్రజాభూమి, వేంపల్లె



స్థానిక రాజీవ్ నగర్ కాలనీలోని అమ్మ అనాథ వృద్ధాశ్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ఎ. రవితేజ రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం టీడీపీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని అనాథ వృద్ధులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేసి, అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భోజనాలు వడ్డించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలోని నిరుపేదలు, అనాథలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో సేవాభావాన్ని పెంపొందించడానికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ రెడ్డి, పద్మనాభ రెడ్డి, రాహుల్, పవన్ కుమార్, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

# 396 జీవోను వెంటనే రద్దు చేయాలి

## పులివెందులలో దస్తావేజులేఖరుల ఆగ్రహం

ప్రజాభూమి,పులివెందుల



పులివెందుల దస్తావేజులేఖరులు ప్రసాదు, బసవరాజు, రామలింగారెడ్డి లు గురువారం జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘ సమస్యల పరిష్కారంలో వారు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. లేఖరుల హక్కులు, జీవనోపాధికి సంబంధించిన సమస్యలపై స్పష్టమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.మా సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి 396 జీవోను రద్దు చేసి మాకు న్యాయం చేయాలి అని వారన్నారు.మా డిమాండ్లు నెరవేరే వరకు మా పోరాటం ఆగదు అని లేఖరులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భార్గవ రాజశేఖర్ అమీర్, శివ,రామాంజి, తదితరులు పాల్గొన్నారు.

## వరదయ్యపాలెం తాసిల్దార్ కార్యాలయంకు సిబ్బంది కావలెను..!!




ప్రజా భూమి ప్రతినిధి వరదయ్యపాలెం.
సత్యవేడు నియోజకవర్గం వరదయ్యపాలెం తాసిల్దార్ కార్యాలయం సిబ్బంది కొరతతో సకాలంలో పనులు జరగడం లేదు. ఈ కారణంగా ఫిర్యాదులు, సమస్యల పరిష్కారం కొరకు వినతులిచ్చిన ప్రదక్షిణలు తప్పడం లేదని మండలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు భూ సమస్యలు, ఆక్రమణలు, అక్రమ రవాణా వంటి వ్యవహారాలు మండలంలో ఎక్కువ. ఈ నేపథ్యంలో ఫిర్యాదులు ఇచ్చినప్పటికీ సకాలంలో అధికారులు స్పందించడం లేదని మండల వాసులు గగ్గోలు పెడుతున్నారు ముఖ్యంగా తాసిల్దార్ కార్యాలయంలో అత్యంత కీలకమైన డిప్యూటీ తాసిల్దార్ పోస్టు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ పోస్టు, సీనియర్ అసిస్టెంట్ పోస్టు, ఒక జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి కొన్ని సందర్భాల్లో ఈ సిబ్బంది కొరత కారణంగా రెవెన్యూ సిబ్బందికి సకాలంలో జీతాలు కూడా అందడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు కీలకమైన పోస్టులన్నీ ఖాళీగా ఉండటం వల్ల మండల తాసిల్దార్ అన్ని పనులపై నిఘాఉంచి ముందుకు సాగడం కూడా ఇబ్బందిగా ఉంది వారంలో రెండు రోజులు మూడు రోజులు తాసిల్దార్ కూడా కోర్టు కేసులకు హాజరు కావలసిన పరిస్థితి ఉంది. అలాంటి సమయాల్లో తాసిల్దార్ కార్యాలయంలో కనీసం వినతులు స్వీకరించే వారు కూడా కరువే. దీనికి తోడు అరకొరగా ఉన్న వీఆర్వోలు కూడా ఎప్పుడు ఎక్కడ ఉంటారో తెలియడం లేదు సచివాలయం, తాసిల్దార్ కార్యాలయం, పంచాయతీ ఆఫీస్ అంటూవీఆర్వోలు చెబుతున్నప్పటికీ... వారి ఆచూకీ కనుగొని... వారి దర్శనం దొరకడం ఫిర్యాదుదారుల అదృష్టం మీదే ఆధారపడి ఉంది.

## పెండింగ్ జీతాలను వెంటనే ఇవ్వాలి

### - ఏ. ఐ.టి. యు.సి నియోజకవర్గ అధ్యక్షులు సి.వి.ఆర్ కుమార్



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,
స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల జీతాలను వెంటనే ఇవ్వాలని ఏ. ఐ.టి. యు.సి నియోజకవర్గ అధ్యక్షులు సి విఆర్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 7 నెలలుగా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే శానిటేషన్ సిబ్బందికి జీతాలు చెల్లించడం లేదన్నారు. కొత్త కాంట్రాక్టర్ క్రమం తప్పకుండా జీతాలు చెల్లించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. ఏం. ఓ.యు ప్రకారం పూర్తి జీతాలు చెల్లించాలన్నారు. ఉద్యోగ భద్రత కలించాలన్నారు. నూతన ఆసుపత్రిని త్వరలో నే వినియోగంలోకి తీసుకురావాలని ఆసుపత్రి అభివృద్ధి కమిటీని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రి లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి నెల క్రమం తప్పకుండా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జీతాలు లేకపోవడం వలన కుటుంబ జీవనం అగమ్య గోచరంగా ఉందన్నారు. అనంతరం ఆర్డీవో కి వినతిపత్రం అందచేశారు. ఆర్డీవో సానుకూలంగా స్పందించి న్యాయం చేస్తామన్నారు . ఈ కార్యక్రమంలో సీపీఐనియోజవర్గ కార్యదర్శి జి .శశికుమార్ , సీపీఐ పట్టణ కన్వీనర్ వై.సునీల్ , ఏ.ఐ.ఎస్.ఎఫ్ నాయకులు యశ్వంత్, మెడికల్ శానిటేషన్ వర్కర్స్, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలి

### సిడిపిఓ మెహబూ



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,
బేటి బచావో బేటి పడావో వార్షిక ప్రణాళికలో భాగంగా ఈ నెలలో సైబర్ సేఫ్టీ అంశం మీద గూడూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని జి ఎస్ ఆర్ ఎం హై స్కూల్ నందు కిశోర బాలబాలికలకు అవగాహన కల్పించడమైనది. ఈ కార్యక్రమంలో సిడిపిఓ ఎస్.కె మహబూబి మాట్లాడుతూ సైబర్ నేరాలు పట్ల పిల్లలు పెద్దలు అప్రమత్తంగా ఉండాలని బాల్యవివాహాలు జరగకుండా చూడాలని,బాలకార్మికులు ఉండరాదని చెప్పారు. తర్వాత వన్ టౌన్ ఎస్ఐ శిరీష గారు సైబర్ సేఫ్టీ మీద విద్యార్థులకు అవగాహన కల్పించారు. సోషల్ మీడియా ద్వారా అనగా ఫేస్ బుక్, ట్విట్టర్, ఇన్స్టాగ్రామ్ మొదలైన యాప్ ల ద్వారా వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దని, పరిచయం లేని వ్యక్తులతో చాటింగ్ చేయవద్దని, బ్యాంకుల నుండి ఎలాంటి ఓటీపీలు రావని, అలాగే డిజిటల్ లాక్ లు పేరిట సైబర్ నేరగాళ్లు భయపెట్టడం జరుగుతుందని, ఇలాంటివి నమ్మవద్దని వీటి నుండి మిమ్మల్ని మీరే రక్షించుకోవాలని లేకపోతే 1930 నెంబర్ కు సమాచారం ఇవ్వాలని చెప్పారు. అలాగే శక్తి యాప్ ఉపయోగం గురించి వివరించారు. సూపర్వైజర్ సుజన గుడ్ టచ్ పౌష్టికాహారం వ్యక్తిగత పరిశుభ్రత మీద అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ మధుసూదన్ ఏఎన్ఎం, అంగన్వాడి కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నాయుడుపేటలో పాత ట్రెజరీ రోడ్డు పనులు వేగవంతం చేయాలని అధికారులకు అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు ఆదేశం



ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట.
నాయుడుపేట పట్టణంలోని పాత ట్రెజరీ ఆఫీస్ రోడ్డులో జరుగుతున్న మరమ్మత్తు పనులను అర్బన్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. పట్టణంలో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండటంతో రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్ శిరసనంబేడు కళ్యాణ్ రెడ్డి తో పాటు ఏఈకి సూచనలు చేశారు. రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతతో పాటు వేగంగా పూర్తయ్యేలా




చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పనులు పూర్తయ్యే వరకు ప్రజలు సహకరించాలని కోరారు. అదేవిధంగా, రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నందున ఆ మార్గంలో భారీ వాహనాల ప్రవేశాన్ని తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని మీడియా మిత్రులు, సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రజలకు విస్తృతంగా తెలియజేసి ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని అర్బన్ వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. రోడ్డు పనులు పూర్తయ్యే వరకు వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించి సహకరించాలని ఆయన కోరారు.

## ఏపీ ఎం ఎఫ్ నూతన జిల్లా పదాధికారులకు ఘన సన్మానం

### -జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం -ఏపీఎంఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బాలకృష్ణ గౌడ్,






ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,
ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్‌కు నూతనంగా ఎన్నికైన జిల్లా ఉపాధ్యక్షుడు పి. బాలకృష్ణ గౌడ్, కార్య నిర్వాహక కార్యదర్శి డబ్బు కృపానిధిలకు గూడూరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో బుధవారం గూడూరు పట్టణంలోని ప్రెస్ క్లబ్ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలువురు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు శ్రేయోభిలాషులు ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ కు నూతనంగా ఎన్నికైన జిల్లా ఉపాధ్యక్షులు, కార్యనిర్వాహక కార్యదర్శులను ఘనంగా శాలువాలతో సత్కరించి, పుష్ప గుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు, గూడూరు ప్రింట్ మీడియా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్కే జమాలుల్లా, డివిజన్ ఏపీఎంఎఫ్ అధ్యక్షులు ఆత్మకూరు సురేష్ లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చే గుర్తింపు పొందిన యూనియన్ గా ఉన్న ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ వ్యవస్థాపకులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఢిల్లీ బాబు రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కమిటీలో తమకు పదవులు దక్కడం గర్వకారణం అన్నారు. గూడూరు నుండి సీనియర్ పాత్రికేయ మిత్రులకు జిల్లా కమిటీలో పదవులు దక్కడం అందరికీ సంతోషదాయకమన్నారు. అదేవిధంగా పాత్రికేయుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, మీడియా రంగ అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాత దర్శిని జిల్లా స్టాఫ్ రిపోర్టర్ పి. బాలకృష్ణ గౌడ్, కార్యనిర్వహక కార్యదర్శి, ప్రభా న్యూస్ గూడూరు నియోజకవర్గ ఇన్చార్జి డబ్బు కృపానిధి లు మాట్లాడుతూ జిల్లాలో అనేకమంది జర్నలిస్టులు ఉన్నా గూడూరు నుండి జిల్లా కమిటీలో తమకు బాధ్యతలు అప్పగించేందుకు సహకరించిన గూడూరు డివిజన్ ఏపీఎంఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలు ఆత్మకూరు సురేష్, సి హెచ్ అనిల్ లతో పాటు సహకరించిన మీడియా మిత్రులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పాత్రికేయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గూడూరు డివిజన్ ఏపీ ఎంఎఫ్ ప్రధాన కార్యదర్శి సిహెచ్ అనీల్ ,గూడూరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు భవాని శంకర్ ,సునీల్ కుమార్ ఎం కోటేశ్వరరావు, సిహెచ్ నిరంజన్, నరసింహారావు, విజయ్, చెన్నూరు మస్తాన్ రావు, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు

## శ్రీకాళహస్తి వన్‌టౌన్ పోలీసులు చాకచక్యంగా ఛేదించిన ఇంటి చోరీ కేసు

### - 32 పాత కేసులు ఉన్న ఇద్దరు పాత నేరస్థుల అరెస్ట్.

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి.
తిరుపతి జులై 23: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీకి పాల్పడిన ఇద్దరు పాత నేరస్థులను శ్రీకాళహస్తి వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., ఆదేశాల మేరకు ఆస్తి నేరాల నియంత్రణకు జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి వేగవంతమైన దర్యాప్తు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఈ కేసును అత్యంత సమర్థవంతంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేయడం జరిగింది.

- నిందితుల వివరాలు

1. అక్కుర్తి నవీన్ ఏ లవ్ లీ (26), వెంగమాంబాపురం గ్రామం, బాలాయపల్లె మండలం, తిరుపతి జిల్లా. (ఇతనిపై 24 పాత కేసులు నమోదయ్యాయి.)
2. దేరంగుల జగదీష్ (25), అయ్యప్ప కాలనీ, శివజ్యోతి నగర్, తిరుపతి. (ఇతనిపై 08 పాత కేసులు నమోదయ్యాయి.)

ఈ నెల 07-07-2026 రాత్రి శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో తాళం వేసి ఉన్న ఇంటి గ్రిల్స్, ప్రధాన ద్వారం పగులగొట్టి లోపలికి ప్రవేశించిన దుండగులు బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలను అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు శ్రీకాళహస్తి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.



ఫిర్యాదు అందిన వెంటనే జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., కేసును అత్యంత ప్రాధాన్యతగా తీసుకొని, శ్రీకాళహస్తి డీఎస్పీ కె. నరసింహమూర్తి పర్యవేక్షణలో, శ్రీకాళహస్తి వన్‌టౌన్ సీఐ సి. వెంకటేష్ ఆధ్వర్యంలో డబ్ల్యూ ఎస్ ఐ ఎం. స్వాతి, ఎస్ఐ ఎం. రామకృష్ణ మరియు సిబ్బందితో కలిసి రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారం, పాత నేరస్థుల కదలికలను విశ్లేషించిన పోలీసులు తిరుపతి, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో పలు దొంగతనాల కేసుల్లో ప్రధాన నిందితులుగా ఉన్న అక్కుర్తి నవీన్ ఏ లవ్ లీ, దేరంగుల జగదీష్‌లపై దృష్టి సారించారు. వ్యసనాలు, విలాసవంతమైన జీవనం కోసం చోరీలకు పాల్పడుతున్నట్లు సమాచారం సేకరించిన పోలీసులు వారిపై నిరంతరం నిఘా ఉంచి, 22-07-2026న అరెస్ట్ చేశారు. విచారణలో వారు శ్రీరామ్ నగర్ కాలనీలో జరిగిన చోరీకి పాల్పడినట్లు అంగీకరించారు.
నిందితుల వద్ద నుంచి పోలీసులు, 08 గ్రాముల బంగారు గొలుసు, 04 గ్రాముల బరువున్న ఒక జత బంగారు కమ్మలు,
నేరానికి ఉపయోగించిన ఒక ఆటో, రెండు ఇనుప రాడ్లు, లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాల ప్రస్తుత మార్కెట్ విలువ సుమారు రూ. 1,20,000.
శ్రీకాళహస్తి డీఎస్పీ కె. నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఈ కేసును అత్యంత వేగంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేసిన శ్రీకాళహస్తి వన్‌టౌన్ సీఐ సి. వెంకటేష్, ఎస్ఐ ఎం. రామకృష్ణ, డబ్ల్యూఎస్ఐ ఎం. స్వాతి, ఏఎస్ఐలు ఆనందయ్య, గంగయ్య, పీసీలు శంకరయ్య, భానుతేజ (శ్రీకాళహస్తి రూరల్)లతో పాటు కేసు దర్యాప్తులో పాల్గొన్న శ్రీకాళహస్తి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బందిని జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., అభినందించి, వారి సేవలను ప్రశంసించారు.

- ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి.

ఈ సందర్భంగా పోలీసులు పట్టణ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో ఇంట్లో నగదు, బంగారం వంటి విలువైన వస్తువులను ఉంచవద్దని సూచించారు. ఒకవేళ తప్పనిసరిగా ఇంటిని ఖాళీగా వదిలి వెళ్లాల్సి వస్తే, సమీప పోలీస్ స్టేషన్‌కు ముందస్తుగా సమాచారం అందిస్తే ఆయా ప్రాంతాల్లో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఆస్తుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకుంటారని తెలిపారు. అలాగే అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్లు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

## పట్టణంలో ఉన్న డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయండి నగిరి ప్రజల విన్నపం

ప్రజా భూమి ప్రతినిధి నగిరి.
నగరి మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో ఉన్న ఇందిరానగర్ లో ఉన్న డ్రైనేజీ కాలువను శుభ్రం చేయండి .. ప్రజలను అనారోగ్య పాల నుంచి కాపాడండి. సిపిఐ పార్టీ నగరి నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య సిపిఐ పార్టీ పట్టణ కార్యదర్శి వేలన్ అధికారులకు విజ్ఞప్తి. ఈరోజు నగిరి పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నది ఏ వార్డులో చూసినా డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది ఈరోజు 11వ వార్డులో ఉన్నటువంటి ఇందిరానగర్లో ఉన్న కాలువను సిపిఐ పార్టీ బృందం పరిశీలించడం జరిగింది . ఈ కాలువను చూసి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని సుమారు 500 మీటర్లపొడవు ఉన్న కాలువాలు ఉన్నాయి. పూర్తిగా మట్టితో నిండి పోయి ఉన్నది కాలువలో నీళ్ల పోవడం లేదు.కావున అధికార యంత్రాంగం వెంటనే గ్యాంగ్ వర్క్ పెట్టి శుభ్రపరిచి చుట్టుపక్కలను కాపురాలు ఉన్న ప్రజలను అనారోగ్య పాలు కాకుండా కాపాడాలని సిపిఐ పార్టీ డిమాండ్ చేస్తుంది. ఈ కాలువలో చెత్త పూర్తిగా పేరకు పోయి నీళ్లు నిలువ ఉండడం వలన పక్కనున్న ఇంటిలోకి మురుగునీరు రావడం బాధాకరమైన విషయం. ఇప్పటికే దుర్గంతో అక్కడ ఉన్నటువంటి చుట్టుపక్కల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు కావున మున్సిపల్ అధికారులు కమిషనర్ గారు స్పందించి కాలువని శుభ్రం చేయాలని సిపిఐ పార్టీ డిమాండ్ చేస్తుంది ప్రజల యొక్క ఆరోగ్య పరిస్థితిని వాళ్ళ యొక్క ఇబ్బందులు గుర్తించి ఈ కాలువలను శుభ్రం చేయాలని సిపిఐ పార్టీ కోరుచున్నది. ఈ వార్డు లో కౌన్సిలర్ లో ఉన్న వ్యక్తులు ప్రజల సమస్యలను గుర్తించకపోవడం బాధాకరం ప్రజలను ఓటర్లుగా




చూడడం తప్పనిస్తే వారి యొక్క సమస్యలు పరిష్కరించడానికి కానీ వారి ఇబ్బందులను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకొని సమస్య పరిష్కరించే విధంగా అధికార ప్రతిపక్ష నాయకులు స్పందించకపోవడం బాధాకరమైన విషయం. ఎప్పటికైనా ప్రజల యొక్క ఆరోగ్య పరిస్థితిని గుర్తించి కాలువలను శుభ్రం చేయకపోతే ఐదు రోజుల తర్వాత సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో వార్డు ప్రజలను సమీకరించి మున్సిపల్ కార్యాలయం దగ్గర పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య సిపిఐ పార్టీ పట్టణ కార్యదర్శి వేలన్ నాయకులు భాషా శిరవుద్దీన్ వార్డు నాయకులు ఫజిల్ మొహమ్మద్ ఆయేషా పాతిమ బర్కత్నిషా సెట్ వార్డు ప్రజలు భారీగా పాల్గొన్నారు.

## నేడు విద్యాసంస్థల బంద్




ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,
నేడు దేశవ్యాప్తంగా జరిగే విద్యాసంస్థల బంద్ ను జయప్రదం చేయాలని ఏ. ఐ. ఎస్. ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి యశ్వంత్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ విషయంలో డిల్లీ జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా విద్యార్థులు , యువత ధర్నా చేస్తుంటే పోలీసులు దాడులు చేయడం బాధాకరమన్నారు. నీట్ పేపర్ లీకేజీ కారకులను కఠినంగా శిక్షించాలని , అదేవిధంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత సుమారు 80 సార్లు పేపర్ లీకేజీ జరిగి, విద్యార్థులు జీవితాలు నాశనం అయి నాయి అన్నారు. ఈ నీట్ పేపర్ లీకేజీ వలన 20 మంది విద్యార్థులు చనిపోవడం జరిగిందన్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. వాళ్లకి కోటి రూపాయలు ఎక్స్గ్రేషియా ఇస్తూ , కుటుంబం లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా ఉండాలన్నారు.నియోజకవర్గంలోని ప్రైవేట్ , ప్రభుత్వ పాఠశాలలు , కాలేజీ లు స్వచ్ఛందంగా మూసి వేసి ధర్నా కు సహకరించాలన్నారు.దీనికి సీపీఐ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. అనంతరం సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి శశి కుమార్ , సీపీఐ పట్టణ కన్వీనర్ యాదాల సునీల్ మాట్లాడుతూ నేడు జరిగే బంద్ ను ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని ,అన్ని ప్రజా సంఘాలు , అన్ని రాజా కీయ పార్టీ లు అన్ని పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి. శశి కుమార్, సీపీఐ పట్టణ కన్వీనర్ యాదాల సునీల్ , సీపీఐ చిల్లకూరు మండల కార్యదర్శి రమేష్ , బి. కె. ఎం. యు నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసమూర్తి.ఏ. ఐ.ఎస్ .ఎఫ్ నియోజకవర్గ నాయకులు రిజ్వాన్, మోహన్ , బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

## పంట పొలాలను మద్యం అడ్డాగా మార్చిన మందుబాబులు

### -లేడీస్ హాస్టల్ సమీపంలో బహిరంగంగా మద్యం సేవిస్తున్న మందుబాబులు
### -పంట పొలాల్లో మద్యం సీసాలు, వాటర్ బాటిళ్లు, ప్లాస్టిక్ గ్లాసుల గుట్టలుబి




ప్రజా భూమి ప్రతినిధి వరదయ్యపాలెం.
తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలం బత్తలవల్లం పంచాయతీ పరిధిలో బత్తలవల్లం చెక్‌పోస్ట్ నుంచి కారిపాకం వెళ్లే రహదారి వెంట పంట పొలాలు, కల్వట్ల వద్ద కొందరు బహిరంగంగా మద్యం సేవిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లేడీస్ హాస్టల్‌కు సమీపంలోనే ఈ పరిస్థితి కొనసాగుతుండటంతో ప్రయాణికులు, మహిళలు అసౌకర్యానికి గురవుతున్నారని చెబుతున్నారు. రైతు సన్నారెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ:- ఈ రోజు వ్యవసాయ పనుల నిమిత్తం తన పొలానికి వెళ్లగా పొలాల్లో ఎక్కడ చుసిన మద్యం సీసాలు, వాటర్ బాటిళ్లు, గ్లాసులు కనిపించాయని తెలిపారు. వీటి వల్ల వ్యవసాయ పనుల్లో గాజు ముక్కలు గుచ్చుకోవడం, ట్రాక్టర్ టైర్లు పంక్చర్ కావడం వంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. పక్కన లేడీస్ హాస్టల్స్ ఉన్న కూడా హాస్టల్స్ కి 200 మీటర్ల దూరంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్నారు, పోలీస్ అధికారులు పలు మార్లు హెచ్చరించి ఈ మద్యం తాగే బాబులపై కేసులు పెట్టిన మళ్ళీ మందుబాబులు అదే తరహాలో వ్యవహరిస్తున్నారు,అటువంటి వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు.

## శ్రీ పద్మావతి బాలికల ఉన్నత పాఠశాలలో 'నంది విద్య నటేశ్వరి' సాంస్కృతిక కార్యక్రమం

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.
తిరుపతిలోని టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహితమవుతున్న శ్రీ పద్మావతి బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం కాంచి కామకోటి పీఠాధిపతుల ఆశీస్సులతో 'నంది విద్య నటేశ్వరి' పేరుతో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ నృత్యకారిణి హేమమాలిని తన శిష్యబృందంతో కలిసి భారతీయ సాంప్రదాయ నృత్యాలను ప్రదర్శించి విద్యార్థినులను అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొని అతిథులను సన్మానించి, ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



ప్రజాభూమి
తిరుపతి,చిత్తూరు 9
శుక్రవారం 24 జూలై 2026

# గ్రామాల్లో తహసీల్దార్ రాజేంద్ర విస్తృత పర్యటన: క్షేత్రస్థాయిలో సచివాలయాల తనిఖీ!

- 'వన్‌మంత్-వన్‌విలేజ్-ఫోర్‌విజిట్స్' లో భాగంగా ముచ్చలగుంటలో కార్యక్రమాలు.. తల్లంపాడులో ఎలక్షన్ విధుల పరిశీలన!
- పాలన పారదర్శకంగా ఉండాలి.. సచివాలయ సిబ్బందికి తహసీల్దార్ ఆదేశం.



ప్రజా భూమి ప్రతినిధి దొరవారి సత్రం. మండలంలో పాలనను మరింత వేగవంతం చేస్తూ, ప్రజలకు సేవలను వేగంగా అందించడమే లక్ష్యంగా దొరవారిసత్రం మండల తహసీల్దార్ రాజేంద్ర పలు గ్రామాల్లో క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టారు. మండల పరిధిలోని ముచ్చలగుంట, పోలిరెడ్డిపాలెం, తల్లంపాడు గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించి పలు శాఖల పనితీరును, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు.

**ముచ్చలగుంటలో 'వన్‌మంత్-వన్‌విలేజ్-ఫోర్‌విజిట్స్':**

ప్రభుత్వ ఆదేశాల మేరకు ముచ్చలగుంట గ్రామంలో 'వన్ మంత్ - వన్ విలేజ్ - ఫోర్ విజిట్స్' (నెలకో గ్రామం - నాలుగు పర్యటనలు) కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ రాజేంద్ర పర్యటించారు. గ్రామంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు రెవెన్యూ, సచివాలయ సేవల అమలు తీరుపై సమీక్షించారు.

**పోలిరెడ్డిపాలెం, తల్లంపాడు సచివాలయాల తనిఖీ:**

అనంతరం పోలిరెడ్డిపాలెం మరియు తల్లంపాడు గ్రామ సచివాలయాలను తహసీల్దార్ రాజేంద్ర ఆకస్మికంగా తనిఖీ చేశారు. తల్లంపాడు సచివాలయంలో చేపడుతున్న ఎలక్షన్ విధులు, ఓటర్ల నమోదు/సవరణ రికార్డులను ఆయన నేరుగా పరిశీలించి సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. సచివాలయ సిబ్బంది హాజరు, అటెండెన్స్ రిజిస్టర్లు, ప్రజా వినతుల పరిష్కార రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

**ప్రజలకు అందుబాటులో ఉండాలి:**

ఈ సందర్భంగా తహసీల్దార్ రాజేంద్ర మాట్లాడుతూ.. సచివాలయ సిబ్బంది క్రమం తప్పకుండా విధులకు హాజరవుతూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రజా వినతులకు ప్రాధాన్యతనిచ్చి, నిర్దేశిత సమయంలో సమస్యలను పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఎలక్షన్ సంబంధించిన పనులను అత్యంత పారదర్శకంగా, గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో స్థానిక రెవెన్యూ అధికారులు, విఆర్ఓలు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజాక్షేత్రంలో 'ప్రజా సమస్యల' కలం యోధుడు!

## సూళ్లూరుపేట రాజకీయాల్లో నూతన అధ్యాయనం.. ఐడీజేఎస్ జిల్లా అధ్యక్షుడు దయ్యాల కిరణ్ కుమార్ వైపు ప్రజా చూపు!

ప్రజా భూమి ప్రతినిధి సూళ్లూరుపేట. కలాన్ని ఆయుధంగా మలచి నిత్యపోరాటం.. అణగారిన వర్గాలకు, పేద విద్యార్థులకు నిరంతర ఆపద్బాంధవుడు ఏ సమాజానికైనా మార్పు అనేది ఒక రాత్రికి రాత్రే రాదు. కానీ, ఆ మార్పు కోసం ఉద్యమించే నాయకుడు ప్రజాక్షేత్రం నుంచే రూపుదిద్దుకుంటాడు. ప్రచార ఆర్భాటాలు, ఆడంబరాలకు దూరంగా... ప్రజా సమస్యలే ప్రాతిపదికగా, ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా అహరహం శ్రమిస్తున్న అరుదైన వ్యక్తిత్వం దయ్యాల కిరణ్ కుమార్. తిరుపతి జిల్లా ఐడీజేఎస్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న కిరణ్ కుమార్, కేవలం పాత్రికేయుడిగానే కాక ఒక సామాజిక పోరాట యోధుడిగా సూళ్లూరుపేట నియోజకవర్గ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. నేడు సూళ్లూరుపేట నియోజకవర్గం ఒక రాజకీయ పరివర్తన వైపు అడుగులు వేస్తోంది. ఊహలకే పరిమితమయ్యే హామీల కంటే, క్షేత్రస్థాయిలో సమస్యలపై నిజాయితీగా పోరాడే ఒక సమర్థుడైన, కొత్త తరం నాయకుడి కోసం నియోజకవర్గ ప్రజలు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆ ఆశలకు, ఆకాంక్షలకు నిలువెత్తు ప్రతిరూపంగా దయ్యాల కిరణ్ కుమార్ పేరు నియోజకవర్గ మూలమూలలా మారుమోగుతోంది. అవినీతిపై 'కలం'పోటు.. నిరంతర అక్షర సమరం పాత్రికేయ రంగాన్ని వృత్తిగా కాక ఒక బాధ్యతగా స్వీకరించిన దయ్యాల కిరణ్ కుమార్, అక్రమాలు-అవినీతిపై నిరంతరం నిలువెత్తు సమరాన్ని సాగించారు. అవినీతి వెలికితీత: అధికార యంత్రాంగంలో ఉన్న లోపాలను, ప్రజాధనాన్ని కొల్లగొడుతున్న అక్రమార్కుల గుట్టును తన కలానికున్న పదునుతో వెలుగులోకి తెచ్చారు. భయం లేని పాత్రికేయం: ఎంతటి బలవంతులైనా, అక్రమాలకు పాల్పడితే వారిని సమాజం ముందు నిలబెట్టడంలో ఎన్నడూ వెనకడుగు వేయలేదు. జర్నలిస్టుల సంక్షేమం: ఐడీజేఎస్ జిల్లా అధ్యక్షుడిగా జర్నలిస్టుల హక్కుల కోసం, వారి సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తూనే, సమాజ హితమే పరమావధిగా పనిచేశారు.

ప్రజా సమస్యలపై 'రక్షక కవచం' సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఎక్కడ సమస్య ఉంటే అక్కడ దయ్యాల కిరణ్ కుమార్ ఉండటం పరిపాటిగా మారింది. ప్రజా సమస్యలను కేవలం వార్తలకే పరిమితం చేయకుండా, సమస్యలు పరిష్కారమయ్యే వరకు అధికారులను నిలదీస్తూ నిత్యం ఉద్యమ బాట పట్టారు. తాగునీటి సమస్యలపై పోరు: ఏళ్ల తరబడి తాగునీటి ఎద్దడితో నరకయాతన అనుభవిస్తున్న మారుమూల గ్రామాలు, గిరిజన తండాల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి తాగునీటి వసతులు కల్పించే వరకు పోరాడారు. అస్తవ్యస్తమైన రోడ్లకు మోక్షం: రాకపోకలకు తీవ్ర విఘాతం కలిగిస్తూ ప్రాణసంకటంగా మారిన రహదారుల పునర్నిర్మాణం కోసం స్వయంగా ఆందోళనలు చేపట్టి, ఉన్నతాధికారులను ఒప్పించి రోడ్ల మరమ్మతులు జరిగేలా చేశారు.



క్షేత్రస్థాయికి ప్రభుత్వ పథకాలు: అర్హులైన ప్రతి పేదవారికీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందాలనే ఉద్దేశంతో, క్షేత్రస్థాయిలో లోపాలను ఎత్తిచూపుతూ అనేకమంది పేదలకు ఆసరాగా నిలిచారు. విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా.. విస్తృత సామాజిక సేవలు సామాజిక బాధ్యతలో తనవంతు పాత్రగా దయ్యాల కిరణ్ కుమార్ చేపట్టిన సేవా కార్యక్రమాలు నియోజకవర్గంలో ఎంతోమంది జీవితాల్లో వెలుగులు నింపాయి. పేద విద్యార్థులకు చేయూత: ఆర్థిక ఇబ్బందుల వల్ల పదో తరగతి విద్యార్థులు, ఉన్నత చదువులు చదివే ప్రతిభావంతులైన పేద పిల్లలు చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో తన స్వంత నిధుల నుంచి వారికి అవసరమైన పుస్తకాలు, పరీక్ష రుసుములు, స్టడీ మెటీరియల్ అందించి ప్రోత్సహించారు. ఆపదలో అభయహస్తం: నియోజకవర్గంలో ఏ పేద కుటుంబానికి ఆపద వచ్చినా, వైద్య సహాయం కావాలన్నా ఓ అన్నలా, తమ్ముడిలా ముందుండి వారికి ధైర్యాన్ని అందించారు. "సామాజిక మార్పు కోసం కలం పట్టిన రోజు నుంచి నేటి వరకు ప్రజా సమస్యలే ఆయన ఊపిరిగా పనిచేస్తున్నాడు . ప్రజల మద్దతు, అభిమానమే ఆయనకి శ్రీరామరక్ష గా" ఉంటున్నాడు దయ్యాల కిరణ్ కుమార్ (ఐడీజేఎస్ జిల్లా అధ్యక్షుడు) రాజకీయాల్లోకి రావాలని 'సూళ్లూరుపేట' ప్రజల ఆకాంక్ష! రాజకీయాలు వ్యాపారమయమై, హామీలు నీటి మూటలవుతున్న నేటి రోజుల్లో... దయ్యాల కిరణ్ కుమార్ లాంటి స్వార్థం లేని, ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న నాయకుడు రాజకీయాల్లోకి రావాలని సూళ్లూరుపేట నియోజకవర్గ ప్రజలు, మేధావులు, యువత బలంగా కోరుకుంటున్నారు. జర్నలిస్టుగా సమాజంలోని ప్రతి కోణాన్ని, ప్రతి సమస్యను స్పృశించిన అనుభవం ఆయనకు ఉందని, అటువంటి వ్యక్తి ప్రజా ప్రతినిధిగా వస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించగలరని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పదవుల కోసం కాకుండా, ప్రజా సేవ కోసం పరితపించే దయ్యాల కిరణ్ కుమార్ సేవలను సూళ్లూరుపేట నియోజకవర్గ ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరు. రాబోయే రోజుల్లో ఆయన రాజకీయ ప్రయాణం నియోజకవర్గంలో కొత్త వెలుగులు నింపుతుందని స్థానికులు బలంగా విశ్వసిస్తున్నారు.

# అక్రమార్కుల చెరలో పిల్లారికోన చెరువు

- చెరువుతో పాటు అటవీ భూములనూ వదలని కబ్జాకోరులు
- పట్టపగలే దర్జాగా గుట్టలను కొల్లగొట్టి చదును చేస్తున్న వైనం
- రాయలచెరువు నిండడానికి ప్రధానపాత్ర పోషిస్తున్న పిల్లారికోన చెరువు మాయం
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ, ఫారెస్ట్, నీటిపారుదల శాఖ అధికారులు

ప్రజా భూమి ప్రతినిధి రామచంద్రపురం రామచంద్రాపురం మండలంలో ప్రకృతి ప్రసాదించిన జలవనరులు, జీవ వైవిధ్యానికి నిలయమైన అటవీ భూములు కబ్జాకోరుల చెరలో చేరుతున్నాయి. మండలంలోని పిల్లారికోన చెరువుతో పాటు, దానికి ఆనుకుని అటవీ భూములు సైతం పూర్తిగా అన్యాక్రాంతమైపోతు న్నాయి. నెత్తకుప్పం లెక్కల దాకలలో సర్వేనెంబర్ 306,309 లో సుమారు 20 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ జీవనాధారమైన చెరువుపై, పరిసర ప్రాంతాలపై అక్రమార్కులు పిల్లాడుకోన మురళి కన్నేశారు. చుట్టూ దట్టమైన అడవుల మధ్య చెరువు ఉంది. ఇక్కడినుండే రాయల చెరువుకు అధిక శాతంలో వర్షం నీరు చేరుతుంది. అయితే ప్రస్తుతం మురళి అధికార నాయకుడినంటూ దర్పం ప్రదర్శిస్తూ, పట్టపగలే దర్జాగా హిటాచి, జేసీబీలతో ప్రకృతి వనరులను, ప్రభుత్వభూములను చదును చేస్తున్న వైనం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. గతప్రభుత్వం అలా.. పుల్లమ్మ నాయుడు కండ్రిగ పంచాయతీ, పిల్లారికోన చెరువును గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వం హయాంలో పూడికలు తీసి, కట్ట మరమ్మత్తులు, వంటి ఉపయోగకర పనులతో అమృత సరోవర్ కార్యక్రమంతో చెరువును సమృద్ధిగా నీరు నిలువుండేట్లు వృద్ధి చేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పుడు నుంచి వర్షాలు కురువకపోవడంతో చెరువులో నీటి శాతం పూర్తిగా అడుగంటిపోవడంతో కొందరు టిడిపి సానుభూతిపరుల కన్ను చెరువు పై పడింది. ఇదే అదునుగా భావించి, అధికారులకు మామూలు ఇచ్చి, నాయకుల అండదండతో చెరువు చుట్టుపక్కలన్న ఫారెస్ట్ గుట్టలను భారీ యంత్రాలతో చదును చేసి పిల్లారికోన చెరువు నిండి రాయలచెరువు వెళ్లే మోరవ సైతం ఆక్రమించుకోవడం స్థానికులు తీవ్రంగా కలచి వేస్తోంది.

**ఫారెస్ట్ భూమి సైతం ఆక్రమణ**

ఒకవైపు చెరువు మోరవను పూడ్చివేస్తూ చెరువుకు ఆనుకుని ఉన్న ఫారెస్ట్ భూమిని సైతం వదలడం లేదు. ప్రభుత్వ నిబంధనలను చట్టాలను తుంగలో తొక్కుతూ అటవీ భూములను కబ్జా చేసి చదును చేస్తున్నారు. చుట్టుపక్కల ఉన్న గుట్టలను పట్టపగలే కొల్లగొడుతు పచ్చని చెట్లతో కళకళలాడాల్సిన అటవీ ప్రాంతం, జలకళతో ఉండాల్సిన చెరువులు వాటిరూపు కోల్పోతున్నాయి.

**ప్రశ్నిస్తే దౌర్జన్యాలే...**

చెరువును, అటవీ భూములను కాపాడుకోవడానికి ముందుకు వస్తున్న స్థానికులు, రైతులపై అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. మేము అధికార పార్టీ నాయకుల మంటూ స్థానికులను బెదిరింపులకు గురిచేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. చెరువు, ఫారెస్ట్ భూముల కబ్జాపై ఎవరైనా నోరుమెదిపితే దౌర్జన్యాలకు పాల్పడుతూ, బెదిరింపులకు దిగుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు.





**నిద్రమత్తులో యంత్రాంగం?**

ప్రభుత్వం భూసార పరిరక్షణకు, హరితహారం, అటవీ సంపద పరిరక్షణకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుంటే... క్షేత్రస్థాయిలో మాత్రం కొందరు అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. మండల పరిధిలోని ఈభారీ అక్రమ కబ్జా వ్యవహారంపై రెవెన్యూ, ఫారెస్ట్, అధికారులు మామూళ్ల మత్తులో జోగుడుతున్నారని స్థానికులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కబ్జాకు గురవుతున్న చెరువును అటవీభూమిని పరిరక్షించాలని కోరుతున్నారు.

# జీతాలు పెంపు కొరకు కలెక్టరేట్ కి తరలి రండి -ఎలక్ట్రికల్ బస్సు యూనియన్

ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి మినిమం టైం స్కేల్ రెగ్యులరైజేషన్ లేబర్ కోర్సు రద్దుకై కోరుతూ ఈనెల 30వ తేదీ న తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద జరగబోయే ధర్నా ను విజయవంతం చేయాలని కోరుతూ అలిపిరి డిపో వద్ద ఎలక్ట్రికల్ బస్సు యూనియన్ ఆధ్వర్యంలో గోడపత్రికను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎస్ జయ చంద్ర రాష్ట్ర కమిటీ సభ్యులు జి. బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖలలో పని చేస్తున్న కాంటాక్ట్ ఔట్సోర్సింగ్ సంస్థల్లో ఉద్యోగులకు రెగ్యులరైజేషన్ చేయాలని ప్రభుత్వం హామీని అమలు చేయాలని డిమాండ్ చేయడం జరుగుతుంది. కనీస వేతనం అమలు కాకపోవడంతో కార్మికులు కుటుంబాలు తీవ్రమైన ఇబ్బందులు గురవుతున్నాయి. సుప్రీంకోర్టు ఇచ్చినటువంటి తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని తెలియజేసిన ప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అమలు చేయకపోవడం దుర్మార్గమైన విషయం అన్నారు. అనేక సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న 29 చట్టాలను నాలుగు లేబర్ కోర్టుగా మార్చి వేతనాలపై సామాజిక భద్రతపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దాడి చేస్తున్నాయన్నారు. సంఘం పెట్టుకునే హక్కు పని చేసే హక్కు సమ్మె చేసే హక్కు పీఎఫ్ ఈఎస్ఐ వంటి సంక్షేమ పథకాలకు ఎగనామం పెట్టే పరిస్థితికి నెట్టబడిందన్నారు. సంక్షేమ బోర్డులకు రద్దు చేయడం వంటి విధానాలు పూర్తిస్థాయిలో అమలవుతున్నాయి. దీనికి వ్యతిరేకంగా మనం పోరాడాలని పిలుపునిచ్చారు. ఔట్సోర్సింగ్ లో పనిచేస్తున్న 50 సంవత్సరాలు దాటిన సిబ్బందిని తొలగించాలంటూ వైద్యశాఖ ఆరోగ్య అధికారులు ఇప్పటికే నోటీసులు ఇచ్చి కొన్ని చోట్ల తొలగించడం దుర్మార్గమన్నారు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు రాజస్థాన్ ఒరిస్సా పంజాబ్ హర్యానా తెలంగాణ లాంటి రాష్ట్రాలలో కాంటాక్ట్ వర్కర్స్ చేయడం మంచి పరిణామం అన్నారు. మరి ఆంధ్ర రాష్ట్రంలో పర్మనెంట్ చేయకపోవడం అనేది దుర్మార్గమైన విషయం కాబట్టి తక్షణమే శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తుంది దీనికోసం జరిగే పోరాటంలో కార్మికులంతా కలిసి రావాలని ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ గోడ పత్రిక ఆవిష్కరణలో ఎలక్ట్రికల్ బస్ యూనియన్ అధ్యక్షులు మునయ్య ప్రధాన కార్యదర్శి మునీంద్ర అయ్యప్ప మనోహర్ మురళి వెంకటరమణ ఏఎస్ నాయక్ ఎర్రయ్య విజయ్ రవితేజ శ్రీహరి గజేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా శ్రీ వారాహి వజ్రేశ్వర కళ్యాణం

## శ్రీ వజ్ర వారాహి దేవి హోమం



ప్రజా భూమి ప్రతినిధి, రామచంద్రపురం ప్రపంచంలోని అత్యంత మహిమాన్వితమైన ఏకైక శ్రీ పాతాళ శ్వేత వారాహీ మహాక్షేత్రమైన తిరుపతి జిల్లా రామచంద్రపురం మండలం రాయల చెరువు దగ్గర ఉన్న శ్రీ శక్తిపీఠంలో నిర్వహించబడుతున్న శ్రీ వారాహీ నవరాత్రి మహోత్సవములలో 9వ రోజున అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు అత్యంత వైభవంగా నిర్వహించబడినవి. ఈ సందర్భంగా ఆరోగ్యం, పరాక్రమం, కుండలినీ జాగృతం, భూ/గృహ సమస్యా పరిష్కారం కొరకు విశేష ఫలదాయకమైన శ్రీ వజ్ర వారాహీ దేవి ప్రత్యేక మంత్ర హోమం నిర్వహించబడినది. స్త్రీమూర్తులకు సువాసిని పూజా,మధ్యాహ్నం అమ్మవారికి మహా హారతి సమర్పించబడగా, సాయంత్రం కళా నివేదన రూపంలో సంగీత, నాట్య, సాహిత్య సేవలు అమ్మవారికి అంకితం చేయబడినవి.

శ్రీ వారాహీ వజ్రేశ్వర కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు,రాత్రి వేళ పరమపూజ్య శ్రీ మాతాజీ వారి సమక్షంలో నవరాత్రి పూజ, దర్బారు సేవ జరుగగా, నడిచే దైవం జగద్గురువుల వారిచే మహా హారతి, అనంతరం అమ్మవారికి ఏకాంత సేవ నిర్వహించబడినవి. ఈ పుణ్యదినాన సుమారు 20,000 మందికి పైగా భక్తులు క్షేత్రాన్ని సందర్శించి అమ్మవారి దివ్య దర్శన భాగ్యాన్ని పొందారు. వచ్చిన భక్తులందరికీ అన్నప్రసాద వితరణ సమృద్ధిగా జరిగినది, ఇది గురు-దైవానుగ్రహానికి, పీఠం సేవాతత్పరతకు నిదర్శనంగా నిలిచింది.

# చంద్రశేఖర్ ఆజాద్ జయంతి సందర్భంగా నివాళులర్పించిన జనసేన పార్టీ నాయకులు, పేట బ్రదర్స్ మిత్రబృందం

**స్వాతంత్ర సమరయోధుడు, గొప్ప ధైర్యవంతుడు చంద్రశేఖర్ ఆజాద్**




ప్రజాభూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్ శ్రీకాళహస్తి నియోజకవర్గం జనసేన పార్టీ కార్యాలయంలో మన భారత దేశ స్వాతంత్రం కోసం ప్రాణ త్యాగాలు చేసినటువంటి చంద్రశేఖర్ ఆజాద్ జయంతి సందర్భంగా జనసేన పార్టీ నాయకులు మాట్లాడుతూ చంద్రశేఖర్ ఆజాద్ ది గొప్ప చరిత్ర కేవలం 15 సంవత్సరాల వయసులోనే భారతదేశ స్వాతంత్రం కోసం అనేక ఉద్యమాలలో పాల్గొని ధైర్యంగా నిలబడినటువంటివి గొప్ప వ్యక్తి అంతేకాకుండా భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్ గురు ఇంకా ఎంతో మంది స్వాతంత్ర సమరయోధులతో కలిసి మన దేశం కోసం కృషి చేసినటువంటి వ్యక్తి, దేశంలో ఉన్న యువత మొత్తం కూడా చంద్రశేఖర్ ఆజాద్ గారికి ఉన్నటువంటి ధైర్యాన్ని గుండెల నిండా నింపుకొని అన్యాయం జరిగినప్పుడు ఎదిరించాలని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, గంధం శ్రీను, పసల సురేష్, మనీ, ప్రదీప్ కుమార్, ముని చంద్ర, చందు, రాజా, ముని కుమార్ వీర మహిళలు శ్రీకాళహస్తి టౌన్ బ్యాంక్ డైరెక్టర్ కవిత, ప్రసన్న, భారతి, వల్లి పాల్గొన్నారు.

# మహిళల భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించిన రేణిగుంట పోలీసులు




ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట. గురువారం ఉదయం రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ పరిధిలోని తారకరామ నగర్, ఎన్‌వీఆర్ ఫంక్షన్ హాల్ లో మహిళల భద్రతపై అవగాహన సదస్సును రేణిగుంట పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రేణిగుంట పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్. జయచంద్ర , రేణిగుంట మండల ఎంపీడీవో రవిచంద్ర,ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఎస్. జయచంద్ర మాట్లాడుతూ, మహిళల భద్రతకు ఆంధ్రప్రదేశ్ పోలీసులు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ప్రతి మహిళ ఆత్మరక్షణ నైపుణ్యాలు అలవర్చుకోవాలని సూచించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన 'శక్తి' మొబైల్ యాప్‌ను ప్రతి మహిళ తమ మొబైల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని వినియోగించాలని కోరారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైనప్పుడు వెంటనే 112 అత్యవసర సేవల నంబర్‌కు కాల్ చేసి పోలీసుల సహాయం పొందాలని సూచించారు. అలాగే ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ మోసాలు, చైన్ స్నాచింగ్, ఆన్‌లైన్ మోసాలు, మహిళలపై జరిగే నేరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. అపరిచితుల ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాలు ఎవరికీ తెలియజేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# టిడిపి నేత సుధాకర్ నాయుడు తల్లి రమణమ్మ మృతి బాధాకరం: ఎమ్మెల్యే బొజ్జల

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి.

శ్రీకాళహస్తి నియోజకవర్గం, తొట్టంబేడు మండలం, దిగువ కొణతనేరి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సుధాకర్ నాయుడు తల్లి గత ఆరు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం సాయంత్రం బాత్ రూమ్ లో జారిపడి తలకు గాయం అయ్యి రక్తస్రావంతో ఉండడంతో కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల ఉన్న గ్రామస్తులు వచ్చి చూడడంతో మృతి చెందడం జరిగిందని నిర్ధారించారు. అదే గ్రామానికి చెందిన మాజీ రాష్ట్ర కార్యదర్శి గారి చలపతి నాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు గాలి మురళి నాయుడు లు స్థానిక శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి గారికి విషయం తెలియజేయగా స్పందించిన ఎమ్మెల్యే గారు వచ్చి రమణమ్మ భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళులు అర్పించి మీ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రావిళ్ళ మునిరాజ నాయుడు, మాజీ జెడ్పిటిసి పేరం ధనంజయలు నాయుడు, సీనియర్ నాయకులు జగన్నాథం నాయుడు, పట్టణ అధ్యక్షులు విజయకుమార్ నాయుడు, ఏర్పేడు పార్టీ అధ్యక్షులు నాగరాజు నాయుడు, మాజీ జెడ్పిటిసి సుబ్బారెడ్డి, కన్నలి ప్రతాపరెడ్డి తదితరులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.



# నీట్ ప్రశ్నాపత్ర లీకేజీ నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి

**- కాంగ్రెస్ పార్టీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ ఐరాల లోకేష్ రెడ్డి.**

ప్రజాభూమి ప్రతినిధి చంద్రగిరి.

తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఈరోజు చంద్రగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఐరాల లోకేష్ రెడ్డి ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీట్ ప్రశ్నాపత్ర లీకేజీ వ్యవహారంలో బాధ్యులైన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఐరాల లోకేష్ రెడ్డి మాట్లాడుతూ, బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో నీట్ పరీక్షల నిర్వహణపై ప్రజల్లో విశ్వాసం దెబ్బతిన్నదని విమర్శించారు. ప్రశ్నాపత్రాల లీకేజీలు వరుసగా జరుగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపి, బాధ్యులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నీట్ లీకేజీ ఘటనలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అధికారులపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి, వారిని అరెస్ట్ చేయాలని, అలాగే బాధ్యులందరినీ పదవుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత న్యాయం కోసం శాంతియుతంగా ఆందోళనలు నిర్వహిస్తుంటే వారిపై లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన అన్నారు. విద్యార్థుల పక్షాన నిలబడి శాంతియుత నిరసన తెలిపిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు శ్రీ రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై బీజేపీ కార్యకర్తలు దాడి చేయడం ప్రజాస్వామ్యంపై దాడేనని, ఇది పూర్తిగా పిరికిపంద చర్య అని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల కారణంగా దేశ యువతలో నిరాశ పెరిగి, ఉపాధి మరియు విద్యా అవకాశాల కోసం విదేశాలకు వెళ్లే పరిస ఆరోపించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జన్నే మల్లికార్జున మాట్లాడుతూ, నీట్ లీకేజీ వల్ల నష్టపోయిన విద్యార్థులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని, దోషులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే గతంలో మాదిరిగానే రాష్ట్రాలకు తమ స్వంత ప్రవేశ పరీక్షలు (ఎంసెట్) నిర్వహించే అధికారాన్ని తిరిగి కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మన్సూర్, జిల్లా కార్యదర్శి కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# మాటలకే పరిమితమైన "ఆపరేషన్ స్వర్ణ".. స్వర్ణముఖి నదిని కాపాడే నాధుడే లేడా..?

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి రూరల్

తిరుపతి నగరం, పరిసర ప్రాంతాల ప్రజలకు జీవనాడిగా నిలిచిన స్వర్ణముఖి నది ప్రస్తుతం అక్రమ ఆక్రమణలు, నిర్మాణ వ్యర్థాల డంపింగ్, అనుమతి లేని లేఅవుట్లు, పూడ్చివేతలతో కనుమరుగయ్యే పరిస్థితికి చేరుకుంటోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు వర్షపు నీటిని సేకరించి భూగర్భ జలాలను పెంచిన ఈ నది, నేడు అధికారుల నిర్లక్ష్యం కారణంగా తన ఉనికినే కోల్పోయే ప్రమాదంలో ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం, అధికారులు ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన "ఆపరేషన్ స్వర్ణ" కేవలం సమావేశాలు, మీడియా ప్రకటనలు, ఫొటో సెషన్లకే పరిమితమైందా అనే ప్రశ్న ప్రజల నుంచి బలంగా వినిపిస్తోంది. నదిని రక్షిస్తామని ప్రకటించిన అధికారులు క్షేత్రస్థాయిలో మాత్రం ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. తిరుపతి నగరం, పరిసర ప్రాంతాల్లో కూల్చివేస్తున్న పాత భవనాల నుంచి వచ్చే కాంక్రీట్ ముక్కలు, మట్టి, రాళ్లు, ఇటుకలు, ఇతర నిర్మాణ వ్యర్థాలను రాత్రి వేళల్లో ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా నేరుగా స్వర్ణముఖి నదిలో పడేస్తున్న ఘటనలు తరచూ కనిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ డంపింగ్ కారణంగా నది సహజ ప్రవాహం దెబ్బతింటున్నప్పటికీ సంబంధిత అధికారులు కేసులు నమోదు చేయకుండా మౌనం పాటించడం అనేక అనుమానాలకు తావిస్తోందని ఆరోపిస్తున్నారు. స్వర్ణముఖి పరివాహక ప్రాంతాల్లో నదికి చెందిన భూములను మట్టితో పూడ్చి అక్రమంగా లేఅవుట్లు వేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం నది పరిధినే మార్చే ప్రయత్నాలు జరుగుతున్నా వాటిని అడ్డుకునే చర్యలు కనిపించడం లేదని ప్రజలు వాపోతున్నారు. నది ప్రాంతాల్లో అనుమతులు ఎవరు ఇస్తున్నారు? రెవెన్యూ రికార్డులు సక్రమంగా పరిశీలిస్తున్నారా? అనే ప్రశ్నలు కూడా లేవనెత్తుతున్నారు. స్వర్ణముఖి నదిలో ఆక్రమణలు, నిర్మాణ వ్యర్థాల డంపింగ్, అక్రమ లేఅవుట్లపై అనేకసార్లు వార్తా కథనాలు వెలువడినా, స్థానికులు పలుమార్లు ఫిర్యాదులు చేసినా రెవెన్యూ, ఇరిగేషన్, తుడా, మున్సిపల్, కాలుష్య నియంత్రణ శాఖలు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పర్యావరణ నిపుణుల అభిప్రాయం ప్రకారం స్వర్ణముఖి నది సహజ ప్రవాహం దెబ్బతింటే భూగర్భ జలాలు తీవ్రంగా తగ్గిపోయే ప్రమాదం ఉంది. వర్షపు నీరు నదిలో సక్రమంగా ప్రవహించకపోవడం వల్ల వరదల తీవ్రత పెరిగే అవకాశమూ ఉందని వారు హెచ్చరిస్తున్నారు. నేడు నదిని పూడ్చేస్తే రేపటి తరాలకు తాగునీటి కొరత, సాగునీటి సమస్యలు, పర్యావరణ సమతుల్యత దెబ్బతినే ప్రమాదం తప్పదని పేర్కొంటున్నారు. నది ఆక్రమణలు, అక్రమ ప్లాట్లు, నిర్మాణ వ్యర్థాల డంపింగ్‌పై ఇప్పటివరకు ఎన్ని కేసులు నమోదు చేశారు? ఎన్ని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు? ఎన్ని అక్రమ నిర్మాణాలను తొలగించారు? అనే వివరాలను అధికారులు ప్రజలకు వెల్లడించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే "ఆపరేషన్ స్వర్ణ" పేరిట చేపట్టిన చర్యలపై శ్వేతపత్రం విడుదల చేయాలని కూడా కోరుతున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, తుడా, మున్సిపల్, పోలీసు, కాలుష్య నియంత్రణ మండలి వంటి శాఖలు పరస్పరం బాధ్యతలు నెట్టుకుంటున్నాయే తప్ప, క్షేత్రస్థాయిలో సంయుక్త చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నది పరిరక్షణ కోసం ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నప్పటికీ స్వర్ణముఖి నది మొత్తం పరివాహక ప్రాంతంపై డ్రోన్ సర్వే నిర్వహించి ఆక్రమణలను గుర్తించే చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. డ్రోన్ సర్వే ద్వారా అక్రమ నిర్మాణాలు, డంపింగ్ ప్రాంతాలు, పూడ్చివేతలను సులభంగా గుర్తించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. స్వర్ణముఖి నది పరిరక్షణలో స్థానిక ప్రజలు, రైతులు, పర్యావరణ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, యువత, విద్యార్థులను భాగస్వామ్యం చేస్తే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని పర్యావరణ కార్యకర్తలు సూచిస్తున్నారు. గ్రామ, వార్డు స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి నది పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు. ఒకవైపు పర్యావరణ పరిరక్షణపై పెద్దఎత్తున ప్రచారం చేస్తూ, మరోవైపు స్వర్ణముఖి నదిలో జరుగుతున్న అక్రమాలపై మౌనం పాటించడం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. "ఆపరేషన్ స్వర్ణ" నిజంగా అమలవుతుందా? లేక కేవలం ప్రకటనలకే పరిమితమవుతుందా? అనే ప్రశ్నలకు ప్రభుత్వం, సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. స్వర్ణముఖి నదిపై తక్షణమే పూర్తి స్థాయి డ్రోన్ సర్వే నిర్వహించాలని, నిర్మాణ వ్యర్థాలు డంపింగ్ చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, అక్రమ లేఅవుట్లు, ఆక్రమణలను వెంటనే తొలగించాలని, నది పరివాహక ప్రాంతాలను జియో ట్యాగింగ్ చేసి శాశ్వత రక్షణ కల్పించాలని, రెవెన్యూ, ఇరిగేషన్, తుడా, మున్సిపల్, పోలీసు శాఖలతో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని, ప్రజలకు ఫిర్యాదు చేసే ప్రత్యేక హెల్ప్ లైన్, మొబైల్ యాప్ అందుబాటులోకి తీసుకురావాలని, ప్రతి నెలా "ఆపరేషన్ స్వర్ణ" పురోగతిపై ప్రజలకు నివేదిక విడుదల చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. స్వర్ణముఖి నది కేవలం ఒక నీటి ప్రవాహం కాదు. తిరుపతి ప్రాంత ప్రజల జీవనాధారం, భూగర్భ జలాల మూలం, భవిష్యత్ తరాలకు ప్రకృతి అందించిన అమూల్యమైన సంపద. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు మేల్కొని మాటల్లో కాదు చేతల్లో "ఆపరేషన్ స్వర్ణ"ను అమలు చేయాల్సిన సమయం ఆసన్నమైంది. లేకపోతే నేడు మన కళ్లముందే పూడ్చిపెడుతున్న స్వర్ణముఖి, రేపటి తరాలకు చరిత్ర పుస్తకాల్లో మాత్రమే మిగిలిపోయే ప్రమాదం ఉందని పర్యావరణ వేత్తలు, స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



## రైతులు పీఎం ఫసల్ భీమా యోజన సద్వినియోగం చేసుకోవాలి -వ్యవసాయ అధికారి రమేష్

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,



రైతులు ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వి. రమేష్ కోరారు. ఈ పథకం క్రింద రైతులు తప్పనిసరిగా పంటల భీమా చేసుకోవాలని తెలిపారు. వరి పంటకు భీమా చివరి తేదీ 15-08-2026 అని తెలిపారు. వరి పంట కు భీమా ప్రేమియంగా ఎకరానికి రూ.840 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. బ్యాంకుల ద్వారా పంట రుణాలు తీసుకున్న రైతులకు భీమా ప్రీమియాన్ని సంబంధిత బ్యాంకులు నేరుగా రుణ ఖాతా నుండి మినహాయింపు ఇవ్వడం జరుగుతుందని, పంట రుణాలు తీసుకోని రైతులు సమీప కామన్ సర్వీస్ సెంటర్లను సంప్రదించి నిర్ణీత గడువు లోపు పంటల బీమా చేసుకోవాలని తెలిపారు. ఏవైనా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు, తుఫానులు లేదా కరువు వంటి సందర్భాలలో పంటను నష్టపోయినపుడు రైతుకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన ఎంతగానో తోడ్పాటును అందిస్తుందని కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు..

## శ్రీ విజయ దుర్గ ఉపపీఠం ఉత్తరాధికారిగా సాయి భరద్వాజ్ శర్మను ప్రకటించిన కోటా సునీల్ కుమార్ స్వామి

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,



పట్టణంలోని శ్రీ విజయ దుర్గ ఉప్పపీఠంలో వారాహి అమ్మవారి నవరాత్రి వేడుకలు గత తొమ్మిది రోజులుగా వైభవంగా నిర్వహించారు చివరి రోజు అమ్మవారికి విశేష అలంకరణ హోమం మహా పూర్ణాహుతి నిర్వాహకులు కోటా సునీల్ కుమార్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు కోటా సునీల్ కుమార్ మాట్లాడుతూ వెదురుపాక పీఠాధిపతులు గాడ్ వారి దివ్య ఆశీస్సులతో 2008 సంవత్సరం నుండి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు పలు విశేష పర్వదినాలలో హోమాలు పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఉపపీఠం ఉత్తరాధికారిగా కుమారుడు సాయి భరద్వాజ్ శర్మను ప్రకటిస్తున్నామని నేను ఇతర ప్రాంతాల్లో పూజా కార్యక్రమాలకు వెళ్ళినప్పుడు పీఠంలో పూజా కార్యక్రమాల బాధ్యత చూసుకుంటారని యధావిధిగా కార్యక్రమాలు కొనసాగుతాయని వారాహి అమ్మవారి నవరాత్రి వేడుకలు ఎంతో వైభవంగా జరిగాయని తెలిపారు అమ్మవారి ఆశీస్సులతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు.



## ఎండి పుత్తూరు మిట్ట ఇండ్లులో వీధి కుక్కల రక్త దాహం

### తెగిపడుతున్న మూగజీవాలు

**- నోరు మెదపని పంచాయతీ సిబ్బంది**

ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.



తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం, ఎండీ పుత్తూరు పంచాయతీ పరిధిలోని మిట్ట ఇండ్లు గ్రామంలో వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి. పేదల జీవనాధారమైన పెంపుడు కోళ్లు, మేక పిల్లలను పట్టపగలే వేటాడి చంపుతున్నాయి. గ్రామస్తుల కథనం ప్రకారం, ఎండీ పుత్తూరు ఎస్సీ కాలనీ పరిధిలో సంచరిస్తున్న వీధి కుక్కల గుంపు మిట్ట ఇండ్లు గ్రామంపై దాడి చేస్తోంది. గడిచిన రెండు రోజుల్లోనే 2 మేక పిల్లలు, 9 నాటు కోళ్లు కుక్కల దాడిలో అతి దారుణంగా మృతి చెందాయి. మెడ, పొట్ట భాగాల్లో తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో పడి ఉన్న మూగజీవాల ఫోటోలు చూస్తేనే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోంది. ఒక మేక పిల్ల ధర రూ.8 వేల పైనే ఉంటుంది. రెక్కల కష్టంతో పెంచుకుంటున్న జీవాలు ఇలా కళ్ల ముందే చనిపోతుంటే ఆ పేద కుటుంబాలను ఆదుకునేదెవరు? అసలు భయం ఇప్పుడే మొదలైంది. మూగజీవాలపై దాడి చేస్తున్న ఈ కుక్కలు రేపు పొలాల్లో ఆడుకునే చిన్న పిల్లలపై, ఒంటరిగా వెళ్లే వారిపై దాడి చేయవని గ్యారెంటీ ఏముంది? అని గ్రామస్తులు వణికిపోతున్నారు.



గ్రామస్తుల డిమాండ్: దీనిపై వెంటనే పంచాయతీ సెక్రటరీ స్పందించి వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించి న్యాయం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్ లు, కుక్కర్లు, వంట పాత్రలు, మాట్స్....

**- శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి**

ప్రజాభూమి ప్రతినిది శ్రీకాళహస్తి టౌన్

గౌరవ శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి అధ్యాక్షత న వారి చేతుల మీదుగా శ్రీకాళహస్తి మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు ఆధునిక పరికరాలు అయిన ఇండక్షన్ స్టవ్, కుక్కర్స్, వంట పాత్రలు, మాట్స్ అందచేశారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళాభి వృద్ధి, శిశు సంక్షేమ శాఖ లోని అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా అంగన్వాడీ కేంద్రాలను సమూలంగా మోడల్ సెంటర్స్ గా అభివృద్ధి చేస్తున్నామని, అలానే ఆధునిక పరికరాలు అయినా ఇండక్షన్ స్టవ్స్, వంట సామాగ్రి, కుక్కర్లు అంద చేసారు. అదే విధంగా పిల్లలకు ప్రాథమిక విద్య, మూడు సంవత్సరాలు లోపల పిల్లలకు నవ చేతన కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో మండల నాయకులు చెంచయ్య నాయుడు, కామేష్ యాదవ్ గారు,కృష్ణ యాదవ్, బత్తి రెడ్డి, జగదీశ్ రెడ్డి, ఎంపీడీఓ, సీడీపీఓ శాంతి దుర్గ, సూపెర్వైసోర్స్ భాగ్యలక్ష్మి, ప్రియాంక అంగన్వాడీ కార్యకర్తలు హాజరు అయ్యారు



## ఇప్పటికీ మమ్మల్ని పట్టిపీడిస్తున్న ఆనాటి అక్రమ కేసులు

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.



గురువారం గత వైసిపి పరిపాలనలో జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో అప్పటి శాసనసభ్యుడు మధుసూదన్ రెడ్డి సారధ్యంలో పెట్టిన అక్రమ కేసు సంబంధించి తిరుపతిలో కోర్టు వాయిదాకు నాయకులు కలిసి హాజరైన ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మరియు నెల్లూరు అర్బన్ నియోజకవర్గ పార్టీ పరిశీలకులు డాక్టర్ రెడ్డివారి గురవారెడ్డి మాట్లాడుతూ గత వైసిపి పాలనలో మైనర్ బాలికైన బీసీ వర్గానికి చెందిన చంద్రిత ను వాలంటీర్ గా పనిచేస్తున్న చంద్రశేఖర్ కిడ్నాప్ చేయడంతో దానికి నిరసనగా శాంతియుతంగా నిరసన తెలిపిన మాపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులను నమోదు చేశారు అని అన్నారు అప్పటి వైసిపి ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి సారధ్యంలో మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో అక్రమ కేసు నమోదు చేశారు మరి చట్టం మీద ఉన్న గౌరవంతో ఈరోజు కోర్టుకు విచారణకు హాజరవడం జరిగిందన్నారు అటువంటి దుర్మార్గమైన చర్యలు అప్పటి ప్రభుత్వంలో చేయడం జరిగింది అటువంటి వారిని భవిష్యత్తులో కూడా అధికారానికి దూరంగా పెట్టాలని కోరారు బీసీ వర్గాలకు చెందిన వారికి న్యాయం చేయమని నిరసన తెలిపితే మరి ఈరోజు మనందరిపై అక్రమ కేసులు నమోదు చేసినటువంటి ఒక దుర్మార్గమైన పార్టీ వైసిపి పార్టీ అని గురువారెడ్డి అన్నారు ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రెడ్డి వారి గురువారెడ్డి తో పాటు రాష్ట్ర కార్యదర్శి దశరదాచారి మార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్య నాయుడు పార్టీ సీనియర్ నాయకులు ధనంజయవలనాయుడు రాష్ట్ర పార్టీ బీసీ కార్యవర్గ కార్యదర్శి ఉమేష్ రావు మండల పార్టీ అధ్యక్షులు ముని రాజా నాయుడు కృష్ణ యాదవ్ మాజీ మండల పార్టీ అధ్యక్షులు కామేష్ యాదవ్ పార్టీ నాయకులు ఢిల్లీ బాబు కన్నవరం హరిబాబు బాలాజీ రెడ్డి తదితరులు కోర్టుకు హాజరైన వారిలో ఉన్నారు.

## విద్యార్థినులకు ఆరోగ్య అవగాహన సదస్సు

ప్రజా భూమి ప్రతినిధి
శ్రీకాళహస్తి టౌన్



శ్రీకాళహస్తి హాస్పిటల్స్ మరియు భరత్ హాస్పిటల్ వారు సంయుక్తంగా రోటరీ క్లబ్ వారి సహకారం తో ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ విద్యార్థినులకు ఆరోగ్య సంబంధిత పలు విషయాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ ఆరోగ్య అవగాహనా సదస్సులో ఆడపిల్లలు ఋతు క్రమ సమయంలో తీసుకువలసిన జాగ్రత్తలు మరియు వారికి కావలసిన ఆరోగ్య సలహాలను హాస్పిటల్స్ స్త్రీ సంబంధిత వైద్య నిపుణురాలు డాక్టర్ ముని రాజ్య లక్ష్మి గారు తెలియ జేశారు. అలాగే భరత్ హాస్పిటల్ డాక్టర్ లు డాక్టర్ భరత్ మరియు డాక్టర్ దీపిక గార్లు విద్యార్థినులకు కావలసిన పలు సూచనలను అందించారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులకు ఇలాంటి మంచి విషయాలపై పలు సూచనలు, సలహాలు అందించిన హాస్పిటల్స్ మరియు భరత్ హాస్పిటల్ వారికి అలాగే శ్రీకాళహస్తి రోటరీ క్లబ్ మెంబెర్ లకు కళాశాల ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలియజేసారు.

## కోడి పందాలు లో పట్టబడిన ముద్దాయిలకు జరిమానా?

ప్రజా భూమి ప్రతినిధి
తొట్టంబేడు



వారం క్రితం తొట్టంబేడు మండలం కంచనపల్లి గ్రామ సమీపంలో కోడిపందాలలో సంబంధపడిన వివిధ మండలాలకు చెందిన 48 మంది ముద్దాయిలను ఈ దినం శ్రీకాళహస్తి ప్రత్యేక రెండవ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు నందు హాజరుపరచగా మేజిస్ట్రేట్ సదరు ముద్దాయిలకు జరిమానా విధించడమైనది. అనంతరం పట్టుబడిన 40 మోటార్ సైకిల్ యొక్క ధ్రువీకరణ పత్రాలు పరిశీలించిన అనంతరం సంబంధిత యజమానులకు అప్పగించు సమయంలో తొట్టంబేడు ఎస్ఐ బాలకృష్ణ సదరు ముద్దాయిలకు కౌన్సిలింగ్ నిర్వహిస్తూ మరోసారి ఈ విధంగా పట్టుబడితే కఠినంగా వ్యవహరిస్తామని. మూడు లేదా అంతకంటే ఎక్కువ జూదం కేసులు కలిగిన వారిపై సమాజ శ్రేయస్సు దృష్ట్యా జిల్లా బహిష్కరణ వంటి కఠిన చర్యలు తీసుకోక తప్పదని హెచ్చరించారు. కుటుంబానికి ప్రాధాన్యతనిస్తూ కుటుంబ సభ్యులతో కలిసి కష్టపడి ఎదిగే ప్రయత్నం చేయాలి కానీ జూద కార్యకలాపాలలో పాల్గొనడం ద్వారా కాదని సూచించారు. ఎవరికైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే 9440900724 లేదా 9440796763 నెంబర్లకు ఫోన్ చేసి తెలపగలరని కోరారు. నేర రహిత సమాజ నిర్మాణం కోసం పోలీసులతో సహకరించగలరని కోరారు.

## గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద ఐటీబీపీ జవాన్ల సందడి

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,



దేశ సరిహద్దుల్లో నిత్యం అప్రమత్తంగా ఉంటూ, విపత్తుల సమయంలో ప్రజలను ఆదుకునే ఇండో-టిబెటన్ బార్డర్ పోలీస్ బలగాలు ఈరోజు గూడూరు పట్టణానికి చేరుకున్నాయి. చెన్నై వైపుగా ప్రయాణిస్తున్న ఐటీబీపీ జవాన్ల బృందం, తమ వాహనాలతో గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో కాసేపు ఆగింది. అందిన సమాచారం ప్రకారం వీరు ఈరోజు రాత్రి గూడూరులోనే బస చేసేందుకు వచ్చినట్లు తెలుస్తోంది. అయితే దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ క్రమంలో గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద ఐటీబీపీ జవాన్లను, వారి ప్రత్యేక వాహనాలను చూసిన స్థానికులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. సుదూర ప్రాంతం నుంచి వచ్చిన జవాన్లను స్థానికులు ఆసక్తిగా గమనించడంతో అక్కడ కొంతసేపు సందడి నెలకొంది. దేశం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సరిహద్దుల్లో కాపలా కాసే జవాన్లంటే ప్రతి ఒక్కరికీ అమితమైన అభిమానం, గౌరవం ఉంటాయి. ఆపదలో ఉన్నవారిని ఆదుకునే వారి త్యాగనిరతి మనలో ప్రతి ఒక్కరి హృదయాలను హత్తుకుంటుంది. అందుకే నిత్యం దేశం కోసం శ్రమించే ఆ సైనిక వీరులను చూడగానే గుండె గర్వంతో ఉప్పొంగుతుంది.

# తల్లుల కష్టాలకు పరిష్కారకర్త - చంద్రబాబు!

## -డా.యం.ఉమేష్ రావు,రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్
తమ పిల్లల భవిష్యత్తుపై ఏ తల్లికీ ఇక బెంగ అవసరం లేదని, అంగన్‌వాడీ నుంచి పాఠశాలల వరకు.. ప్రతి బిడ్డకూ విద్యా భరోసా ఇస్తూ, తల్లికి వందనం పథకం అమలు చేస్తున్న సీఎం చంద్రబాబు తల్లుల కష్టాలకు పరిష్కార కర్తగా నిలుస్తున్నారని తెలుగుదేశం పార్టీ, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు కొనియాడారు. గత వైసిపి పాలనాకాలంలో జగన్ రెడ్డి అందరికీ ఇస్తామని నమ్మబలికి,ఒక తల్లికి చెందిన ఒక్క బిడ్డకు మాత్రమే పదమూడు వేల రూపాయలు ఇస్తే, నేడు చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఒక తల్లికి ఉన్న చదువుకునే పిల్లలందరికీ వారివారి తల్లుల ఖాతాలలో గతేడాది నిధులు జమ చేసినట్లే, తమకున్న నలుగురు పిల్లలకు సంబంధించిన తల్లికి వందనం పథకం డబ్బులు నా ఖాతాలో జమచేశారని శ్రీకాళహస్తి పురపాలక సంఘం, 18 వ వార్డు కొత్త కోనేరు యస్టీ కాలనీకి చెందిన గంగా భవానీ మరియు సుబ్బమ్మ సంతోషంగా తెలిపారు. ఈ సందర్భంగా తమ పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్న పియం నరేంద్ర మోడీ, సియం చంద్రబాబు, డిప్యూటీ సియం పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్,స్థానిక శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలుపుతూ, చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి,స్వీట్లు పంచి పెట్టారు. సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా, వరుసగా రెండో ఏడాది "తల్లికి వందనం" నిధులు నేటి నుంచి ఈ నెల 24 వరకు అర్హులైన తల్లుల ఖాతాల్లో జమ చేస్తారని, తల్లికి వందనం ద్వారా ఈ ఏడాది 67,47,190 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తూ, ఒక తల్లికి ఎంత మంది పిల్లలు ఉన్నా అందరికీ పథకం వర్తింపు చేసి, తల్లికి వందనం పథకం కింద



తల్లుల ఖాతాల్లో రూ.10,120.78 కోట్లు ఆర్థిక సహాయం జమ చేస్తున్నారని, ఇదే పథకానికి గత ఏడాది రూ.10,091 కోట్లు జమ చేశారని తెలిపారు. ఈ యేడాది గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే అంగన్ వాడీలకు కూడా తల్లికి వందనం పథకాన్ని వర్తింపు చేయడం ద్వారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం పిల్లల బాధ్యతలు తల్లులకు భారం కాకుండా చూసుకుంటున్నదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు విశ్వబ్రాహ్మణ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ డా.జి.దశరథాచారి, వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షుడు జి.విజయ కుమార్, క్లస్టర్ ఇన్‌ఛార్జి కంఠా రమేష్, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, తంగేళ్ళ పాలెం పిఏసియస్ ఛైర్మన్ బీమాల భాస్కర్, శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, శ్రీకాళహస్తి పట్టణ సహకార బ్యాంకు మాజీ ఛైర్మన్ డి.వి.నారాయణ, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, తొట్టంబేడు మండల ప్రధాన కార్యదర్శి చిల్లకూరు మణి, తిరుపతి పార్లమెంటు నాయకులు సయ్యద్ చాంద్ బాషా, పూల శేఖర్, గాజుల భగత్, గంగనపల్లి రమేష్, సులేమాన్, శంకరయ్య, తుపాకుల ప్రసాద్, గంగా భవానీ, సుబ్బమ్మ, రోజా పాల్గొన్నారు.

# ప్రేక్షకులను భయకంపితులను చేసిన కీచక వధ

- మారువేషంలో కీచకున్ని చంపిన భీముడు
- కీ శే తానికొండ చెంగల రామానాయుడు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు అన్నదానం

ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రాపురం
రామచంద్రపురం మండలంలోని నిలువురాళ్ల కమ్మపల్లి లో నిర్వహిస్తూ ఉన్న 60వ మహాభారత వార్షికోత్సవంలో గురువారం కీచక వధ (నర్తనశాల) హరికథ ,రాత్రి పౌరాణిక నాటకం ప్రేక్షకులను భయకంపితులను చేసింది. జూదంలో ఓడిపోయిన పాండవులు 12 సంవత్సరాలు అరణ్యవాసంలో గడిపి ఒక్క సంవత్సరం అజ్ఞాతవాసం గడపటానికి ద్రౌపతి తో పాటు మారువేశాలలో ఒక్కొక్కరు ఒక్కొక్కరుగా విరటుని కొలువులో ప్రవేశించారు. ద్రౌపతి విరాట రాజు భార్య సుధీష్ణ దేవి వద్ద సెరంద్రీ అనే పేరుతో చెలికత్తెగా,ధర్మరాజు కంకు బట్టారకుడుగా,భీముడు వల్లలుడు అనే పేరుతో వంటలు వాడుగా,అర్జునుడు బృహన్నల,నకుల సహదేవులు అశ్వాలు ,ఆవులు కాపర్లుగా చేరారు. సుధేష్ణ దేవి తమ్ముడు కీచకుడు ఒకరోజు సైరేంధ్రి వేషంలో ఉన్న ద్రౌపదిని చూశాడు. ఆమె పైన మోజు పడి తన అక్కకు చెప్పి కళ్ళు తెమ్మని సాకుతో తన వద్దకు పంపమన్నాడు. ఈ విషయాన్ని సైరెంధ్రి వల్లలుడిగా మారువేషంలో ఉన్న తన భర్త భీమునికి తెలిపింది. వల్లలూడి సూచనతో సైరెంధ్రి కీచకున్ని రాత్రిపూట వంటగదికి రప్పించింది. వంటగదిలో వలలుడిగా ఉన్న బీముడు ముష్టిఘాతాలతో చంపటం వంటి సన్నివేశాలను మధ్యాహ్నం హరికథ భాగవతారిణి స్వర్ణలత చక్కటి గాత్రంతో వీనులకు విందుగా ఆలాపించారు. రాత్రి శ్రీ వెంకటేశ్వర కళానాట్యమండలి కిరణ్ బృందం చక్కటి పాత్రలను పోషించి పరకాయ ప్రవేశం చేసినట్లు ప్రేక్షకులను అబ్బురపరిచారు. మూడు పూటలా పుల్లమ్మ నాయుడు కండ్రిగ గ్రామానికి చెందిన కీర్తిశేషులు తానికొండ చెంగల్రాయనాయుడు జ్ఞాపకార్థం, తానికొండఅమరావతి కుటుంబ సభ్యులు , కోమల సతీష్ దంపతులు, భావన దొరబాబు దంపతులు, మునుమడు మనుమరాలు, లిఖిత్ భవిష్య ,భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. ఆలయ ప్రధాన అర్చకులు హరి స్వామి దివంగత అర్చకులు బ్రహ్మశ్రీ వెంకటరత్నం ఆచారి ఆశీస్సులతో అర్చకులు అరవింద ఆచారి తదితరులు అమ్మవారి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు.మూడు వేళల ధూప దీప నైవేద్యాలు సమర్పించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.ఆలయ ధర్మకర్తలు రమేష్ బాబు, రవికుమార్ గ్రామ పెద్దలతో కలిసి అన్ని ఏర్పాట్లు చేశారు.గ్రామ యువత ఉత్సవాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా స్వచ్ఛందంగా సేవలు నిర్వహించారు.భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ఆలయం వద్ద అన్న ప్రసాదాల స్వీకరించి దైవ కృపకు పాత్రులు కావాలని కోరారు.





# మామండూరు మిట్ట ఆంజనేయస్వామి విగ్రహం అపహరణ కేసు గంటల్లో ఛేదించిన తిరుపతి జిల్లా పోలీసులు

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి
తిరుమల డౌన్ ఘాట్ రోడ్డులోని మామండూరు మిట్ట ఆంజనేయస్వామి ఆలయం నుంచి చిన్న ఆంజనేయస్వామి విగ్రహం అపహరణకు గురైన కేసును తిరుపతి జిల్లా పోలీసులు గంటల వ్యవధిలోనే ఛేదించారు. విగ్రహాన్ని అపహరించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని, దొంగిలించిన విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారు. టీటీడీ ఏవీఎస్‌వో ఏ. వెంకట శివకుమార్ ఫిర్యాదు మేరకు తిరుమల టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆధ్వర్యంలో, టీటీడీ సీవీ అండ్ ఎస్‌వో మురళీకృష్ణతో సమన్వయం చేసి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ దృశ్యాలు, క్షేత్రస్థాయి సమాచారంతో తిరుమల, తిరుపతి ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చేపట్టారు. దర్యాప్తులో నిందితుడు ప్రయాణించిన జీపును గుర్తించిన పోలీసులు, అతను విశాఖపట్నానికి చెందిన పొట్నూరు జస్వంత్ కుమార్ అని నిర్ధారించారు. ప్రభుత్వ రైల్వే పోలీసుల సహకారంతో తిరుపతి నుంచి వెళ్తున్న రైలులో అతడిని అదుపులోకి తీసుకుని, అపహరించిన ఆంజనేయస్వామి విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక విచారణలో నిందితుడు ఇంజినీరింగ్ చదివి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నట్లు, కొంతకాలంగా మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ నెల 5న స్నేహితులతో కలిసి తిరుమలకు వచ్చిన సమయంలో చిన్న ఆంజనేయస్వామి విగ్రహాన్ని చూసి, దానిని ఇంటికి తీసుకెళ్లి పూజ చేసుకోవాలనే ఉద్దేశంతో మూడు రోజుల క్రితం ఒంటరిగా వచ్చి తిరుగు ప్రయాణంలో విగ్రహాన్ని తీసుకెళ్లినట్లు విచారణలో చెప్పినట్లు తెలిపారు. అయితే నిందితుడి వాంగ్మూలంలో వాస్తవం ఎంత ఉందనే అంశంతో పాటు, ఈ ఘటన వెనుక మరెవరైనా ఉన్నారా, భక్తుల మనోభావాలను దెబ్బతీసే కుట్ర ఏదైనా ఉందా అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. నిందితుడు పొట్నూరు జస్వంత్ కుమార్‌ను రిమాండ్‌కు తరలించగా, పోలీసు కస్టడీకి తీసుకుని మరింత లోతుగా విచారించనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును వేగంగా ఛేదించిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ, టీటీడీ విజిలెన్స్ అధికారులు అభినందించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మరింత పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినట్లు వెల్లడించారు.



# ఆదర్శ పాఠశాలలోనే మధ్యాహ్న భోజనంపై నిర్లక్ష్యం.. డీఈవో ఆగ్రహం - బాధ్యులపై చర్యలకు ఆదేశాలు

ప్రజా భూమి ప్రతినిధి చంద్రగిరి
చంద్రగిరి మండలం స్వర్ణ నారావారిపల్లె క్లస్టర్ పరిధిలోని ఎ. రంగంపేట ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) కేవీఎన్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పోషక విలువలు కలిగిన, రుచికరమైన భోజనం అందించడం లేదని గుర్తించిన డీఈవో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, పరిశుభ్రత, మెనూ అమలుపై పలు లోపాలు గుర్తించిన డీఈవో, ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎ. రంగంపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారం విషయంలో ఏమాత్రం అలసత్వం సహించబోమని స్పష్టం చేశారు. విద్యార్థులకు పోషకాలతో కూడిన నాణ్యమైన భోజనం అందించడంలో మండల విద్యాశాఖ యంత్రాంగం విఫలమైందని డీఈవో మండిపడ్డారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తూ విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు పోషకాహారం అందించాలని లక్ష్యంగా పెట్టుకుంటే, క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం చోటుచేసుకోవడం ఆందోళన కలిగించే విషయమన్నారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎ. రంగంపేట ఉన్నత పాఠశాలను రాష్ట్రంలోనే ఆదర్శ పాఠశాలగా ప్రకటించారు. అలాంటి పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఫిర్యాదులు రావడం, తనిఖీల్లో లోపాలు బయటపడటం పలు ప్రశ్నలకు తావిస్తోంది. ఆదర్శ పాఠశాల పరిస్థితి ఇలాగే ఉంటే, సాధారణ ప్రభుత్వ పాఠశాలల్లో పరిస్థితి ఎలా ఉంటుందనే చర్చ విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజల్లో వ్యక్తమవుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తమ విధులు, బాధ్యతల పట్ల మరింత జవాబుదారీతనంతో వ్యవహరించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. జీతాలు ఆలస్యమైతే వెంటనే స్పందించే వ్యవస్థ, విద్యార్థులకు అందించాల్సిన నాణ్యమైన భోజనం విషయంలో కూడా అదే స్థాయి బాధ్యతతో వ్యవహరించాలని కోరుతున్నారు. మధ్యాహ్న భోజనం వంటి కీలక పథకంలోనే నిర్లక్ష్యం కనిపిస్తే, విద్యా బోధన నాణ్యతపై కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయని తల్లిదండ్రులు అంటున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన, పోషకాహారం అందించడం ప్రభుత్వ లక్ష్యమని, ఆ లక్ష్యానికి విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని డీఈవో హెచ్చరించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని నిరంతరం తనిఖీ చేసి, ఎక్కడైనా నిర్లక్ష్యం కనిపిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



# అంగన్వాడి కేంద్రంలో, శుభ్రత, ఆహార భద్రత పై అవగాహన

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.
రేణిగుంట మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చక్రపాణి ఆదేశాల మేరకు సూపర్వైజర్ కామరాజు తమ సిబ్బందితో కలిసి రేణిగుంట గౌరినగర్ లోని అంగన్వాడీ కేంద్రంలో హాజరు, పరిశుభ్రత,ఆహార నాణ్యత,త్రాగునీటి శుభ్రతలను పరిశీలించారు. డెంగ్యూ మాసోత్సవం మరియు ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ లపై అక్కడి ప్రజలకు అవగాహన కల్పించారు. పరిశుభ్రమైన పరిసరాలు, పౌష్టికాహారం, ఆరోగ్యకర పానీయాలు, వ్యక్తిగత పరిశుభ్రతలతో అనేక అంటు వ్యాధుల్ని నివారించవచ్చని,అలాగే 2030 నాటికి దేశాన్ని క్షయవ్యాధి(టీబీ) లేని భారతదేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం దేశమంతటా అమలు చేస్తున్న ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హెల్త్ సూపర్వైజర్ పిలుపునిచ్చారు. అపరిశుభ్రమైన పరిసరాలు, కలుషిత తాగునీరు, అపరిశుభ్ర ఆహారం కారణంగా కలరా, డయేరియా, టైఫాయిడ్, హెపటైటిస్ వంటి కాలేయ వ్యాధులు, నులి పురుగులు వచ్చే అవకాశం ఉందన్నారు.భోజనానికి ముందు, మరుగుదొడ్డి వినియోగించిన తర్వాత సబ్బుతో చేతులు కడుక్కోవడం, సురక్షితమైన తాగునీటి వినియోగం,తాజా మరియు పరిశుభ్రమైన ఆహారాన్ని మాత్రమే తీసుకోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. అదేవిధంగా ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ గురించి వివరిస్తూ రెండు వారాలకు పైగా దగ్గు,జ్వరం, బరువు తగ్గడం, రాత్రి పూట చెమటలు పట్టడం, దగ్గినప్పుడు గళ్ళపడటం, గళ్ళలో రక్తం పడటం వంటి లక్షణాలు ఉంటే వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా టీబీ పరీక్షలు చేసుకోవాలని సూచించారు.టీబీ పూర్తిగా నయమయ్యే వ్యాధి అని,అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా పరీక్షలు, మందులు, పోషకాహార సహాయం అందుబాటులో ఉన్నాయని తెలిపారు.టీబీ రోగులు వైద్యుల సూచనల మేరకు పూర్తి చికిత్స తీసుకోవడం ద్వారా వ్యాధిని పూర్తిగా నయం చేయొచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం రేవతి, ఆశా కార్యకర్తలు కళ్యాణి,సులోచన, అంగన్వాడీ రేవతి, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు శ్రీమతి క్రిష్ణమ్మ, హెల్త్ అసిస్టెంట్ మునివెంకటప్ప పాల్గొన్నారు.



# ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాభూమి,పులివెందుల
సబ్ జైల్లోని ఖైదీలు ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలి అని కడప సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఎస్.బాబా ఫక్రుద్దీన్ అన్నారు. గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు, కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ డాక్టర్ సి యామిని సూచనల మేరకు సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప ఎస్.బాబా ఫక్రుద్దీన్ పులివెందుల సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్ లను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సబ్ జైల్లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం అయన జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయము, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టము, ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు, ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలి అన్నారు, తగు సూచనలను సలహాలను వారికి అందజేశారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించారు. ఏవైనా సమస్యలుంటే పులివెందుల మండల న్యాయ సేవా సమితిని,జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడప ను సంప్రదించవచ్చును అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ చంద్రకాంతమ్మ, శాంత, వినయ్ కుమార్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పులివెందుల డి శివరాజు ఎస్ రామ్మోహన్, పి ప్రకాష్ పులివెందుల సబ్ జైలు సూపరింటెండెంట్, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీలు ,ఖైదీలు పాల్గొన్నారు.

# సఫాయి అప్నావో -- బీమారి భగావో: నలంద పాఠశాలలో విద్యార్థులకు అవగాహన

## పరిశుభ్రత పాటిద్దాం - రోగాలను తరిమికొడదాం

## - మున్సిపల్ కమిషనర్ తనూజా




ప్రజాభూమి,పులివెందుల
కేంద్ర ప్రభుత్వ "సఫాయి అప్నావో -- బీమారి భగావో" కార్యక్రమంలో భాగంగా పులివెందుల పట్టణంలోని నలంద పాఠశాలలో పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పట్టణ మున్సిపల్ కమిషనర్ తనూజ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ "మన ప్రతి చర్య మన ఆలోచనలను ప్రతిబింబిస్తుంది. మన ఆలోచనలు మన ప్రవర్తనగా మారతాయి. కాబట్టి మనం చేసే ప్రతి పనిలో పరిశుభ్రతకు గౌరవం ఇవ్వాలి. మన ఇల్లు, పాఠశాల, పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకుంటూ వ్యాధులను దూరం చేయాలి" అని పిలుపునిచ్చారు. పరిశుభ్రత ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలమని, విద్యార్థులే ఈ ఉద్యమానికి రాయబారులుగా మారాలని సూచించారు.ఈ సందర్భంగా రెవెన్యూ ఆఫీసర్ మునికుమార్ మాట్లాడుతూ విద్యార్థులందరూ పర్యావరణ పరిరక్షణలో ముందుండి, పరిశుభ్రమైన సమాజ నిర్మాణానికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఆకాంక్షించారు.పర్యావరణ కార్యదర్శి సుగుణాకర్ విద్యార్థులకు చేతులు సరిగ్గా కడుక్కోవడం అంటే హ్యాండ్ వాష్ విధానాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించి అవగాహన కల్పించారు. చేతులు కడుక్కోవడం వల్ల వ్యాధులు రాకుండా ఎలా నివారించవచ్చో వివరించారు.ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, నలంద పాఠశాల కరస్పాండెంట్ వెంకటస్వామి రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ విజిత, ప్రధానోపాధ్యాయులు సర్వేశ్వర్ రెడ్డి, పర్యావరణ కార్యదర్శులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఐటి హబ్ విస్తరణ దిశగా జిల్లా అడుగులు . .

## -ఐటి మౌలిక సదుపాయాల కొరకు డిజిటల్ పోర్టల్ ఏర్పాటు- :జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్



ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి,
ఐటి హబ్ విస్తరణ దిశగా జిల్లా అడుగులు వేస్తోందని, ఐటి మౌలిక సదుపాయాల అన్వేషణ కొరకు ఐటి పెట్టుబడిదారులు, భూ యాజమానుల మధ్య సమన్వయం చేస్తూ ఏపి ఐటి ఇన్ఫ్రా కనెక్ట్ ద్వారా డిజిటల్ పోర్టల్ ను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిందని జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో అందుబాటులో ఉన్న కమర్షియల్ భవనాలు, ఖాళీ భూములు, కార్యాలయ స్థలాల యజమానులు ఆస్తుల వివరాలను ఉచితంగా నమోదు చేసుకోవచ్చన్నారు. పెట్టుబడిదారులు ఈ పోర్టల్ ద్వారా సమగ్ర మ్యాప్ ఉపయోగించి ఆస్తుల భౌగోళిక స్థానాల గుర్తింపు, స్థల ఎంపిక, మౌలిక సదుపాయాల అన్వేషణ సులభంగా చూసుకోవచ్చన్నారు. భూ వివరాలను నమోదు చేయడం ద్వారా భవనాలు, ఖాళీ స్థలాలు లీజుకు లేదా అద్దెకు ఇవ్వడం ద్వారా భూ యజమానులకు కూడా ఆదాయం సమకూరుతుందన్నారు. తద్వారా జిల్లాలో సులభంగా పరిశ్రమల స్థాపన జరగడం తో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. ఈ నేపథ్యంలో ఖాళీ భూములు, కార్యాలయ భవనాలు ఉన్న వారి ఆస్తుల వివరాలను ఉచితంగా నమోదు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు. మరిన్ని వివరాల కొరకు జిల్లా ఐటీ మేనేజర్ రమేష్ ఫోన్ నంబర్ 9353494415 ను సంప్రదించవచ్చన్నారు.

# 2003 డిఎస్సీ టీచర్లను పాత పెన్షన్ విధానంలోకి మారుస్తూ జీవో విడుదల: సిఎమ్ చిత్రపటానికి పాలాభిషేకం..!



ప్రజా భూమి ప్రతినిధి,
చంద్రగిరి:
2003 డిఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులను కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం పరిధి నుంచి పాత పెన్షన్ విధానం కిందకు మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయడం పట్ల ఉపాధ్యాయ లోకం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా చంద్రగిరి మండల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో గురువారం స్థానిక క్లాక్ టవర్ సెంటర్ వద్ద గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయ నాయకులు మాట్లాడుతూ.. దశాబ్దాల తరబడి ఎదురుచూస్తున్న తమ సమస్యను పరిష్కరించి, పాతపెన్షన్ విధానాన్ని వర్తింపజేయడం ద్వారా ముఖ్యమంత్రి తమ జీవితాల్లో కొత్త వెలుగులు నింపారని కొనియాడారు. ఇచ్చిన మాట ప్రకారం జీవో విడుదల చేసి తమకు భరోసా కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి ఈ సందర్భంగా వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ నాయకులు జగదీష్ ప్రసాద్, భాస్కర్ నాయుడు, రెడ్డి వెంకటరమణ, రామిరెడ్డి, చెంచయ్య, ప్రసన్న కుమార్, నాద ముని తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాభూమి

జనరల్

శుక్రవారం, జులై 24, 2026

12





## ఆక్వా ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యం

### మచిలీపట్నం ఆక్వా ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ తొలి ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహణ

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

మచిలీపట్నం ఆక్వా ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ తొలి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మచిలీపట్నంలోని నోబుల్ కళాశాల కాన్ఫరెన్స్ హాలులో అత్యంత వైభవంగా నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ఆక్వా ఉద్యోగులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కృష్ణాజిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ అయ్యా నాగరాజు, ఫిషరీస్ డెవలప్మెంట్ ఆఫీసర్ సలెహా, అవనిగడ్డ ఫిషరీస్ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రతిభ పాల్గొని సంఘం కార్యకలాపాలను అభినందించారు.ఈ సందర్భంగా జాయింట్ డైరెక్టర్ అయ్యా నాగరాజు మాట్లాడుతూ, ప్రైవేట్ ఆక్వా ఉద్యోగుల సంక్షేమం, శ్రేయస్సు, పరస్పర సహకారం కోసం ప్రత్యేకంగా సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆక్వా ఉద్యోగులు ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామీణ ప్రాంతాల్లో బైకులపై తిరుగుతూ ఆక్వా రైతులకు సాంకేతిక సేవలు, ఆధునిక సూచనలు అందిస్తూ రంగ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు ప్రమాదాలు లేదా దురదృష్టకర సంఘటనలు ఎదురైనప్పుడు బాధిత కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచే లక్ష్యంతో ఈ సంఘం ఏర్పాటవ డం ఎంతో గొప్ప విషయమన్నారు. ఆక్వా ఉద్యోగులకు ఎదురయ్యే సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని, మత్స్యశాఖ తరపున అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఫిషరీస్ డెవలప్మెంట్ ఆఫీసర్ సలెహా మాట్లాడుతూ, ఆక్వా ఉద్యోగులందరూ మత్స్యశాఖ కుటుంబ సభ్యులేనని, వారి సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. ఆక్వా రైతులకు నాణ్యమైన సాంకేతిక సేవలు అందిస్తూ, పరిశ్రమ అభివృద్ధికి అందరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు చిన్నం నాయుడు, అధ్యక్షులు శేషుబాబు, ఉపాధ్యక్షులు కిషోర్ బాబు, ప్రధాన కార్యదర్శి దేవరకొండ వసంత్, ట్రెజరర్ వెంకట నాయుడు, సంయుక్త కార్యదర్శి మహేష్‌తో పాటు ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు హుస్సేన్, శివప్రసా ద్, సురేష్, చిన్న వెంకటేష్, రోషన్, యోగేంద్ర కుమార్, కమిటీ సభ్యులు సంతోష్, దుర్గాప్రసాద్, సుధాకుమార్, కిరణ్, వెంకటేశ్వరరావు, మురళి, ధర్మారావు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.ఆక్వా ఉద్యోగుల ఐక్యత, పరస్పర సహకారం, సంక్షేమం అనే లక్ష్యాలతో ముందుకు సాగుతున్న ఈ సంఘం భవిష్యత్తులో ఉద్యోగుల హక్కుల పరిరక్షణతో పాటు ఆక్వా రైతులకు మరింత నాణ్యమైన సాంకేతిక సేవలు అందించడంలో కీలక పాత్ర పోషించాలని పలువురు ఆకాంక్షించారు.

## వైజేఆర్ డిఎమ్ఎస్ కళాశాలలో 'నాస్కామ్ ఫ్యూచర్‌స్కిల్స్ ప్రైమ్' అవగాహన సదస్సు

### విద్యార్థులకు ఉపాధి అవకాశాలే లక్ష్యంగా నాస్కామ్ ప్రత్యేక కార్యక్రమాలు

### 'టెక్-పవర్డ్ ఫ్రాడ్ ప్రెడిక్షన్స్' కేస్ స్టడీ విడుదల

### ప్రారంభించిన ఇస్రో మాజీ శాస్త్రవేత్త చందు సాంబశివరావు




మచిలీపట్నంరూరల్/ ప్రజాభూమి ప్రతినిధి

స్థానిక వైజేఆర్ డిఎమ్ఎస్ (YJR DMS) ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థుల భవిష్యత్తు, ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే లక్ష్యంతో 'నాస్కామ్ ఫ్యూచర్‌స్కిల్స్ ప్రైమ్ (FSP) సర్టిఫికేషన్' అవగాహన సదస్సును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాస్కామ్ అందిస్తున్న డీప్ స్కిల్లింగ్ ప్రోగ్రామ్‌లు, ఇంటర్న్‌షిప్ అవకాశాలపై విద్యార్థులకు నిపుణులు సమగ్ర అవగాహన కల్పించారు. నూతన కేస్ స్టడీ పరిచయం:పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాలను పెంచే దిశగా "టెక్-పవర్డ్ ఫ్రాడ్ ప్రెడిక్షన్స్ – ఆటో ఇన్సూరెన్స్‌లో డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ క్లెయిమ్స్" అనే కొత్త కేస్ స్టడీని నాస్కామ్ బృందం విద్యార్థులకు పరిచయం చేసింది.శాస్త్రవేత్త శ్రీ చందు సాంబశివరావు: నిట్ సూరత్కల్ పూర్వ విద్యార్థి, ఇస్రో మాజీ శాస్త్రవేత్త శ్రీ చందు సాంబశివరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు నూతన సాంకే తిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.డా. గుండాల నాగరాజు (CEO): Aste rion NextGen Catalyst, Smart Mieten Tech సంస్థల సీఈఓ డా. గుండాల నాగరాజు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, ప్రాక్టికల్ అనుభవం మరియు గుర్తింపు పొందిన సర్టిఫికేషన్లు విద్యార్థుల కెరీర్‌కు ఏ విధంగా ఉపయోగపడతాయో వివరించారు.లక్ష్యం: పరిశ్రమ అవసరాలకు తగిన నైపుణ్యాలు (Industry-ready skills), గుర్తింపు పొందిన సర్టిఫికేషన్లు మరియు ప్రాయోగిక అనుభవం కల్పించి, విద్యార్థులకు మెరుగైన ఉద్యోగావకాశాలు దక్కేలా చూడడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. టి. రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ డా. బి. నాగజ్యోతి, మేనేజ్‌మెంట్ సభ్యులు శ్రీ కిరణ్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ సుష్మ, ఎలక్ట్రికల్ విభాగాధిపతి మరియు ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా. ఉదయ్ భాస్కర్, అధ్యాపక బృందం మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఉన్నత చదువులతో భవిష్యత్ కి బాటలు వేయాలి

- ఆర్కేవ్యాలి డైరెక్టర్ జీ.విజయ్ ప్రకాష్
- మూడో విడత అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి



ప్రజాభూమి, వేంపల్లె

ఉన్నత చదువుల ద్వారా భవిష్యత్ కి బాటలు వేసుకోవాలని ఆర్కేవ్యాలి ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ జీ.విజయ్ ప్రకాష్ సూచించారు. గురువారం ఆర్కేవ్యాలి, ఒంగోలు క్యాంపస్ లకు సంబంధించి మూడో విడత అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి అయింది. ఈ సందర్భంగా ఒంగోలు క్యాంపస్ మిగిలిన 246 సీట్లకు 161, ఆర్కేవ్యాలి క్యాంపస్ మిగిలిన 82 సీట్లకు 52 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. మిగిలిన సీట్లకు గాను నాలుగో విడత కౌన్సిలింగ్ లో పూర్తి చేస్తారని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్కేవ్యాలి పరిపాలన అధికారి డా.రవికుమార్, అకాడమీక్ డీన్లు రమేష్ కైలాస్, రూపస్, స్టూడెంట్ వెల్ఫేర్ వెంకటేష్, అసోసియేట్ డీన్లు రాఘవరెడ్డి, నవీన్, ఉదయశ్రీ, హుస్సేన్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. దీప్తి, పిఆర్ఓ డా.తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా బీటెక్ రవి వ్యాఖ్యలు

### అక్రమాలకు పాల్పడితే ధీటుగా ఎదుర్కొంటాం

### పులివెందుల మున్సిపాలిటీ గెలిచి చూపిస్తాం వైసిపి నాయకులు

ప్రజాభూమి,పులివెందుల

నిన్న జరిగిన తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో బీటెక్ రవి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా వ్యాఖ్యలు చేయడం దురదృష్టకర మని వైసీపీ నాయకులు ధ్వజమెత్తారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల్లో ప్రజల చేత ఎన్నికై గెలవాల్సి ఉంటుందని, అలా కాకుండా పోలీస్ వ్యవస్థను అడ్డుపెట్టుకొని, అక్రమాలకు పాల్పడి మున్సిపాలిటీ ఎన్నికల్లో గెలవాలని చూస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. చేసే ప్రతి చర్యను ధీటుగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.ప్రజలకు ఎన్నో మంచి పనులు చేసిన వైయస్ కుటుంబానికి ప్రజల అండ, ఆశీస్సులు మెండుగా ఉన్నాయని, మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అన్ని వార్డులు కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.పులివెందుల, సింహాద్రిపురం, చక్రాయపేట, వేముల, వేంపల్లి తదితర ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమాలపై వైసీపీ నేతలు ఆరోపణలు చేశారు. ఇసుక, భూ, మద్యం అక్రమాలు, వివిధ ప్రాజెక్టుల్లో కమీషన్ల ఆరోపణలతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. జెడ్పీ ఎన్నికల్లో జరిగినట్లుగా మున్సిపల్ ఎన్నికల్లో ఓట్ల దోపిడీకి పాల్పడితే పులివెందుల ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు.



ఇకనైనా ప్రజాస్వామ్యబద్ధంగా గెలవాలని హితవు పలికారు.ఈ కార్యక్రమంలో పులివెందుల పట్టణ అధ్యక్షులు హాల్ గంగాధర్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, రాష్ట్ర నూర్‌బాషా అధ్యక్షులు రసూల్, వేముల మండల కన్వీనర్ సాంబశివ రెడ్డి, సింహాద్రిపురం మండల కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, పులివెందుల మండల కన్వీనర్ భాస్కర్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ హాఫీజ్, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, రాష్ట్ర బూత్ కమిటీ నాయకులు చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## వినాయక మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి..



### -ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యం..
### -అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు
### -అడిషనల్ ఎస్పీ మహేష్

ప్రజాభూమి, హిందూపురం టౌన్

రాబోయే వినాయక చవితి ఉత్సవాలను శాంతియు తంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు వినాయక మండప నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల నుంచి ముందస్తు అనుమతి పొందాలని శ్రీ సత్యసాయి జిల్లా అడిషనల్ ఎస్పీ మహేష్ స్పష్టం చేశారు. గురువారం హిందూ పురం డీఎస్పీ కార్యాలయంలో పట్టణ సీఐలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వినాయక ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన మార్గదర్శకాలను వెల్లడించారు. వినాయక మండ పాలను ఏర్పాటు చేయదలిచిన ప్రతి కమిటీ ముందుగా పోలీసు శాఖకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. దరఖాస్తు అందిన తర్వాత పోలీసులు మండపం ఏర్పాటు చేసే ప్రాంతాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి, మున్సిపల్, విద్యుత్, అగ్నిమాపక, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో సమన్వయం చేసి భద్రతా ప్రమాణాలను పరిశీలించిన అనంతరం మాత్రమే అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. మండపాల ఏర్పాటు వల్ల రహదారులకు ఆటంకం కలగకుండా, ప్రజలకు ఇబ్బం దులు తలెత్తకుండా, విద్యుత్ భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ప్రజల భద్రతకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీ చర్యలు చేపడతామని పేర్కొన్నారు. వినాయక నిమజ్జన కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా రూట్ మ్యాప్, ట్రాఫిక్ నియంత్రణ, పోలీసు బందోబస్తు, తాగునీరు, విద్యుత్ వెలుగులు తదితర సౌకర్యాలను కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. నిమజ్జన వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు ఉంటాయని చెప్పారు. ప్రతి వినాయక మండప నిర్వాహకుడు పోలీసు శాఖ జారీ చేసే నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, అనుమతి లేకుండా మండపాలు ఏర్పాటు చేయరాదని అడిషనల్ ఎస్పీ మహేష్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పట్టణ సీఐలు రాజగోపాల్ నాయుడు, అబ్దుల్ కరీం, రూరల్ సీఐ జనార్ధన్, అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## 'రాపిడో' సేవలు రద్దు చేయాలి

### -ఆర్టీవోకు భగత్ సింగ్ ఆటో యూనియన్ (సీఐటీయూ) వినతి

ప్రజాభూమి, హిందూపురం టౌన్ హిందూపురం పట్టణంలో ఆటో కార్మికుల జీవనోపాధికి తీవ్ర నష్టం కలిగిస్తున్న టూ వీలర్ రాపిడో (బైక్ టాక్సీ) సేవలను వెంటనే నిలిపివేయాలని కోరుతూ భగత్ సింగ్ ఆటో యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో గురువారం ప్రాంతీయ రవాణా అధికారి (ఆర్టీవో)కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడు తూ, ఎలాంటి చట్టబద్ధమైన అనుమతులు లేకుండా కొంతమంది వైట్ బోర్డు టూ వీలర్లపై ప్రయాణికులను రవాణా చేస్తుండడం వల్ల ఆటో కార్మికుల ఉపాధిపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి అక్రమ రవాణాను అరికట్టి వేలాది ఆటో కార్మికుల జీవనోపాధిని కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఆర్టీవో స్పందిస్తూ, వైట్ బోర్డు టూ వీలర్లపై ప్రయాణికులను రవాణా చేయడానికి ఎటువంటి అనుమతి లేదని స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రయా ణికుల రవాణా నిర్వహిస్తున్న వారిపై తనిఖీలు నిర్వహించి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసు కుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హిందూ పురం ఆటో యూనియన్ అధ్యక్షుడు అక్తర్ బాబా, నాయకులు నారాయణప్ప, అమర్, మూర్తి, సోము, భాష, బాబు తదితరులు పాల్గొన్నారు.



## హరిత హిందూపురం ఏర్పాటు కోసం ఎకో షాప్ ఏర్పాటు

### -పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వామ్యం కావాలి
### -మినీ మార్కెట్ పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హరిత హిందూపురం లక్ష్యంగా పట్టణంలో పర్యావరణహిత కార్యక్రమాలకు పురపాలక సంఘం మరింత ప్రాధాన్యత ఇస్తోందని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పేర్కొన్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని లేపాక్షి రోడ్డులో ఉన్న మినీ మార్కెట్‌లో ఏర్పాటు చేయనున్న ఎకో షాప్ నిర్వహణ కోసం కేటాయించిన గదులను గురువారం మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. షాప్ నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, వస్తువుల



ప్రదర్శన, వినియోగదారులకు కల్పించాల్సిన సౌకర్యాలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అన్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణంతో పాటు భవిష్యత్ తరాలకు కూడా ముప్పు వాటిల్లుతోందని పేర్కొన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేస్తోందని, హిందూపురం మున్సిపాలిటీ కూడా దీనిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పట్టణంలో నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ప్లేట్లు, ఇతర సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని అరికట్టేందుకు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై జరిమానాలు విధించడంతో పాటు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు కూడా చేపడుతున్నామని చెప్పారు. ఈకో షాప్ ద్వారా క్లాత్ బ్యాగులు, జూట్ బ్యాగులు, పేపర్ ఉత్పత్తులు, సహజ పదార్థాలతో తయారైన పర్యావరణహిత వస్తువులు ప్రజలకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ ఉత్పత్తులను వినియోగించడం ద్వారా ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. పర్యావరణహిత జీవన విధానాన్ని అలవర్చుకోవడం ద్వారానే స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన హిందూపురాన్ని నిర్మించగలమని కమిషనర్ పేర్కొన్నారు. ఈ పరిశీలనలో మెప్మా డీఎంసీ గంగులయ్య, ఎస్‌హెచ్‌జీ ఉమెన్స్ ఎంటర్‌ప్రెన్యూర్ సుజాతతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కార్మిక సమస్యల పరిష్కారమే లక్ష్యం

### -కలెక్టరేట్ల ముట్టడిని జయప్రదం చేయండి
### -గోడపత్రికలు విడుదల

ప్రజాభూమి, హిందూపురం టౌన్

స్కీం వర్కర్లు, మున్సిపల్ కార్మికులు, రవాణా రంగ కార్మికులు తదితర అసంఘటిత రంగాల కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30, 31 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాల యాల ఎదుట నిర్వహించే ధర్నాలను జయప్ర దం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వీఆర్ రాము పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం హిందూపురంలో ధర్నా కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వీఆర్ రాము మాట్లాడు తూ, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, మున్సిపల్ కార్మికులు, ఆటో, లారీ, రవాణా రంగం సహా వివిధ రంగాల కార్మికులు ఎన్నో ఏళ్లుగా ప్రజలకు సేవలందిస్తున్నప్పటికీ వారికి కనీస వేతనాలు, పదవీ విరమణ ప్రయోజనాలు, కార్మిక చట్టాల ప్రకారం లభించాల్సిన హక్కులు ఇప్పటికీ అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 20 నుంచి 25 సంవత్సరాలుగా పనిచే స్తున్న వేలాది మంది స్కీం వర్కర్లు, మున్సిపల్ కార్మికు లను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని, గత 15 సంవత్సరాలుగా కనీస వేత నాల సవరణ కోసం ఏర్పాటు చేయాల్సిన మిని మం వేజ్ బోర్డును కూడా నియమించలేదని విమ ర్శించారు. కార్మికుల శ్రమకు తగిన గౌరవం ఇవ్వ కుండా ప్రభుత్వాలు మొండి వైఖరి అవలంభిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితులకు నిరసనగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జూలై 30, 31 తేదీల్లో అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద భారీ ధర్నాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా సత్యసాయి జిల్లా వ్యాప్తంగా గోడపత్రికల విడుదలతో పాటు వివిధ రంగాల కార్మికుల సమస్యలను వివరిస్తూ 20 రకాల కరపత్రాలను ముద్రించి విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం మున్సిపల్ యూనియన్ కార్యదర్శి మురళి, అధ్యక్షుడు నరసింహమూర్తి, కోశాధికారి మల్లయ్య, ఉపాధ్యక్షులు బాలాజీ, మంజు, శ్రీరాములు, ప్రదీప్, సహాయ కార్యదర్శులు కృష్ణమూర్తి, కిరణ్, వినోద్ చంద్ర, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు గురు, కొట్నూరు జేబీవుల హరి, నారాయణప్ప, ఆది, అంజి, అత్తర్, నంజుండప్ప, నరసింహ, మురారి, హరీష్, అంజన్నప్ప, నారాయణస్వామి, సూరి తదితరులు పాల్గొన్నారు.





Printed by Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at and published at DOOR NO. 19-4-378, S T V NAGAR, NEAR OLD TVS SHOW ROOM, OPPOSITE TIRUPATHI (URBAN) editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .PRGINo. "APTEL/25/A2316,Phone No. Cell : 9502116677

# జిల్లా పరిషత్ ఉద్యోగుల బదిలీలకు శ్రీకారం

ప్రజా భూమి ప్రతినిధి–ఏలూరు జిల్లా

ఏలూరు,పశ్చిమ గోదావరి జిల్లాల జిల్లాపరిషత్ కార్యాలయాలకు వెళ్లాలనుకునే ఉద్యోగులకు ఆప్షన్ లు పెట్టుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది. మరో నెల రోజుల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధికారికంగా రెండు జిల్లాలుగా విడిపోనుంది,అందుకు గాను ఉద్యోగులు ఆయా జిల్లాలో ఇష్ట పూర్వకంగా విధులు నిర్వహించేందుకు తమ ఆప్షన్ దరఖాస్తులు కోరింది,అందుకు గాను ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన ఆప్షన్ దరఖాస్తుల స్వీకరణ కౌంటర్లు ఏర్పాటు చేసింది, ఏలూరు జిల్లా కేంద్రంలో ఉన్న ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయానికి,భీమవరం కేంద్రంగా ఉన్న పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ కార్యాలయానికి కావావలసిన పరిపాలనా సిబ్బంది ని



నియమించేందుకు ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టింది, అందు కుగాను ప్రభుత్వం ఉద్యోగులు ఏ ఏ జిల్లాల కు వెళ్లాలనుకుంటున్నారో ఆయా జిల్లా పరిషత్ కార్యాలయాలకు దరఖాస్తు చేసుకునేందుకు ముందుగానే ఉద్యోగుల నుండి ఆప్షన్ లెటర్ లు ఆయా జిల్లా పరిషత్ కార్యాలయాలలో ఆప్షన్ లెటర్ లు అందజేయాలని కోరింది, దీంతో ఉద్యోగులు తమ ఆప్షన్ దరఖాస్తులను అందజేయడానికి ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయానికి చేరుకుంటున్నారు, ఏలూరు జిల్లా కేంద్రం లో ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయం ఉండగా ఇక్కడ ఉన్న 40 శాతం మంది పరిపాలనా సిబ్బంది కి తోడు కృష్ణా జిల్లా నుండి మరో 10 శాతం మంది సిబ్బంది ఏలూరు జిల్లా పరిషత్ కి రానున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ కేంద్రంగా ఉన్న భీమ వరం కు 50 శాతం మంది ని ,ఈ జిల్లా నుండి 10 శాతం మంది సిబ్బందిని రాజమం డ్రి జిల్లా పరిషత్ కార్యాలయానికి సర్దుబాటు చేస్తున్నట్టు తెలిసింది.

రాష్ట్రం లో బైపర్గేషన్ లో భాగంగా విడిపోయిన జిల్లాలలో కొత్త జిల్లా పరిషత్ కార్యాలయాలు ఏర్పడుతున్నాయి, అక్టోబర్ లో మున్సిపాలిటీ ల కు నవంబర్ లో జిల్లా పరిషత్ లకు,2026 డిసంబర్ లేదా 2027 జనవరి మాసాలలో పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికలకు తుది మెరుగులు దిద్దుతున్నట్టు విశ్వసనీయ సమాచారం.

# జీలుగుమిల్లి మండలంలోని విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి

ప్రజా భూమి ప్రతినిధి–జీలుగుమిల్లి

నీట్ పేపర్ లీకేజీ, విద్యా వ్యవస్థలో పెరుగుతున్న అవకతవకలు, ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే విధానాలకు నిరసనగా నేడు నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను జీలుగుమిల్లి మండలంలో సంపూర్ణంగా విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కారం భాస్కర్, రైతు సంఘం మండల కార్యదర్శి సిరిబత్తుల సీతారామయ్య, సీఐటీయూ మండల కార్యదర్శి చిట్టిబొమ్మ కొండలరావు,



కె. శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గురువారం జీలుగుమిల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు,మండల విద్యాశాఖాదీకారులు (ఎం ఈ ఓ )లకు బంద్ నోటీసులు అందజేశారు. విద్యను కార్పొరేట్ శక్తులకు అప్పగించే విధానాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలు లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేశాయని, పరీక్షల నిర్వహణలో పారదర్శకత, బాధ్యులపై కఠిన చర్యలు, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం అత్యవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థల యాజమాన్యాలు ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించే ఈ బంద్‌కు పూర్తి సహకారం అందించి విజయవంతం చేయాలని వారు కోరారు.

## రాష్ట్ర వేదికపై ఆగిరిపల్లి దివ్యాంగ విద్యార్థుల సత్తా.. పతకాల పంట



ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండలం తోటపల్లి గ్రామంలోని హీల్ దివ్యాంగుల పాఠశాలలో గత మూడు రోజులుగా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి దివ్యాంగుల క్రీడా పోటీల్లో ఆగిరిపల్లి విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. ఏలూరు జిల్లా తరఫున జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల భవిత కేంద్రం నుంచి పాల్గొన్న గోల్కొండ సుజిత 100 మీటర్లు, 400 మీటర్ల పరుగు పోటీలతో పాటు మరో విభాగంలో కలిపి మూడు బంగారు పతకాలు సాధించగా, పి. గాయత్రీదేవి 100 మీటర్ల పరుగు పోటీలో ఒక బంగారు, ఒక రజత పతకం గెలుచుకుంది. కొండా హాసిని రిలేలో బంగారు పతకం, సి.హెచ్. మౌనిక, కె. పాల్, నక్కనబోయిన లీల రాఘవ రిలే పోటీల్లో రజత పతకాలు సాధించి జిల్లాకు గౌరవం తీసుకొచ్చారు. మొత్తం ఏలూరు జిల్లా జట్టు 14 బంగారు, 15 రజత, 8 కాంస్య పతకాలను కైవసం చేసుకుంది. విజేతలను జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పులి పుష్పలత, భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయురాలు ఝాన్సీరాణి, రజినితో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

## ప్రజాసేవలో ముందుండే ఉప్పలపాటి గణేష్



ప్రజాభూమి ప్రతినిధి–నూజివీడు

ముసునూరు మండలం గోపవరం గ్రామంలో పంచాయతీ మంచినీటి మోటారు, విద్యుత్ వైరు కాలిపోవడంతో గ్రామంలో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ విషయాన్ని ప్రజాసేవలో నిరంతరం కొనసాగుతున్న గోపవరం గ్రామ తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు, పి ఏ సి ఎస్ చైర్మన్ ఉప్పలపాటి గణేష్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి మోటారు, వైరు మరమ్మత్తు పనులను అత్యవసరంగా చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. మరమ్మత్తు పనులు పూర్తయ్యే వరకు గ్రామ ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు వెంటనే ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేయించి, ప్రతి కుటుంబానికి తాగునీరు అందేలా ప్రత్యేక శ్రద్ధలి తీసుకున్నారు. మంత్రి వర్యులు కొలుసు పార్థసారథి సారథ్యంలో ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ, ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి వెంటనే స్పందించి పరిష్కారం చూపే నాయకుడిగా ఉప్పలపాటి గణేష్ గ్రామ ప్రజల ఆదరణను పొందుతున్నారు. ఆయన సేవాభావాన్ని కొనియాడుతూ గోపవరం గ్రామ ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# ముగ్గురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజా భూమి ప్రతినిధి–జీలుగుమిల్లి

పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆదేశాల మేరకు జీలుగుమిల్లి మండలంలోని దర్భాగూడెం గ్రామంలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి కూటమి నాయకులు సీఎం సహాయ నిధి (సీఎంర్ఫ్) చెక్కులను అందజేశారు. దర్భగూడెం గ్రామానికి చెందిన కొడాలి సాంబశివరావు 70, 918 రు. అంగని వరలక్ష్మి 35, 917రు. పెద్ది రెడ్డి రవీంద్ర కుమార్ 25,000రు మొత్తం 1,31,835 రూపాయల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రి, పోలవరం ఎమ్మెల్యే శ్రీ



చిర్రి బాలరాజు కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బండారు అనిల్ కుమార్, కుంజా రమేష్, సిరిబత్తుల స్వామి, రూప సత్యనారాయణ, నెలాతూరి మోహన్, సూరిశెట్టి మహేష్, కర్రి మహేష్, జాష్టి సత్తిబాబు, కొడవటి బన్ను, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి వీరంకి బాలు, మండల బీసీ మోర్చా అధ్యక్షుడు గడ్డం రామకృష్ణ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఊడా వెంకటేశ్వరరావు, సొంటి రాము, గంటసాల అచ్యుతరావు, అలాగే కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏపీ మంత్రులను కలిసిన రాష్ట్ర ఆక్వా రైతు సంఘ అధ్యక్షులు గాంధీ భగవాన్ రాజు

- వారంలో విద్యుత్ సబ్సిడీ అందరికి అందించేందుకు మంత్రుల హామీ
- ఆక్వా రైతుల హర్షం

ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు

ఏపీరాష్ట్ర ఆక్వా రైతు సంఘ అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు గురువారం విజయవాడ లో మంత్రి నిమ్మల రామానాయుడు సమక్షంలో మత్స్యశాఖ మంత్రి అచ్చయ్య నాయుడు,విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కలిసి ఆక్వా సబ్సిడీ సమస్య పై మంత్రులకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు స్థానిక విలేకరుల కు తెలిపారు. మంత్రులకు ఆక్వా సబ్సిడీ సమస్య



గురించివివరించగామంత్రులు వెంటనే వారం లోగా విద్యుత్ ఆక్వా సబ్సిడీ ప్రతీ రైతుకు అందేలా చేస్తాం అని హామీ ఇచ్చి నట్లు గాంధీ భగవాన్ రాజు తెలిపారు. మంత్రులను కలిసిన వారిలో సంఘ సభ్యులు మెడిది జాన్ డేవిడ్ రాజు,కాకర్ల వినాయకం, సతిన్నీడినాని,డి .మధుసూదన రావు,సత్తిబాబు రాజు. వున్నారు. కాగా ఆక్వా రైతు లందరికి విద్యుత్ సబ్సిడీ వస్తుండటం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఘనంగా కోడి రామకృష్ణ 77వ జయంతి వేడుకలు

ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు

శతానికి చిత్రాలు దర్శకుడు కోడి రామకృష్ణ 77వ జయంతి కార్యక్రమం స్థానిక మారుతి థియేటర్లో అత్యంత వైభవం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వంగా నరసింహారావు మాట్లాడుతూ పాలకొల్లు కీర్తిని పెంచిన గొప్ప వ్యక్తులు దాసరి నారాయణ రావు, కోడి రామకృష్ణలు అని కొనియాడారు. పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గండేడ్ వెంకటేశ్వరరావు జీవి మాట్లాడుతూ స్వయంకృషితో ఉన్నత శిఖరాలకు అధిరోహించిన గొప్ప వ్యక్తి కోడి రామకృష్ణ



అని పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ నాయకులు జక్కంపూడి కుమార్ మాట్లాడుతూ తెలుగు సినిమా రంగంలో గ్రాఫిక్స్ ను ప్రవేశపెట్టి ప్రేక్షకులకు కొత్త అనుభూతిని కలుగజేసిన గొప్ప వ్యక్తి కోడి రామకృష్ణ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోడి రామకృష్ణ బాల్య స్నేహితుడు కొయ్యన సూర్యనారాయణ, మేడికొండ శ్రీనివాసరావు చౌదరి , భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షుడు కొల్లి కొండ ప్రసాద్, టిడిపి నాయకులు పొట్నూరి శ్రీనివాస్,యర్రంశెట్టి వెంకటరత్నం, మానాపురం సత్యనారాయణ, కొణిజేటి గుప్త, మారుతి థియేటర్ మేనేజర్ దేవళ్ళ బుజ్జి, గారి రెడ్డి బాలు తదితరులు పాల్గొన్నారు.

# వరిధనంలో ఇంటింటా 1200 మందికి వైద్య పరీక్షలు

ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు

దీర్ఘకాలిక సంక్రమిక వ్యాధులపై వైద్య బృందం అవగాహన తెలుగు తల్లి వాకర్స్ క్లబ్ మరియు సూర్య నక్షత్ర సుఖీభవ సంయుక్తంగా వరిధానం నం గ్రామంలో గత రెండు రోజులుగా ) 40 మంది పారామెడికల్ ( స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీషియన్లు ) నలుగురు వైద్యులు ఐదు బృందాలుగా విడిపోయి వరిధనం గ్రామం మొత్తం సుమారు 1200 మందిని ఇంటింటికి వెళ్లి ఆ గ్రామంలో ప్రజలు వివిధ రకాల రుగ్మతలకు వాడుతున్న మందులను, ఆహారపు అలవాట్లను, వారి వ్యవహార శైలిని పరిశీలించారు. వీటిలో భాగంగా గ్రామ ప్రజలకు 30% మందికి బీపీ , షుగర్ , 12% మందికి థైరాయిడ్, 10% మందికి కిడ్నీ సమస్యలు, 25% మందికి మోకాళ్లు, కీళ్ల నొప్పులు, 10% మంది గుండె సంబందిత వ్యాధులతో బాధపడుతున్నారు.



వీరందరినీ పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జీవనశైలి వ్యాధులపై అవగాహన కల్పించి ఆహార వ్యవహారాలలో మార్పులు, వ్యాయామం ఆవశ్యకత, సూర్యరశ్మి అవసరాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డాక్టర్ పాటపళ్ళ వెంకటస్వామి( ఆయుష్ ), డాక్టర్ పి. రేణుక, డాక్టర్ జీవన్, డాక్టర్ కుమార్, లార్డ్ టెక్నీషియన్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

డాక్టర్ పాటపల్ల వెంకటస్వామి మాట్లాడుతూ ప్రజలకు జీవనశైలి వ్యాధులకు మన పూర్వీకులు అమలుపరిచిన విధానాలను ఈ ఆధునిక తరంలోపొందుపరచుకోవాలని చిరుధాన్యాల వైపు మరల మని సూచించారు.

## రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్.



ప్రజాభూమి ప్రతినిధి–పెదపాడు.

నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై నిరసనగా జులై 24న ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్కు పలు విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ బంద్కు ఎస్ఎఫ్ఐ, పిడిఎస్యు, ఏఐఎస్ఎ, ఎన్ఎస్యుఐ, డివైఎఫ్ఐ, ఏఐవైఎఫ్ తదితర విద్యార్థి, యువజన సంఘాలు మద్దతు ప్రకటించాయి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ, ప్రొఫెషనల్ కాలేజీలు, విశ్వవిద్యాలయాల విద్యార్థులు, అధ్యాపకులు ఈ నిరసనలో పాల్గొని బంద్ను విజయవంతం చేయాలని సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు.

## ఏలూరు ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం –ఎమ్మెల్యే బడేటి చంటి



ప్రజాభూమి ప్రతినిధి–ఏలూరు

నగరంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు. గురువారం ఆర్అండ్‌బి, మున్సిపల్ కార్పొరేషన్, పోలీసు, ఆర్టీసీ అధికారులతో కలిసి పాత బస్టాండ్ పరిసరాల్లో ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ షాపింగ్ కాంప్లెక్స్ పునర్నిర్మాణం, పాత బస్టాండ్ ఇన్–అవుట్ గేట్ల మార్పు, అవసరమైన చోట్ల రహదారుల విస్తరణ, డివైడర్ల ఏర్పాటు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. నగర సుందరీకరణతో పాటు ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే చంటి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి,ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, వివిధ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు, కార్పొరేటర్లు, క్లస్టర్ ఇంచార్జిలు, డివిజన్ ఇంచార్జిలు పాల్గొన్నారు.

## సురక్షిత మంచినీరు త్రాగడం వలన చాలా ప్రయోజనాలు ఉన్నాయి

ప్రజా భూమి ప్రతినిధి–చాట్రాయి



సురక్షిత మంచినీరు త్రాగటం వలన రోగాలను మనదరి దరి చేరకుండా చేసుకోవచ్చు అని నూజివీడు నియోజక వర్గ తెలుగు రైతు అధ్యక్షుడు మోరంపూడి శ్రీనివాసరావు అన్నారు. గురువారం మధ్యాహ్నం చాట్రాయి ఇంచార్జ్ ఎంపిడిఓ సత్యనాయణ, చనుబండ ఉన్నత పాఠ శాల ప్రధానోపాధ్యాయులు రవీంద్రనాథ్ లతో కలసి పాఠశాల లోని ఆర్ వో ప్లాంట్ ను పరిశీ లించారు. గత కొంత కాలంగా ఆర్ వోప్లాంట్ పనిచేయడం లేదని, ఆ ప్లాంట్ సప్లై చేసిన కంపెనీ ప్రతినిధులకు మరమ్మత్తు కోసం మెకానిక్ ను పంపవలసిందిగా కోరామని హెచ్ ఎం చెప్పారు. కానీ ఇప్పటివరకు ప్లాంట్ మెకానిక్ రిపేర్ చేయడానికి రాలేదని హెచ్ ఎం అన్నా రు. ఇంచార్జ్ ఎంపిడిఓ సత్యనాయణ ప్లాంట్ సప్లై చేసిన కంపెనీ ప్రతినిధులకు ఫోన్ చేసి వెంటనే మెకానిక్ ని పంపి ప్లాంట్ రిపేర్ చేయించాలని ఆదేశించారు. కంపెనీ ప్రతినిధులు కూడా వెంటనే మెకానిక్ ని పంపి ప్లాంట్ రిపేర్ చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో కూటమి నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కె కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో... తిలక్, ఆజాద్ల జయంతి.



ప్రజా భూమి ప్రతినిధి–కామవరపుకోట

స్థానిక కామవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె విజయబాబు సూచనల మేరకు కళాశాల విద్య అకడమిక్ క్యాలెండర్ ప్రకారం నేడు రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో భారత స్వాతంత్ర్య సమర చరిత్ర లో మహనీయులు “బాలగంగాధర్ తిలక్ మరియు చంద్రశేఖర్ ఆజాద్” జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ఇంఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం మధు తిలక్ మరియు ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం ఇంఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం మధు ప్రసంగిస్తూ లోకమాన్య తిలక్ ‘స్వరాజ్యం నా జన్మహక్కు’ అని ప్రజల్లో చైతన్యాన్ని నింపగా, చంద్రశేఖర్ ఆజాద్ తన అచంచల దేశభక్తితో యువతలో త్యాగస్ఫూర్తిని పెంపొందించారని పేర్కొన్నారు. పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడు ధారావతు మల్లేష్ ప్రసంగిస్తూ మన దేశ స్వాతంత్ర్య సాధన కోసం ఈ మహనీయుల త్యాగం, దేశభక్తి, ధైర్యసాహసాలు యువతకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. తెలుగు అధ్యాపకులు డాక్టర్ జి శ్రీనివాసరావు స్వాతంత్ర్య ఉద్యమ ఘట్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం మధు తో పాటు ఐ క్యూ ఎ సి కో – ఆర్డినేటర్ డాక్టర్ జి శ్రీనివాసరావు, ఇతర అధ్యాపకులు ధారావతు మల్లేష్, ఎం విజయ కృష్ణ, అధ్యాపకేతర సిబ్బంది కుమార్ రాజా తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

జనరల్ 14

శుక్రవారం 24 జూలై 2026

## శ్రీ రఘునాధ స్వామికి శోభయాత్ర



ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు

అయోధ్య లో నిర్మాణం చేపట్టిన శ్రీ కళ్యాణ రామ దేవాలయం నిర్వాహకులు చల్లా శ్రీనివాస్ శాస్త్రి ఆ ఆలయం లో ప్రతిష్ట చేసే స్వర్ణ బలరాముని దివ్య విగ్రహం, స్వర్ణ పాదుకలు, స్వర్ణ విల్లు, స్వర్ణ బాణం గొల్లపల్లి పరిసర గ్రామ ప్రజల దర్శనార్థం ఉదయం ఎం ఎన్ కే రోడ్ నుండి వందలాది భక్తులు శ్రీ రఘునాథస్వామి వార్ల దేవస్థానం అధికారులు అర్చక స్వాములు పాలక మండలి చైర్మన్ దంపతులు మరియు కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఆహ్వానం పలికి గ్రామ వీధులు, మాడ వీధుల గుండా మేళతాళ లతో శోభా యాత్ర నిర్వహించి శ్రీ రఘునాథ స్వామి ఆలయం వద్ద పూర్ణ కుంభం తో పాలక మండలి చైర్మన్ దంపతులు బంగారు బాల రాముని ను ఆలయం లోపలికి తీసుకుని వెళ్ళి, సనాతన ధర్మం ప్రకారం పూజాది కార్యక్రమం నిర్వహించి భక్తులకు శ్రీ బాల రాముని స్వర్ణ విగ్రహం, విల్లు, బాణం మరియు పాదుకలు దర్శనం కలుగ చేసి తీర్థ ప్రసాదాలను భక్తులు స్వీకరించి అయోధ్య రాముని ఆశీస్సులు పొందారు. ఈ రోజు ఈ పుణ్య కార్యక్రమంలో పాల్గొన్న అన్ని విధాలుగా అండదండలు ప్రత్యేక పూజలు నిర్వహించ సహకారం అందించన దేవాలయంకార్యనిర్వహణాధికారి కి, పాలక మండలి చైర్మన్ దంపతులుకు మరియు సభ్యులు కు, హైందవశక్తి భక్తులు కు ప్రత్యేక ధన్యవాదాలను తెలిపారు.

## మిషన్ వాత్సల్య పోర్టల్‌లో దత్తత కార్యక్రమం అనుసంధానం చేయబడినది.

-జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి.



ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు

శిశు గృహలో తాత్కాలిక వసతి పొందుతున్న బేబీ కృతిక అను 3 నెలల వయస్సు గల పాపను చెన్నై , తమిళనాడు కి చెందిన కుమారీ, మధు శ్రీనివాసన్ దంపతులకు గురువారం జిల్లా కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి దత్తత తల్లి అయిన కుమారి మధు శ్రీనివాసన్ కి బేబీ కృతిక ను అందించారు. వీరు 2022 లో అడాప్షన్ కి ( సి ఎ ఆర్ ఎ) నందు దత్తత కొరకు అర్జీ పెట్టుకొనగా వీరి యొక్క సీనియారిటీ బట్టి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఏలూరు నందుగల కృతిక అనే పాపను మిషన్ వాత్సల్య పోర్టల్ ద్వారా రెఫరల్ వెళ్లగా రిజర్వ్ చేసుకున్నారు. దత్తత కమిటీ వారు అన్నీ ధ్రువపత్రాలు సరిచూసిన తర్వాత గురువారం ఈ రోజు జిల్లా మేజిస్ట్రేట్ వారి ద్వారా బేబీ నీ అందించారు. ఈ దత్తత కార్యక్రమం లో మహిళా భివృద్ధి మరియు శిశు సంక్షేమ సాధికారిత అధికారి పి. శారద, జిల్లా బాలల సంరక్షణ అధికారి సి. హెచ్ సూర్య చక్రవేణి , శిశుగృహ మేనేజర్ కె. భార్గవి మరియు నర్స్ ఎ. విశాలి తదితరులు పాల్గొన్నారు..

## జీవో 1235 అమలు చేసి దళితుల స్మశాన వాటికను రక్షించాలి

– ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని లోకనాథం డిమాండ్



ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

దళితుల స్మశాన వాటికలను రక్షించేందుకు ప్రభుత్వం వెంటనే జీవో నెం.1235ను అమలు చేసి, ఆక్రమణలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. లోకనాథం డిమాండ్ చేశారు. సామాజిక శంఖారావం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆగిరిపల్లి మండలం చిన్న ఆగిరిపల్లి గ్రామంలో దళితుల స్మశాన వాటికను పరిశీలించిన ఆయన, సుమారు 80 సెంట్ల భూమి ఆక్రమణకు గురైందని ఆరోపించారు. అధికారులు కొలత రాళ్లు ఏర్పాటు చేసినప్పటికీ వాటిని తొలగించి ఆక్రమణలు జరిగినా రెవెన్యూ శాఖ పట్టించుకోవడం లేదని విమర్శించారు. దళితవాడలో తాగునీరు వంటి కనీస సౌకర్యాలు కూడా లేవని, స్మశాన వాటికకు ఫెన్సింగ్, షెడ్డు, బోరు ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలని కోరారు. అలాగే చిన్న ఆగిరిపల్లిలో పేదలు సాగు చేస్తున్న కొండ పోరంబోకు భూములను వారికి కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణ మాట్లాడుతూ, దళితుల సమస్యల పరిష్కారానికి జిల్లావ్యాప్తంగా సామాజిక శంఖారావం నిర్వహిస్తూ సర్వేలు చేస్తున్నామని, సమస్యలు పరిష్కారం కాకపోతే ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

## పెన్ డౌన్ సమ్మెకు సంఘీభావం

-విశ్రాంత హెచ్ఎం నరసింహారెడ్డి

ప్రజా భూమి ప్రతినిధి-ఆవేంపల్లె



దస్తావేజుల లేఖరుల నిరవధిక పెన్ డౌన్ సమ్మెకు సంఘీభావంగా మద్దతు తెలిపినట్లు విశ్రాంత హెచ్ఎం నరసింహారెడ్డి వెల్లడించారు. గురువారం స్థానిక సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద చేపట్టిన ఆ సమ్మెకు విశ్రాంత హెచ్ఎం నరసింహారెడ్డి, మాజీ కోఆప్షన్ సాదక్ వలి, బచ్చు వెంకట సుబ్బారావు, రఘునాథ్ రెడ్డి, కొత్తూరు రెడ్డయ్య లు మద్దతుగా నిలిచారు. ఇటీవల ప్రభుత్వం తెచ్చిన జీఓ 396ని వెంటనే రద్దు చేయాలని కోరుతూ దస్తావేజు లేఖరులు, స్టాంప్ వెండర్లు, డిటిపి ఆపరేటర్లు పెన్ డౌన్ సమ్మె ప్రకటించారు. వేలాది మంది దస్తావేజు లేఖరులు, డిటిపి ఆపరేటర్ల జీవనోపాధిని కోల్పోయి రోడ్డున పడే అవకాశం ఉందని, వీరికి ప్రభుత్వం ఆర్థిక బద్రత కల్పిస్తూ జీఓ 396ని రద్దు చేయాలని వారు కోరారు.

### జిల్లాలోని 1772 ప్రభుత్వ పాఠశాలు,

# 20 జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్స్,టీచర్స్ మీట్

- విద్యార్థుల తల్లితండ్రులు ఇద్దరూ తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలి.
- మెగా పేరెంట్స్,టీచర్స్ మీట్ కార్యక్రమం ఏర్పాట్లను పాత్రికేయుల సమావేశంలో తెలియజేసిన జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి.

ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా.

ఏలూరు,జిల్లాలోని 1772 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈనెల 24వ తేదీన మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. స్థానిక కలెక్టరేట్ లో గురువారం ఈనెల 24వ తేదీన నిర్వహించనున్న మెగా పేరెంట్స్,టీచర్స్ మీట్ కార్యక్రమం ఏర్పాట్లను పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్ తెలియజేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలు, సంక్షేమ పథకాలతో విద్యార్థుల ప్రమాణస్థాయి లో ఎంతో మెరుగుదల కనిపిస్తున్నదన్నారు. ఈనెల 24వ తేదీన జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్స్,టీచర్స్ మీట్ కార్యక్రమం ఒక పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, విద్యా ప్రమాణాలు పెంపుదల , తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం, పాఠశాల-కుటుంబ సంబంధాలను పటిష్టపరచడం మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. తమ పిల్లలు అభ్యాసన స్థాయిని తెలుసుకోవడం, వాటిని మరింత పెంపొందించేందుకు అవసరమైన సూచనలు అందించడం, పాఠశాల, విద్యా ప్రమాణాల స్థాయిని పెంచేందుకు తీసుకోవలసిన చర్యలపై చర్చించి నిర్ణయాలు తీసుకోవచ్చన్నారు. తమ పిల్లల విద్యాభివృద్ధిపై తల్లితండ్రులు ఇద్దరికీ బాధ్యత ఉందని, మెగా పేరెంట్స్,టీచర్స్ మీట్ కార్యక్రమంలో తల్లితండ్రులు ఇద్దరూ పాల్గొని తమ పిల్లల అభ్యాసన స్థాయిని పరిశీలించాలన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ఈ కార్యక్రమంలో తెలియజేయడం జరుగుతుందని, అర్హత ఉండి సంక్షేమ కార్యక్రమాలు అమలు కానీ తల్లితండ్రుల వివరాలు, అమలు కాకపోవడానికి కారణాలు తెలుసుకుని, వాటి



లబ్ధి వారికి అందేలా తీసుకోవాలని చర్యలను తెలియజేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా మాదకద్రవ్యాల వినియోగం కారణంగా జరిగే అనర్థాలు, సైబర్ నేరాలపై విద్యార్థులు, తల్లితండ్రులకు అవగాహన కలిగించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు జరిగిన మెగా పేరెంట్స్,టీచర్స్ మీట్ కార్యక్రమాలు అన్ని విజయవంతంగా జరిగాయన్నారు. కార్యక్రమానికి సంబంధించి ఆహ్వానపత్రాన్ని విద్యార్థులు స్వయంగా తయారుచేసి అందరికీ అందిస్తున్నారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులు, పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, దాతలు, గ్రామ పెద్దలు, విద్యాశాఖ అధికారులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొనేలా ఆహ్వాన పత్రాలు ప్రతిఒక్కరికీ అందిస్తున్నారన్నారు. పేరెంట్స్, టీచర్ మీటింగ్ సందర్భంగా ప్రతి విద్యార్థికి సంబంధించిన ప్రోగ్రెస్ కార్డు, హాజరు వివరాలు, విషయాల వారీగా అభ్యాసన స్థాయి, ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ ఎల్ ఎన్) పురోగతి, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, కార్యక్రమాల్లో వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై తల్లిదండ్రులకు సమగ్ర సమాచారం అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమం ఉదయం 9.30 ని.ల నుండి మధ్యాహ్నం 12. 45 ని.ల వరకు నిర్వహించడం జరుగుతుందని, తల్లితండ్రులను, ముఖ్యఅతిదులను కార్యక్రమానికి ఆహ్వానిస్తారన్నారు. ముందుగా మా తెలుగుతల్లికి మల్లెపూదండ.. గేయంతో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాలకు సంబంధిం చి నివేదికను తెలియజేస్తారని, అనంతరం తరగతుల వారీగా విద్యార్థుల విద్యా స్థాయికి సంబంధించిన నివేదికను తల్లితండ్రులకు తెలియజేస్తారని, అనంతరం పాఠశాల అభివృ ద్ధి గురించి తెలియజేసి, తల్లితండ్రుల సమస్య లను అడిగి తెలుసుకుంటారన్నారు. పాఠశాల అభివృద్ధికి స్థానిక దాతలు విరాళాలు ఇచ్చేందు కు ముందుకు వస్తున్నారని, వాటిని కూడా ఈ కార్యక్రమంలో పరిశీలించడం జరుగుతుందన్నారు.

# జులై 24న విద్యాసంస్థల బందును విజయవంతం చేయాలి

### వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు



కుకునూరు

నీట్ పేపర్ లీకేజీ కి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని జులై 24న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంధను విజయవంతం చేసి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరుతూ బుధవారం కుక్కునూరు మండలంలోని విద్యాసంస్థలకు బంద్ నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2014 నుంచి దేశవ్యాప్తంగా 152 పరీక్ష పత్రాలు లీక్ కావడం దేశ విద్యా వ్యవస్థలో తీవ్రమైన వైఫల్యానికి నిదర్శనమని అన్నారు .నీట్ పేపర్ లీకేజీ కారణంగా విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని కేంద్ర ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నీట్ పరీక్ష విధానా న్ని రద్దుచేసి రాష్ట్రాలవారీగా మెడికల్ ప్రవేశ పరీక్షలు నిర్వహించాలని కోరారు .ఈ సంద ర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ జూని యర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల, కేజీబీవీ ,లిటిల్ స్టార్ ప్రైవేట్ స్కూల్, శ్లోక కాన్సెప్ట్ ప్రవేట్ స్కూల్, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు ,ఎంఈఓ కార్యాలయం తో పాటు వెంకటా పురం, పెదరాయగూడెం, భువనగిరి ,బంజర గూడెం, అమరవరం, ఉప్పేరు, దామరచర్ల, చీరవల్లి, గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలకు బం ద్ నోటీసులు అందజేశారు ఈ కార్యక్రమంలో ఏఐటియుసి మండల కన్వీనర్ కొన్నే లక్ష్మయ్య ,ఎస్ఎఫ్ఐ పూర్వ జిల్లా సహాయ కార్యదర్శి ఎర్నం సాయికిరణ్, వైసిపి సోషల్ మీడియా పోలవరం నియోజకవర్గ ఇన్చార్జ్ మల్లెల చంటి నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రంశెట్టి నాగేంద్రరావు, సిఐటియు మండల కో కన్వీనర్ షేక్ వలీ పాషా, కాంగ్రెస్ పోలవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ బండి విజయ్ భాస్కర్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి వడ్డె రఘుబాబు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గజ్జి రాజులు పాల్గొన్నారు

# రంపచోడవరంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన

- మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లో పాల్గొననున్న సీఎం
- 'తల్లికి వందనం' లబ్ధిదారులతో ముచ్చటించనున్న చంద్రబాబు
- ప్రభుత్వ బడిలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేయనున్న ముఖ్యమంత్రి

ప్రజాభూమి ప్రతినిధి-అమరావతి

పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం పర్యటించనున్నారు. రంపచోడవరంలోని ప్రభుత్వ హైస్కూల్ - జూనియర్ కాలేజీ ప్రాంగణంలో నిర్వహించే మెగా పేరెంట్ - టీచర్ మీటింగ్‌లో పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హాజరు కానున్నారు. విద్యార్థులతో కలిసి ఇరువురు నేతలు విద్యార్థులు-తల్లిదండ్రులు-ఉపాధ్యాయులతో సమావేశం అవుతారు. అనంతరం వారితో కలిసి మధ్యాహ్నం భోజనం చేస్తారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి విద్యార్థుల విద్యా ప్రగతిని సమీక్షించి, వారి అభివృద్ధికి అవసరమైన చర్యలను తీసుకునేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. 2024లో ప్రభుత్వం ఏర్పడ్డాక శుక్రవారం నిర్వహించే మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ కార్యక్రమం నాలుగోది.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు**

సీఎం చంద్రబాబు శుక్రవారం ఉదయం 9:10 గంటలకు క్యాంప్ కార్యాలయం నుంచి బయలుదేరి 10:00 గంటలకు పోలవరం జిల్లా రంపచోడవరానికి చేరుకుంటారు. 10:20 గంటలకు ప్రభుత్వ హైస్కూల్ ఑ జూనియర్ కాలేజీ ప్రాంగణానికి చేరుకుంటారు. 10:20 మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లో పాల్గొంటారు. 11:35 గంటలకు ప్రజావేదిక సభలో పాల్గొని ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 1:20 నుంచి గంటలకు మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులతో ముఖాముఖి నిర్వహిస్తారు. 02:30 గంటలకు ఐ.పోలవరంలో టీడీపీ కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 4:25 గంటలకు రంపచోడవరం పర్యటన ముగించుకుని 5:15 గంటలకు క్యాంప్ కార్యాలయానికి చేరుకుంటారు.

# ఎర్రచందనం మాఫియా మూలాలను పూర్తిగా తుడిచేయాలి

- డ్రోన్ పరిజ్ఞానం, అత్యాధునిక సాంకేతికత వినియోగించుకొంటూ నిఘా పటిష్టం చేయాలి
- స్మగ్లింగ్ అరికట్టడంలో జీరో టాలరెన్స్ విధానాన్ని కఠినంగా అమలు చేయాలి
- స్మగ్లర్లతోపాటు కింగ్ పిన్‌లపైనా ఉక్కుపాదం మోపండి
- మన ఎర్ర చందనాన్ని దేశంలో ఎక్కడ దాచినా వదలవద్దు
- ఎర్రచందనం స్మగ్లింగ్ నిరోధంపై అటవీ శాఖ ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



ప్రజాభూమి ప్రతినిధి-అమరావతి

'రాష్ట్రంలో ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తిగా తుడిచిపెట్టే లక్ష్యంతో అటవీ శాఖ ప్రణాళికలకు మరింత పదును పెట్టాలి. ఇందుకోసం స్మగ్లింగ్ ముఠాలపై నిఘా పెంచాలి. డ్రోన్ పరిజ్ఞానం, అత్యాధునిక సాంకేతికత వినియోగించుకొంటూ నిఘా పటిష్టం చేయాల'ని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఆదేశించారు. స్మగ్లింగ్ ముఠాల నెట్ వర్క్ ను మూలాలతో సహా నిర్మూలించేలా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని, అక్రమ రవాణాకు ఎలాంటి అవకాశం లేకుండా జీరో టాలరెన్స్ విధానాన్ని కఠినంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధం, రెండేళ్లలో ఏ మేరకు స్మగ్లింగ్ నిరోధించారు, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై అటవీశాఖ ఉన్నతాధికారులతో పవన్ కళ్యాణ్ సమీక్షించారు. ఈ సందర్భంగా గడచిన రెండేళ్లలో ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు అటవీ శాఖ తీసుకున్న చర్యలు, సాధించిన ప్రగతి, నమోదైన కేసుల వివరాలను అధికారులు వివరించారు.

**506 కేసులు... 1239మంది అరెస్టు**

గత రెండేళ్లలో ఎర్రచందనం అక్రమ రవాణాపై కఠిన చర్యలు చేపట్టినట్లు అధికారులు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి వివరించారు. 506 కేసులు నమోదు చేసి, 1,239 మందిని అరెస్ట్ చేయగా, 372 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే, 12 మంది ప్రధాన స్మగ్లర్లపై పీడీ చట్టం కింద చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. గుజరాత్, ఢిల్లీ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో అక్రమంగా నిల్వ చేసిన ఎర్రచందనాన్ని గుర్తించి, ఆయా రాష్ట్రాల పోలీసు, అటవీ శాఖల సమన్వయంతో ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించి 35.6 మెట్రిక్ టన్నుల ఎర్రచందనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. గత ప్రభుత్వ హయాంలో ఇటువంటి అంతర్రాష్ట్ర ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించలేదని పేర్కొన్నారు. అలాగే, ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల్లో గతంలో కన్విక్షన్ రేటు 3 శాతం కంటే తక్కువగా ఉండేదని, 95 శాతం కేసుల్లో నిందితులకు కోర్టులు శిక్షలు విధించే స్థాయికి కన్విక్షన్ రేటు పెరిగిందని వివరించారు. గతంలో స్మగ్లర్లపై పీడీ చట్టం అమలు చేయని పరిస్థితి ఉండగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే 12 మంది స్మగ్లర్లపై పీడీ చట్టం కింద చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

**సమన్వయం తక్షణ అవసరం**

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... "ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి మాత్రమే ప్రత్యేకించిన అటవీ సంపద... ఎర్ర చందనం. కాపాడుకోవడం మనందరి బాధ్యత. ఎర్ర చందనం స్మగ్లింగ్ పై కూటమి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది. ప్రభుత్వం అవలంబిస్తున్న జీరో టాలరెన్స్ విధానాన్ని క్షేత్రస్థాయిలో మరింత పటిష్టంగా అమలు చేయాలి. దేశంలో ఎక్కడ ఎర్రచందనం అక్రమ నిల్వలు ఉన్నా ఆయా రాష్ట్రాల అధికారులతో సమన్వయం చేసుకుని వాటిని స్వాధీనం చేసుకోవాలి.

ఇతర రాష్ట్రాల పోలీసు, అటవీ శాఖ అధికారులతో సమన్వ యం తక్షణ అవసరం. స్మగ్లింగ్ ముఠాల వెనుక ఉన్న కింగ్ పిన్స్, ఫైనాన్షియర్స్ పైనా దృష్టి సారించాలి. బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి. రాష్ట్రానికి చెందిన విలువైన ఎర్రచందనం సంపదను రక్షించేందు కు అత్యాధునిక సాంకేతికత, డ్రోన్ల పరిజ్ఞానా న్ని వినియోగించుకొంటూ నిఘాను మరింత విస్తృతంగా వినియోగించాలి. అంతర్రాష్ట్ర సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి, ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు అన్ని శాఖలు సమష్టిగా పనిచేయాల"న్నారు.